ఈనాడు
గుంటూరు
గురువారం 4 జనవరి 2018 16 పేజీలు

కట్టడి అయ్యేనా?

- ▲ కోడి పందేలపై హైకోర్టు ఆగ్రహం
- ▲ పోలీసులు చూపేనా కరకుదనం!

సంక్రాంతి పండుగకు ఏటా కోడి పందేలు జరుగుతుండడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వీటిని నిర్వహించకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను ఆదేశించింది. తమ ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారంటూ అక్షింతలు వేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో పందేలను నిలువరించడం పోలీసులకు పెనుసవాల్‌గా మారింది.



న్యూస్‌టుడే- బాపట్ల, రేపల్లె అర్బన్

జిల్లాలో తీర ప్రాంత నియోజకవర్గాలైన రేపల్లె, బాపట్ల కోళ్ల పందేలకు ప్రసిద్ధి. దీంతో కొందరు వీటిని వ్యాపారంగా భావించి పందెం కోళ్లను వందల సంఖ్యలో పెంచుతున్నారు. వీటి విక్రయం ద్వారా రూ.50 లక్షల నుంచి కోటి వరకు ఆదాయాన్ని గడిస్తున్నారు. మరో పది రోజుల్లో పండుగ వస్తుండగా ఈపాటికే పల్లెల్లో మారుమూల గుట్టుచప్పుడు కాకుండా పందేలు ప్రారంభించారు. పోలీసులు అడపాదడపా దాడులు చేసి పట్టుకుంటున్నా రూ.2-10 వేలలోపు జరిగే చిన్న పందేలు కావటం గమనార్హం. రూ.కోట్లలో సాగేవి సాగుతుండడంతో పందెం కోడిని రూ.లక్ష నుంచి రెండు లక్షలు వెచ్చించి కొనుగోలు చేయటానికైనా వెనుకాడటం లేదు. కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలకు ఇక్కడి నుంచి కోళ్లను ఖరీదైన కార్లలో పంపిస్తున్నారు.

రెండేళ్ల నుంచే ఇక్కడ... : 2014 వరకు బాపట్ల, రేపల్లె నుంచి పదుల సంఖ్యలో పందెంరాయుళ్లు కోళ్లు తీసుకుని ఎక్కువగా భీమవరం, ఏలూరు, నరసాపురం, భీమడోలు, దేవరపల్లి, పాలకొల్లు ప్రాంతాలకు వెళ్లి నాలుగైదు రోజులపాటు అక్కడే ఉండి పందేలు కాసి వచ్చేవారు. 2015 సంక్రాంతి నుంచి రేపల్లె ప్రాంతంలో బహిరంగంగా కోళ్ల పందేలను నిర్వహిస్తున్నారు. వీటిపై నిషేధాన్ని హైకోర్టు విధించినా స్వయంగా ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలోనే జరుగుతుండడంతో ఇక్కడకు వచ్చి పందేలు కాసే వారి సంఖ్య ఎక్కువైంది. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో ఉదయం (మిగతా 15లో)

పోషకాల సమతుల్యతకు అవశేషాలే ఆచ్ఛాదన

ఈనాడు డిజిటల్, గుంటూరు

నేలలోని పోషకాల సమతుల్యత కొనసాగడానికి పంటల అవశేషాలన్నింటినీ తప్పనిసరిగా ఆచ్ఛాదనగా మాత్రమే వాడాలని ప్రకృతి సేద్యం పితామహుడు సుభాష్ పాలేకర్ పేర్కొన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట జరుగుతున్న పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం శిక్షణ శిబిరాల నాలుగో రోజు బుధవారం ఆయన రైతులకు 'ప్రకృతిలో ఉన్న (మిగతా 15లో)

ప్రకృతి సేద్యమైనా ఫలించేనా?



ప్రకృతి సేద్యంపై పుస్తకాలను ఆసక్తిగా తిలకిస్తున్న రైతులు

- ● ప్రత్యామ్నాయం వైపు మొగ్గు
- ● పెట్టుబడి లేక రైతుల ఆసక్తి
- ● అనుభవాలు తెలుసుకున్న 'ఈనాడు'

ఈనాడు, గుంటూరు

అధిక దిగుబడుల సాధనకు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడి నష్టాల బాటలో కొనసాగుతున్న రైతులు పెట్టుబడి లేని ప్రకృతి సేద్యంపై ఆసక్తి చూపుతున్నారు. ఈపాటికే కొందరు సదరు సాగు చేపట్టి కొంత వరకు ఫలితాలు సాధించినా మరిన్ని మెలకువలు నేర్చుకోవడానికి ప్రకృతి వ్యవసాయ పితామహుడు పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ఆధ్వర్యాన ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం వద్ద జరుగుతున్న శిక్షణకు హాజరవుతున్నారు. మరికొందరు కొత్త విధానంలోనైనా సాగు లాభసాటిగా మారుతుందేమో ఒకసారి చూద్దామనే ధోరణితో వస్తున్నారు. సందేహాలు నివృత్తి చేసుకుంటూనే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. దిగుబడులకు మార్కెటింగ్ (మిగతా 15లో)

వెలగని విద్యా జ్యోతి

- ముందుగా ముద్రించి ఏం లాభం?
- పంపిణీకి మీనమేషాలా?





కట్టలు కట్టలుగానే స్టడీ మెటీరియల్

నిపుణులైన ఉపాధ్యాయులతో జిల్లా పాలనాధికారి తయారు చేయించిన అభ్యసనావళి(స్టడీ మెటీరియల్) సకాలంలో ముద్రితమైందని పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో సంబరపడ్డారు. అయితే ఆచరణకు వచ్చేసరికి షరా మాములే అయ్యింది. ఏటా మాదిరే ఈసారీ జనవరిలోనే ఆ పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు చేయటంపై విమర్శలు వినవస్తున్నాయి. గత నెలలోనే వాటిని ముద్రించినా జన్మభూమి గ్రామసభల్లో ప్రజాప్రతినిధులతో అందజేయించాలని అనేక పాఠశాలల్లో స్ట్రాంగ్ రూమ్‌లకే పరిమితం చేశారు. ఇప్పటికైనా అవి విద్యార్థులకు చేరకపోతే వాటిపై వెచ్చించిన సుమారు రూ.అరకోటి బూడిదలో పోసిన పన్నీరుగా మారుతుందనే అభిప్రాయం ఉపాధ్యాయవర్గం నుంచి వ్యక్తమవుతోంది.

ఈనాడు, గుంటూరు

అభ్యసనావళి పుస్తకాలను ముద్రణకర్త పక్షం రోజుల కిందటే ముద్రించి జిల్లా విద్యాశాఖకు అందజేయగా గత నెల 23న గుంటూరులో జరిగిన రాష్ట్ర క్రిస్మస్ వేడుకల్లో సీఎం చంద్రబాబుతో వాటిని ఆవిష్కరింపజేసింది. ఇది జరిగి పది రోజులు దాటినా ఇంకా పంపిణీ చేయకపోవటం ఆ శాఖ పనితీరును చెప్పకనే చెబుతోంది. పది ఫలితాల్లో అత్యుత్తమ గ్రేడ్ల సాధనకు, వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు (మిగతా 15లో)

ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా రోడ్డు ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అధిక వేగం, నిద్ర, మద్యం మత్తు తదితర కారణాలతో జరుగుతున్న ప్రమాదాల దారి వేరు. వాటిని పోలీసింగ్ ద్వారా నియంత్రించటానికి ప్రయత్నించవచ్చు. ఇవి కాకుండా రోడ్డు నిర్మాణ, నిర్వహణలో, అది సాగుతున్న దారిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా? ఉంటే అవి ఏమిటి? వాటి పరిష్కారాలకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పరిశీలనకు ఆదేశాలు ఇచ్చింది. దానితో రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం ఆదేశాలతో రాష్ట్రంలోని ప్రధాన రహదారుల్లో 'రోడ్డు సేఫ్టీ ఆడిట్' చేయనున్నారు. దీనిలో జాతీయ రహదారి-16(ఎన్‌హెచ్-16) కీలకమైంది. రవాణాశాఖ సంయుక్త కమిషనర్ ఎస్‌ఏవీ ప్రసాదరావు పర్యవేక్షణలో ఎన్‌హెచ్-16 సర్వేకు అధికారులు దిగారు. ఎట్టి పరిస్థితిలోనూ ప్రమాదాలను నివారించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కార్యాచరణ సిద్ధమైంది.


ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్న నర్సరావుపేట జంక్షన్

ప్రమాద హేతువు.. తెలిసిందిలే..!

- జాతీయ రహదారి-16 ప్రమాద కారణాలు, నివారణలపై లోతైన సర్వే
- పూర్తయిన పరిశీలన.. ప్రభుత్వానికి నివేదిక

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

రవాణాశాఖ, జాతీయ రహదారుల సంస్థ అధికారులతో పాటు ఇంజినీరింగ్ నిపుణులు బృందాలుగా ఏర్పడ్డారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు రాజధాని పరిధిలో ఇటు గుంటూరు, అటు కృష్ణా జిల్లాలలో పరిశీలన జరిగింది. కృష్ణా జిల్లాలో వారధి నుంచి హనుమాన్‌జంక్షన్ వెలుపల జిల్లా సరిహద్దుల వరకు సర్వే చేశారు. ప్రభుత్వానికి తాము గుర్తించిన లోపాలతో నివేదికను కూడా ఇటీవల పంపారు. మరో వంక గుంటూరు జిల్లాలో కనకదుర్గ వారధి నుంచి తాతపూడి వరకు(జిల్లా సరిహద్దు) బృందాల సర్వే ఇటీవల ముగిసింది. నివేదిక రూపకల్పనలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. రెండు, మూడు రోజులలో ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి చేరనుంది. జిల్లాలో డీటీసీ రాజారత్నం పర్యవేక్షణలో ఎమ్‌వీఐలు బి.సత్యనారాయణప్రసాద్, అమరానాయక్, బాలకృష్ణలతో పాటు కేఎల్‌యూ, గుంటూరు ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఆచార్యులు, సివిల్ విభాగంలో నాలుగో ఏడాదిలో ఉన్న విద్యార్థులు ఈ సర్వేలో పాలు పంచుకున్నారు.


హైవేలోకి వాహనాలు అటు గుంటూరులోకి, ఇటు విజయవాడ వైపు నుంచి అనధికారికంగా దిగటం, ఎక్కటం

డ్రోన్ కెమెరాలతో సచిత్రంగా సమగ్ర నివేదిక

జాతీయ రహదారి -16పై రోడ్ సేఫ్టీ ఆడిట్‌ను క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలనతో పాటు డ్రోన్ కెమెరాలతో వీడియో, ఫొటోలతో చిత్రీకరించటం జరిగిందని కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా పరిధిలో సమన్వయం చేసిన తెనాలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణప్రసాద్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. అంతేకాక లోకేషన్లను జియోట్యాగింగ్ చేయటం జరిగిందన్నారు. హైవే మీద వీలైనన్ని ఎక్కువ ప్రాంతాలలో కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటిని జిల్లా పరిధిలో కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించాలని కూడా సూచించామన్నారు. నివేదిక రెండు మూడు రోజులలో ప్రభుత్వానికి అటు నుంచి నేషనల్ హైవే విభాగానికి చేరుతుందన్నారు. గుర్తించిన లోపాలు సవరించిన తర్వాత తిరిగి మరోమారు రీ-సర్వే ఉంటుందని వివరించారు.

చిలకలూరిపేటలో ప్రధాన సమస్య

ఇవన్నీ ఒకటికి నాలుగు ప్రాంతాలలో గమనించిన లోపాలు కాగా ఒక ప్రాంత పరిధిలో గుర్తించిన ప్రధాన సమస్య చిలకలూరిపేటది. జాతీయ రహదారి - 16 ఈ పట్టణం మధ్యలో నుంచి వెళుతుంది. నర్సరావుపేట జంక్షన్, పురుషోత్తమ్మపట్నం కూడలి వంటి ప్రాంతాలలో అటు చిలకలూరిపేట, ఇటు నర్సరావుపేటకు దారి తీసే మార్గాలు ఈ రహదారితో అనుసంధానమై ఉన్నాయి. ఈ మార్గాలలో నలువైపులా నుంచి ఎలాంటి క్రమశిక్షణ లేకుండా వాహనాలు నేరుగా జాతీయ రహదారిపైకి వస్తున్న వైనం పరిశీలిస్తే ఒళ్లు గగుర్పొడుస్తుంది. అంతటి ప్రమాదక ప్రాంతంగా దీనిని నిర్ధరించారు. ఈ సమస్య పరిష్కారానికి బైపాస్ నిర్మించటమే మార్గంగా అధికారులు, నిపుణులు తమ నివేదికలో స్పష్టం చేశారు.

గుర్తించిన లోపాలు ఇలా

వెలుగు సరిగ్గా లేకపోవటం. (హైవేలో కొన్ని ప్రాంతాలలో దీపాలు లేవు, ఉన్న వాటిల్లో మరమ్మతులకు గురైన వాటికి సత్వర పరిష్కారం లభించటం లేదు).





దారి తప్పిస్తున్నారు

క్యాట్ ఐస్ (రోడ్డు మీద దారిని చూపుతూ మెరుస్తూ ఉండే స్ఫటికాల వంటివి) లేకపోవటం, ఉన్నవి పగిలిపోతే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయక పోవటం. ఈ సమస్య వల్ల రాత్రి సమయంలో మలుపులు సరిగ్గా అర్థం కాక రోడ్డు వెలుపలికి వాహనాలు దూసుకుపోతుంటాయి.


సర్వీస్ రోడ్లు సరిగ్గా లేకపోవడం

గ్రామాలు, పట్టణాల నుంచి హైవేకు, అటు నుంచి గ్రామాలకు చేరే సర్వీస్ రోడ్లు చాలా చోట్ల సరిగ్గా లేవు. దీని వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి.



రహదారి క్రమశిక్షణ పాటించడం లేదు..

ఆరు వరుసల జాతీయ రహదారిలో ఆరు వరుసలు ఉంటే మూడు వెళ్లటానికి, మూడు రావటానికి. వీటిలో డివైడర్లకు ఆనుకుని ఉండేవి హై స్పీడ్, దాని పక్కన కొంత తక్కువ, మూడోది మరింత తక్కువ వేగంతో పయనించే వాహనాలకు ఉద్దేశించినవి. అయితే ఈ క్రమశిక్షణను పాటించకుండా ఒక లేన్ లోకి మరో వాహనం రావటం వల్ల వాటిని ఓవర్ టేక్ చేసే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.



అడ్డదిడ్డంగా రోడ్డెక్కుతున్నారు..

గ్రామాలు, పట్టణాల నుంచి హైవే మీదకు రావటానికి, కిందకు దిగటానికి మార్గాలను ముందే నిర్దేశించారు. అయితే హెన్‌హెచ్ 16లో అవి మాత్రమే కాకుండా మరో 8 చోట్ల ఇలా వాహనాలు దిగటం, ఎక్కటం చేస్తున్నాయని బృందాలు తమ సర్వేలో గుర్తించాయి. ఇలా ఆకస్మికంగా వాహనాలు జాతీయ రహదారికి రావటం అంటే ప్రమాదాలను ఆహ్వానించటమే. విజయవాడ- గుంటూరు-చిలకలూరిపేట మధ్య ఈ స్థితిని మనం కూడా గమనించవచ్చు.

- రోడ్డు వెంట ఉన్న క్రాష్ బారియర్స్ పగిలిపోవటం, ఫెన్సింగ్‌ను అనధికారికంగా తెరిచి హైవే పైకి నేరుగా రావటం (దీని వల్ల వేగంగా వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం పొంచి ఉంటుంది).

ఒక్కసారిగా కుచించుకుపోతుంది..

- పాత వంతెనలు ఉన్న చోట వాటి స్థానంలో కొత్త వంతెనలు నిర్మించకుండా వాటి నుంచి హైవేకు దారి ఇచ్చారు. దీనితో ఆయా ప్రాంతాలలో హైవే ఇరుకుగా మారింది. గుంటూరు-విజయవాడ మధ్య ఎన్‌హెచ్ 16లో ఇలా మూడు చోట్ల పరిస్థితి ఉంది.
- రైల్వే క్రాసింగ్‌ల వద్ద కూడా హైవే వెడల్పు కుచించుకు పోతుంది. ఆరు వరుసలు కాస్త, ఆయా ప్రాంతాలలో నాలుగు అవుతున్నాయి. దీనితో వాహనాల వేగం ఒక్క సారిగా ఆయా ప్రాంతాలలో తగ్గాల్సి వస్తుంది. లేన్‌లను కూడా మారాల్సి ఉంటుంది. వేగంగా సాగుతున్న పయనంలో ఆకస్మికంగా వస్తున్న ఈ మార్పులు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. తెనాలి-విజయవాడ రైలు మార్గంలో ఉన్న వంతెనల వద్ద ఈ పరిస్థితి మనం గమనించవచ్చు.





నెహ్రూనగర్, న్యూస్‌టుడే : రాజాగారితోటలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలోని సుదర్శనకేంద్రంలో ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తిరుమలలోని శ్రీవారి దర్శనం, గదుల టోకెన్లు జారీ చేస్తారు. ఆదివారం రాత్రి 7 గంటల వరకు కౌంటర్ పనిచేస్తుంది. మంగళవారం సుదర్శనకేంద్రం శెలవు. స్వామివారి ఆర్జిత సేవా టిక్కెట్లు 60 రోజులు ముందస్తుగా, దర్శనం, గదుల టోకెన్లు 90 రోజులు ముందుగా జారీ చేస్తారు. మార్చి మాసం కోటా గదులు, దర్శనం బుధవారం విడుదల చేశారు. ప్రస్తుతం గదులు ఫిబ్రవరి 20వ తేదీ నుంచి మార్చి 31 తేదీల మధ్యలో ఉన్నవి. రూ. 300 దర్శనం టిక్కెట్లు జనవరి 10వ తేదీ నుంచి మార్చి 31 వరకు ఉన్నవి. (ఆన్‌లైన్‌లో గదులు, దర్శనం బుకింగ్ రద్దీని బట్టి ఎప్పుడైనా అయిపోయే అవకాశం ఉంటుంది).

డ్రైవరు ఉద్యోగాల భర్తీ

8 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ


వివరాలు తెలుపుతున్న అర్బన్ ఎస్పీ విజయరావు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : గుంటూరు అర్బన్ పరిధిలో ఖాళీగా ఉన్న 40 హోంగార్డు డ్రైవర్ ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు అర్బన్ ఎస్పీ విజయరావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో వాటిని సంబంధించిన వివరాలను తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఈ నెల 8వ తేదీ నుచి 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థులు రూ.25 డీడీని ఎస్పీ గుంటూరు అర్బన్ జిల్లా పేరుతో.. ఎస్‌బీఐ బ్యాంక్‌లో చెల్లే విధంగా తీసుకొని దాని ద్వారా దరఖాస్తులు పొందవచ్చన్నారు. స్థానిక పోలీసు పెరెడ్‌గ్రౌండ్స్‌లో ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరణ ఉంటుందన్నారు. అభ్యర్థులు 2018 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాల వయసు నిండి 50 సంవత్సరాల లోపు వారై ఉండాలన్నారు. 1968 జనవరి 1వ తేదీ నుంచి 1999 డిసెంబర్ 31 తేదీ మధ్యలో జన్మించినవారై ఉండాలన్నారు. గుంటూరు నగరం, నల్లపాడు, మేడికొండూరు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, చేబ్రోలు, కాకాని, మంగళగిరి, తాడికొండ, తాడేపల్లి పోలీసుస్టేషన్ల పరిధిలోని గ్రామాలకు చెందిన వారు మాత్రమే అర్హులన్నారు. 7వ తరగతి ఉత్తీర్ణులై ఎత్తు 160 సెంటీమీటర్లు ఉండాలన్నారు. సత్‌ప్రవర్తన కలిగి ఆరోగ్యవంతులై ఉండాలన్నారు. దరఖాస్తుదారునికి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు. విద్యార్హత, జనన, స్థానిక, కుల ధ్రువీకరపత్రాలు, ఆధార్‌కార్డు, మూడు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు దరఖాస్తుతో జతచేయాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులను నియామక ప్రక్రియ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు స్వీకారం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మక్కెన జవహర్‌రాణి బుధవారం వాల్తేరులోని ఆంధ్రా విశ్వవిద్యాలయ సమావేశ మందిరంలో సావిత్రిబాయి పూలే రాష్ట్రస్థాయి ఉత్తమ మహిళా ఉపాధ్యాయురాలు అవార్డు అందుకున్నారు. ఆమెకు రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు బంగారు పతకం, ట్యాబ్, రూ.10 వేలు నగదు పంపిణీ చేశారు.

5న జూట్‌మిల్లు వ్యవహారంపై మంత్రి సమక్షంలో చర్చలు

గుంటూరు, న్యూస్‌టుడే: భజరంగ్ జూట్‌మిల్లు అక్రమ లాకౌట్ వ్యవహారంపై ఈనెల 5న కార్మిక శాఖా మంత్రి పితాని సత్యనారాయణ సమక్షంలో చర్చలు జరగనున్నాయి. ఇందులో ప్రధానంగా కార్మికులకు 40 శాతం భాగస్వామ్యం మిల్లులో ఉందా, లేదా అనే అంశంపై చర్చించనున్నారు. కార్మిక సంఘాలు కార్మికులూ భాగస్వాములేనని వాదిస్తుంటే, మిల్లు యాజమాన్యం మాత్రం లేదని స్పష్టం చేస్తుంది. ఈ అంశంపై ఏదో ఒకటి తేలిస్తే మిల్లు తెరిచే విషయంపై సందిగ్ధత వీడుతుంది. కార్మిక శాఖా మంత్రి స్వగ్రామం అయిన పశ్చిమ గోదావరి జిల్లాలోని కొమ్ముచిక్కాలలో 5న సమీక్షా సమావేశం ఉందని, కార్మికశాఖ అధికారులు, కార్మిక సంఘాలు హాజరుకావాలని ఇప్పటికే ఆహ్వానాలు అందాయి.

ఒకే ఒక్కడు..!



వాటర్ స్పోర్ట్స్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ

జిల్లాకు పేరు తెచ్చిన కానిస్టేబుల్

ఓ ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుల్..క్రీడలో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి ఆ శాఖకే పేరు, ప్రతిష్ఠలు తెచ్చి పెట్టాడు. ఏళ్లుగా ఎన్నడూ లేని విధంగా వాటర్ స్పోర్ట్స్ విభాగంలో తొలి ప్రయత్నంలోనే రెండు రజత పతకాలు సాధించి జిల్లాను ఓ మెరుపు మెరిసేలా చేశాడు. ఆ క్రీడ.. ఆ విశేషాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన రైతు సీతారామయ్య- పద్మల కుమారుడే మణికంఠ. పాఠశాల స్థాయి నుంచే తల్లిదండ్రులకు సాయపడుతూ చదువుకున్నారు. ఇంటర్ వరకు కళాశాలకు వెళ్లిన ఆయన..ఆర్థిక వెసులుబాటులేక వ్యవసాయం చేస్తూ దూర విద్యలో డిగ్రీ చేసి 2013లో ఏఆర్ కానిస్టేబులు ఉద్యోగం పొందాడు.


పతకంతో మణికంఠ

కసిగా ఓడి.. ఆపై గెలిచి

పోలీసు శిక్షణ కేంద్రంలో తర్ఫీదు పొందడం ముగిసిన వెంటనే ఆ శాఖ తరపున క్రీడా పోటీలు నిర్వహించారు. అనేక విభాగాల్లో కసిగా పొల్గొన్నా ఆయన ఒక్క దానిలోనూ పతకం సాధించ లేదు. అతనిలోని కసిని చూసి అధికారులు నీవు నిరాశ చెందకు వాటర్ గేమ్ వచ్చింది. దానిలో పాల్గొనాలంటే ఈత వచ్చి ఉండాలన్నారు. అప్పుడు మణికంఠ ముఖంలో ఆనందం కనిపించింది. అక్కడే ఉన్న ఈతకొలనుతో ఈతకొట్టమన్నారు. ప్రతిభ చూసి వెంటనే వాటర్ గేమ్స్ శిక్షణకు ఎంపిక చేశారు. దానిలో రోయింగ్, కెనోయింగ్, కైయాకింగ్ మూడు విభాగాలు ఉన్నాయి. కెనోయింగ్ విభాగాన్ని ఆయన ఎంచుకున్నాడు. పొడవాటి పడవలో (తెడ్డువేస్తూ) నీటిని వేగంగా కదిలిస్తూ తక్కువ సమయంలో గమ్యస్థానానికి చేరుకోవాలి. తొలి రోజుల్లో ఆ పడవలో అటు ఇటు కదలకుండా బ్యాలెన్స్ చేయటానికి ఆరు నెలల సమయం పట్టింది. శివారెడ్డి పర్యవేక్షణలో రోజూ ఉదయం మూడు, సాయంత్రం మూడు గంటలసేపు కసరత్తు చేసేవారు. రోజు 7 నుంచి 10 కిలోమీటర్ల పరుగు వారానికి ఒకసారి 15 కిలోమీటర్లు పరుగు శిక్షణలో కీలక భాగంగా ఉండేది.

తొలి ప్రయత్నంలోనే పతకాలు

డిసెంబరు 5 నుంచి 9వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని అప్పర్‌లేక్ సరస్సులో ఆలిండియా వాటర్ స్పోర్ట్సు ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. దానికి పోలీసులతోపాటు కేంద్ర బలగాలకు చెందిన క్రీడాకారులు 18 మంది పోటీ పడ్డారు. ఒక్క మణికంఠ మాత్రమే కెనోయింగ్ విభాగంలో రెండు రజత పతకాలు సాధించి జాతీయ స్థాయిలో గుంటూరు జిల్లా ఖ్యాతిని పెంచేలా చేశాడు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి చౌహన్, హోంమంత్రి చేతుల మీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలు స్వీకరించి అందరి ప్రశంసలందుకున్నాడు. తొలి ప్రయత్నంలోనే రెండు పతకాలు సాధించిన మణికంఠను అర్బన్ ఎస్పీ విజయరావు ప్రత్యేకంగా అభినందించారు.

ఇండియన్ పోలీసు జర్కిన్ వేసుకోవాలనేదే కల

ఆలిండియాలో పతకాలు సాధించిన వారిని వాటర్ గేమ్స్ సీనియర్ జట్టుకు ఎంపిక చేస్తారు. దానిలో పోలీసుశాఖే కాకుండా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సుతోపాటు ఇతరులు పోటీపడతారు. అంతటి ప్రతిష్ఠాత్మకమైన ఆ పోటీల్లో పోలీసుశాఖ తరపున ఎంపికైతే ఇండియన్ పోలీసు అనే జర్కిన్ వేసుకొనే అవకాశం ఉంటుంది. అలా అది వేసుకుని పతకాలు సాధించాలనేది నా కల.

జన్మభూమి నిర్వహణపై మున్సిపాలిటీలకు ర్యాంకులు

పురపాలకశాఖ సంచాలకులు కన్నబాబు


చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: జన్మభూమి కార్యక్రమాలు నిర్వహిస్తున్న తీరును బట్టి పురపాలక సంఘాలకు ర్యాంకింగ్ ఇవ్వడం జరుగుతుందని పురపరిపాలనశాఖ సంచాలకులు(డీఎంఏ) కె.కన్నబాబు పేర్కొన్నారు. చిలకలూరిపేట పురపాలకసంఘ కార్యాలయానికి బుధవారం రాత్రి వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. జన్మభూమికి సంబంధించి మున్సిపాలిటీల పనితీరును బట్టి 9 నక్షత్రాలు కేటాయిస్తామన్నారు. 100 మార్కులు సాధించిన వారికి 9 నక్షత్రాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వార్డుల్లో జరిగిన సభలకు కూడా మార్కులు ఇస్తామన్నారు. జన్మభూమి పనులకు సంబంధించిన వివరాలను ఆయా వార్డుల నోడల్ అధికారులు, జన్మభూమి అధికారులు కూడా అప్‌లోడ్ చేయాలని వివరించారు. జన్మభూమిలో వచ్చే ప్రతి సమస్యను కూడా ఆన్‌లైన్ చేయాలని కోరారు. వార్డు సభల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. పురసేవ యాప్ గురించి అవగాహన కల్పించి ఎక్కువ మంది డౌన్ చేసుకునేలా చూడాలన్నారు. దీనికి కూడా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మార్కులు కేటాయిస్తామన్నారు. నాయుడుపేటలో వ్యర్థాల ద్వారా విద్యుత్తు తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనికి 50 కి.మీ. పరిధిలోని కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన మున్సిపాలిటీల వ్యర్థాలను అక్కడకు తరలించాల్సి ఉంటుందన్నారు. కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు ధీటుగా మున్సిపాలిటీలో చదువుకునే 10 విద్యార్థులకు 10కి 10కి గ్రేడ్ పాయింట్లు వచ్చేలా విద్యార్థులకు బోధన జరుగుతుందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన జరుగుతుందని, ముందుగా అన్ని పాఠశాలలకు బెంచీలను అందజేస్తామని వివరించారు. చిలకలూరిపేట నుంచి మున్సిపల్ కమిషనర్లకు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జన్మభూమి జరుగుతున్న తీరును వివరించారు. అనంతరం పురపాలకసంఘ జన్మభూమి అధికారులతో సమావేశమయ్యారు. పురపాలకసంఘ కమిషనర్ నామా కనకరావు ఆయన వెంట ఉన్నారు.


మాట్లాడుతున్న కన్నబాబు

డయల్ 100 ఫిర్యాదులపై సత్వరమే స్పందించండి

గ్రామీణ ఎస్పీ వెంకట అప్పలనాయుడు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : డయల్ 100కు వచ్చిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని రూరల్ ఎస్పీ వెంకట అప్పలనాయుడు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో 100 పనితీరుపై ఆయన సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ డయల్ 100కు ఫిర్యాదు అందించిన వెంటనే సంబంధిత పోలీసుస్టేషన్ సిబ్బంది 10 నుంచి 15 నిమిషాల్లోగా ఘటనా స్థలానికి చేరుకోవాలన్నారు. అక్కడి పరిస్థితులు పరిశీలించి సమస్య తీవ్రతను బట్టి వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. గత నెలలో డయల్ 100కు 1,088 ఫిర్యాదులందాయన్నారు. వాటిలో రోడ్డు ప్రమాదాలపై 487, శరీరంపై గాయాలు చేసిన వాటిపై 174, మహిళలకు సంబంధించిన ఘటనలపై 75, చిన్న తగాదాలు, తాగుబోతుల ఆగడాలపై 307, ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలపై 15, దోపిడీలు, దొంగతనాలపై 27 ఫిర్యాదులందాయని వివరించారు.



ఈనాడు-ఈటీవీ ఆంధ్రప్రదేశ్
నిర్వహిస్తున్న
ముత్యాల ముగ్గుల పోటీ

జనవరి 2, 2018 విజేతలు

1. సి.హెచ్ జ్యోతి నిఖిల, జగ్గయ్యపేట; 2. వి. రమ్య, మధిర; 3. కె.పద్మ భారతి, యలమంచిలి; 4. ఎస్. శైలజ, జగ్గయ్యపేట; 5. కె. పూజిత, చిలకలూరిపేట; 6. డి. నాగయశస్వి, వైజాగ్; 7. దుర్గా స్రవంతి, కనుమోలు, కృష్ణా; 8. కె.వి. లావణ్య, బుచ్చిరెడ్డి పాలెం; 9. సి.హెచ్. సంధ్యారాణి, చీరాల; 10. శైలజ, రామదుర్గం, బళ్ళారి. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చు.

సంక్రాంతికి ఆర్టీసీ అదనపు బస్సులు

గుంటూరువారితోట, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగను పురస్కరించుని జిల్లా వ్యాప్తంగా 448 అదనపు బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ గుంటూరు ఆర్ఎం జ్ఞానంగారి శ్రీహరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వీసులు అన్నింటిని ప్రణాళిక బద్ధంగా సిద్ధం చేశామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేందుకు మరలా వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. అన్ని బస్‌స్టేషన్లలోని బుకింగ్ కౌంటర్లు, అధీకృత బుకింగ్ ఏజెంట్లు (ఏటీబీ), ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లను పొందవచ్చునని తెలిపారు. ప్రైవేటు వాహనాల ఛార్జీలకంటే ఆర్టీసీ ఛార్జీలు తక్కువని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేందుకు హైదరాబాద్-గుంటూరు- 330, బెంగళూరు- గుంటూరు- 40, చెన్నై-గుంటూరు- 60 బస్సులను...తిరిగి వెళ్లేందుకు గుంటూరు- హైదరాబాద్ 350, గుంటూరు- బెంగళూరు- 45, గుంటూరు- చెన్నై- 70, గుంటూరు-విశాఖపట్నం- 3, గుంటూరు- తిరుపతి- 5, గుంటూరు- నెల్లూరు- 2, గుంటూరు- కడప-2, గుంటూరు- కర్నూలు- 2, గుంటూరు- నంద్యాల-1 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. అన్ని సర్వీసులు ఈనెల 3వతేదీ నుంచి అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. పండగ అనంతరం ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా డిపోల వారీగా చర్యలు చేపట్టామని చెప్పారు. జిల్లాలోని ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించి సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

5న మానస సరోవర ధ్యాన ఆశ్రమ వార్షికోత్సవం

తాడేపల్లి, న్యూస్‌టుడే: విజయవాడ సమీప మణిపాల్ ఆసుపత్రి వద్ద కృష్ణా నదీ తీరంలోని ఈనెల 5వ తేదీన మానస సరోవర ధ్యాన ఆశ్రమ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకులు కళ్లం రామిరెడ్డి తెలిపారు. పిరమిడ్ ధ్యాన కేంద్రాల వ్యవస్థాపకులు బ్రహ్మర్షి పత్రీజీ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ధ్యాన్య తరగతులు, పత్రీజీ వేణునాదం, పిరమిడ్ మాస్టర్ల సందేశాలు, అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు.

ఔషధాలను నిర్ణీత శీతలీకరణలో నిల్వ ఉంచాలి


గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలో రోగులకు సరఫరా చేసే ఔషధాలను నిర్ణీత శీతలీకరణలో నిల్వ ఉంచాలని సూపరింటెండెంట్ రాజునాయుడు సూచించారు. ఔషధ భాండాగారంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో రాజునాయుడు మాట్లాడుతూ మార్ఫిన్ మందుల్ని అందుబాటులో ఉంచుకోవడానికి అవసరమైన నార్కొటిక్ లైసెన్స్‌కు దరఖాస్తు చేయాలని కోరారు. అదేవిధంగా స్పిరిట్ నిల్వ ఉంచేందుకు అనుమతి తీసుకోవాలని తెలిపారు. నిబంధనల మేర ఔషధాలను సక్రమంగా నిల్వ ఉంచాలన్నారు.

చెవులకు చిలుకలు తోడుంటే

మహిళలు తమ చెవులకు ధరించే రింగులు వారికి మరింత అందాన్ని తెచ్చిపెడతాయి. మరి అందానికి మారు పేరుగా చెప్పుకునే చిలుకలును తలపించేలా..అలాగే అదే ఆకారంలో నగలు వస్తే..వాటిని చెవులకు పెట్టుకుంటే వారి అందం మరింత రెట్టింపు అవుతుంది. రింగులు, దిద్దులు, లోలాకులు, జుంకాలు, బుట్టలు ఇలా చాలా రకాలు మార్కెట్‌లోకి వచ్చేశాయి. అవి బంగారు కోటింగ్‌తో చూడటానికి అచ్చం బంగారు నగలు లాగా ఉంటున్నాయి. సంక్రాంతి సంబరాల నేపథ్యంలో విజయవాడ, గుంటూరు నగరాల్లో అవి సందడి చేస్తున్నాయి.

– న్యూస్‌టుడే, ప్రత్తిపాడు.





చంద్రన్న సంక్రాంతి కానుక పంపిణీ

శిరిగిరిపాడు (వెల్దుర్తి), న్యూస్‌టుడే : సంక్రాంతి పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చంద్రన్న కానుకను అందజేస్తోందని మాజీ శాసనసభ్యుడు కుర్రి పున్నారెడ్డి అన్నారు. బుధవారం శిరిగిరిపాడులో చంద్రన్న కానుకలను ఆయన పంపిణీ చేశారు. సర్పంచి కోటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు గుంటక చెన్నారెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు కుర్రి శివారెడ్డి, నేతలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మ, బ్రహ్మయ్య, యాకోబు పాల్గొన్నారు.

మాచర్ల

విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక పోటీలు

కారంపూడి, న్యూస్‌టుడే : 5వ విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమాలను పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతి పోటీలను ఉపాధ్యాయులు నిర్వహించారు. జన్మభూమి గ్రామసభలో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ పేర్కొన్నారు.

ఆశల ఊసులెన్నో

నూతన ఏడాదిలో ఆకాంక్షలు ● మంచి మనసుతో ముందడుగేస్తే ఫలితం

మాచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే : ఇంటిలో వృథా ఖర్చు పెరుగుతోంది.. అదుపు చేయాలి.. అంటూ ఒకరు.. ఇకపై మద్యం ముట్టను.. వ్యసనాలకు దూరంగా ఉంటాను అంటూ మరొకరు.. ధూమపానం మానేస్తాను.. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తానంటూ మరో యువకుడు.. ఇలా కొత్త సంవత్సరం సందర్భంగా కొత్త నిర్ణయాలు..శపథాలు చేస్తుంటారు. కానీ కొందరైతే 48 గంటలు గడవక ముందే పాత అలవాట్లను వదులుకోలేక అలాగే కొనసాగుతారు..మరికొందరు ఆ నిర్ణయానికి కట్టుబడి ప్రగతి సాధిస్తారు. సన్నిహితులు..స్నేహితులు కలిసినపుడు ఒట్టు దీసి గట్టు మీద పెడతారా.. లేక తమ కొత్త నిర్ణయాలతో మరింతగా ముందుకు వెళతారా అనేది వారి సంకల్పంలోనే ఉంటుంది. కాలం కరుగుతుంది కానీ వారి సంకల్పంలో నిబద్ధత ఉంటే అనుకున్నది సాధించే దిశగా పయనం సాగుతుంది. నూతన ఏడాదిలో పలువురు గృహిణులు, కూలీలు, యువత, సామాన్యులు తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

ఆశ నిరాశ మధ్య జీవనం



రెక్కల కష్టంపై ఆధారపడి జీవించే వాళ్లం. పొద్దంతా కష్టించి పని చేస్తేనే పూట గడిచేది.. మాకు పెద్ద కోరికలు లేవు. కొత్త ఏడాదిలో మార్పులు జరిగి సామాన్యులకు మంచి రోజులొస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నాం.

-ఎస్.నరసింహారావు, పండ్ల కార్మికుడు, మాచర్ల

మార్పులకు నాంది కావాలి



కొత్త ఏడాది మార్పులకు నాంది కావాలి. గృహిణులు కేవలం వంటింటికే పరిమితం అయ్యేవారు. మారిన పరిస్థితుల్లో డిజిటల్ అక్షరాస్యత వైపు దృష్టి సారిస్తున్నారు. ఇంట్లోనే ఉంటూ ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారు. కొత్త ఏడాదిపై మాకు ఎన్నో ఆశలు ఉన్నాయి. నూతన సంవత్సరం అందరికీ మంచి జరగుతుందని ఆశిస్తున్నాను. - **తాటి.రాజకుమారి, గృహిణి**

సామాన్యుల కష్టాలు తొలగుతాయనే ఆశ



నిత్యం రహదారిపై ఎండనక.. వాననక కూలి పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. కొత్త సంవత్సరం వచ్చిందంటే మాకు ఏదో తెలియని ఆశ. ఈ ఏడాదైనా మా జీవితాల్లో కొత్త వెలుగు వస్తుందని. ఈ ఏడాది నూతనంగా లిడ్‌క్యాప్‌కు ఛైర్మన్‌ను నియమించారు. మాలాంటి వారికి కొత్త సంవత్సరంలోనైనా వృత్తి నైపుణ్యం పెంచే శిక్షణ ఇచ్చి జీవితానికి భరోసా ఇచ్చేలా రుణాలు అందుతాయనే ఆశ ఉంది.

- కంభంపాటి ప్రభుదాసు, చెప్పల కార్మికుడు, మాచర్ల

మహిళలకు భరోసా కలుగుతుందని..



రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ఈ ఏడాదిలో ఎన్నో కొత్త నిర్ణయాలు తీసుకుంది. వాటిని క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. వచ్చే ఏడాదిలో మహిళల సంక్షేమానికి ప్రధానంగా డ్వాక్రా మహిళలకు మేలు కలిగించే నిర్ణయాలు తీసుకుని మహిళల జీవనాభివృద్ధికి భరోసా కలుగుతుందనే ఆశ ఉంది.

- వాణి, డ్వాక్రా మహిళ, మాచర్ల

కొత్త నిర్ణయాలు తీసుకున్నా



యువకునిగా సమాజంలో మెలిగేటపుడు ఈ ఏడాదిలో కొన్ని ప్రజాహిత కార్యక్రమాలతో పాటు కొన్ని తొందరపాటు నిర్ణయాలు తీసుకున్నానేమోననే మీమంస ఉంది. కొత్త సంవత్సరంపై ఆశతో సమాజానికి నా వంతు సేవలను మరింత విస్తృత పర్చాలనే నిర్ణయం తీసుకున్నా. లోపాలను సరిదిద్దుకుని మరింత ఉత్సాహంగా ముందుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను.

- సైఫుల్లా, ఫ్రెండ్స్‌సేవాసమితి, మాచర్ల

కొత్త విషయాలపై అవగాహనతో ముందుకు



ఈ ఏడాది మహిళలకు ఎన్నో పాఠాలు నేర్పింది. జీఎస్టీ వంటి ప్రభుత్వ నిర్ణయాలు సామాన్యులను సైతం ఆలోచింపజేశాయి. సాంకేతికతను ఏవిధంగా వినియోగించుకోవాలి అనే విషయాలపై అవగాహన పెంచుకుంటున్నాం. గృహిణిగా ఇంటి నిర్వహణలో కొత్త నిర్ణయాలు తీసుకుని ఆశావహ దృక్పథంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నా.

- వి.ఇందిర, గృహిణి

ఆనందలహరి సామగ్రి పంపిణీ



సామగ్రి ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

తుమ్మకోట (రెంటచింతల), న్యూస్‌టుడే : మండలంలోని తుమ్మకోట శివారు కొత్తగంగరాజుపల్లె ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆనందలహరి అభ్యాసన సామగ్రిని తుమ్మకోట కాంప్లెక్స్ ఛైర్మన్ జాలాది రవి అందజేశారు. విద్యార్థులకు ఒత్తిడి లేకుండా బోధన చేసేందుకు ఇది దోహద పడుతుందని ఆయన చెప్పారు. 1,2 తరగతుల విద్యార్థులు పాఠశాలలకు క్రమ తప్పకుండా హాజరవుతాయని తెలిపారు. ఐదు ట్యాబ్‌లు, ర్యాక్‌లు, 60 ట్రేలను ప్రధానోపాధ్యాయిని సుల్తానా విద్యాశాఖాధికారులు రవి, నాగరాజు, సిరాజ్ చేతుల మీదుగా స్వీకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని నమోమి, అంగన్‌వాడీ కార్యకర్త కమలమ్మ పాల్గొన్నారు.

సమస్యలున్నాయ్.. పరిష్కారం చూపరూ



కాలనీలో పర్యటిస్తున్న బాబురావు

మాచర్ల, న్యూస్‌టుడే : ఐపీఎస్ మాజీ అధికారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెల బాబురావు బుధవారం పట్టణంలో పర్యటించారు. ఏపీ నాటక రంగస్థల, కళాకారుల సంక్షేమ సేవా సంఘం పిలుపు మేరకు పట్టణంలోని కళాకారుల కాలనీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కళాకారుల సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టిపాలెం వెంకటేశ్ కాలనీలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఇంటి పట్టాలు, ఇళ్ల నిర్మాణాలకు నిధులు, మౌలిక వసతుల కల్పన 2008 నుంచి అడుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. దీనిపై బాబురావు తహశీల్దార్ వెంకటేశ్వర్లుతో ఫోన్‌లో మాట్లాడారు. కలెక్టర్, ఆర్డీఓతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపిస్తామని చెప్పారు. పోలీసు అధికారులకు ఇబ్బందులు పెట్టవద్దని సూచిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసనాయుడు, గురజాల అప్పారావు, మరియదాసు, కోటయ్య, గురవయ్య, సుందరరావు, వెంకటేశ్వరరావు, దానం పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



ప్రార్థన చేస్తున్న మతపెద్దలు

మాచర్ల, న్యూస్‌టుడే : పట్టణంలోని ఆర్‌సీఎం చర్చిలోని శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి మతగురువు బుధవారం శంకుస్థాపన చేశారు. రెంటచింతల సెయింట్ జోషఫ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ పుట్టి సుందరరాజు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాచర్ల విచారణ గురువు పీట్ల మరియదాసు మాట్లాడుతూ మంచి మనసు ఉన్న ప్రతిఒక్కరూ మృతి చెందినా.. ప్రజల మనసులో జీవించే ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో తుమ్మకోట విచారణ గురువు అశోక్, పట్టణంలోని సెయింటాన్స్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని నిర్మల, క్రైస్తవ సంఘ పెద్దలు సుందరరాజు, మర్రెడ్డి, కిరీటిరెడ్డి, కస్తూరి, రాజారావు పాల్గొన్నారు.

భవన నిర్మాణాల పరిశీలన



కళాశాల భవన ప్రాంగణంలో ఎమ్మెల్సీ డొక్కా

దుర్గి, న్యూస్‌టుడే : దుర్గిలో రూ.1.50కోట్లతో నిర్మాణాలు చేపట్టి నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను బుధవారం ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పరిశీలించారు. 80 శాతం పనులు పూర్తిచేసి విద్యుత్తు, ఇతర మౌలిక వసతుల కల్పన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక తాము ఇరుకు గదుల్లో, స్థానిక జడ్పీ పాఠశాల అందజేసిన 5 తరగతి గదుల్లో విద్యాభ్యాసం చేస్తున్నామని ఇంటర్ విద్యార్థులు జన్మభూమి గ్రామసభలో ఆయన దృష్టికి తీసుకురాగా గ్రామపెద్ద, తెదేపా సీనియర్ నేత శెట్టిపల్లి యల్లమందు వివరించారు. ఇపుడు రూ.10 లక్షల నిధులు అవసరమని తెలిపారు. గుంటూరులో తన వద్దకు వస్తే కలెక్టరు దృష్టికి సమస్య తీసుకువెళ్లి నిధులు ఇప్పించేందుకు కృషి చేస్తానని డొక్కా హామీ ఇచ్చారు.

దివ్యదర్శన యాత్ర ప్రారంభం



యాత్ర ప్రారంభిస్తున్న తెదేపా నేతలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే : ఎన్నడూ తీర్థ యాత్రలకు నోచుకోని పేద హిందూ భక్తుల కోసం ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ 'దివ్యదర్శనం' అనే ధార్మిక యాత్రను ప్రారంభించిందని తెదేపా మండల అధ్యక్షుడు కుర్రి శివారెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తిలోని తితిదే కల్యాణ మంటపం వద్ద నుంచి 'దివ్యదర్శన' యాత్రను శివారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది తెదేపా ప్రభుత్వం కల్పిస్తున్న గొప్ప అవకాశమని, దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ఇందులో ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ యాత్ర 4 రోజుల నుంచి 5 రోజుల వరకు కొనసాగుతుందని, రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల దర్శనం చేయిస్తారన్నారు. ప్రతి బుధవారం ప్రారంభమై శనివారంతో ముగుస్తుందని, ప్రథమంగా ఒంగోలు దగ్గరున్న వల్లూరమ్మ దేవాలయం, శ్రీకాళహస్తి, తిరుచానూరు, తిరుపతి, ఒంటిమిట్ట, శ్రీశైలం, త్రిపురాంతకం వంటి పుణ్య క్షేత్రాలను చూపుతారన్నారు. 200 మంది భక్తులకు శేష వస్త్రాలు, కంకణాలు, అల్పాహారాన్ని దేవాదాయ శాఖ అందజేసింది. కార్యక్రమంలో తెదేపా నేతలు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, పులుసు వీరారెడ్డి, నారాయణరెడ్డి, శివారెడ్డి, దేశం శ్రీనివాసరెడ్డి, పులుసు నాగిరెడ్డి పాల్గొన్నారు.

పశర్లపాడులో నీటితొట్టి ప్రారంభం

పశర్లపాడు (రెంటచింతల), న్యూస్‌టుడే : గ్రామస్థుల దాహం తీర్చేందుకు నీటితొట్టి నిర్మించినట్లు పశర్లపాడు సర్పంచి వెన్నా లింగారెడ్డి వెల్లడించారు. బుధవారం పరాశక్తి సిమెంటు పరిశ్రమ యాజమాన్యం సుమారు రూ.50 వేల ఆర్థిక సాయంతో రెండు వేల లీటర్ల మంచినీటిని నిల్వ చేసుకునే సామర్థ్య ఉన్న నీటితొట్టి, విద్యుత్తు మోటరును లింగారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పరాశక్తి అధికారి వేణుగోపాలరెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

యువకుని మృతదేహం లభ్యం

మంచికల్లు (రెంటచింతల), న్యూస్‌టుడే : మంచికల్లు బుగ్గవాగు రిజర్వాయరులో బుధవారం మాచర్ల గ్రామీణ పోలీసులు ఓ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మాచర్ల పట్టణంలోని న్యూటన్స్ ఇంజినీరింగు కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న గుంటక యశ్వంత్‌రెడ్డి మిత్రులతో కలిసి మాచర్ల సమీపంలోని సాగర్ కుడికాల్వ వద్దకు డిసెంబరు 31న వెళ్లారు. స్వీయచిత్రం (సెల్ఫీ) దిగుతూ కాల్వలో పడి గల్లంతయ్యాడు. వెంటనే పోలీసులు, కుటుంబీకులు బుగ్గవాగు రిజర్వాయరులో మత్స్యకారుల సాయంతో వెతికించారు. బుధవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. రిజర్వాయరు పరిసరాలలోనే అంత్యక్రియలు ముగించారు.

మాచర్ల సినిమాలు

వెంకటేశ్వర	- ఒక్కక్షణం
నాగార్జున	- హలో
రామా	- ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయి)

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

రెంటచింతల, న్యూస్‌టుడే : పల్నాట 2018 మార్చిలో పరీక్షలు రాయనున్న పది విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా తోడ్పాటు అందిస్తున్నట్లు కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.సాల్మన్‌రాజు తెలిపారు. బుధవారం రాత్రి రెంటచింతల యుటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పదిలో వెనుకబడిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణులయ్యేలా నమూనా పత్రాలు తయారు చేసినట్లు వెల్లడించారు. యూటీఎఫ్ నేతలు సాగర్‌బాబు, బుచ్చిరెడ్డి, నాగిరెడ్డి, పుల్లారావు, ప్రతాప్, మల్లికార్జునరావు, నాసరయ్య, సురేష్ పాల్గొన్నారు.

మాచర్ల



దుర్గిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డొక్కా



మాచర్ల : మాట్లాడుతున్న పురపాలిక అధ్యక్షురాలు మంగమ్మ

రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి కృషి

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

సజావుగా జన్మభూమి గ్రామసభలు

దుర్గి, న్యూస్‌టుడే : రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేసే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. బుధవారం దుర్గి జడ్పీ పాఠశాలలో నిర్వహించిన జన్మభూమి- మా ఊరు గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమకాలీన రాయకీయాల్లో ఏకైక నేత చంద్రబాబు అని పేర్కొన్నారు. ప్రతి పేదకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూసేందుకే అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకునేందుకే జన్మభూమి గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ ఏ నాయకుడు పాల్గొన్నాడు, అక్కడ ఏం మాట్లాడారు, అక్కడ ప్రజల సమస్యలను ఏరోజుకారోజు సాయంత్రం తనకు తెలియజేసేలా ప్రణాళిక తయారు చేసుకుని నిత్యం రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పని చేయాలనే సంకల్పంతో ఆయన ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. పల్నాడు త్వరలో అభివృద్ధి చెందుతుందని, రైతులకు అప్పులు ఉన్నాయని.. పొలాలను అమ్ముకోవద్దని సూచించారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వస్తే పల్నాడును ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి వద్ద స్థానిక నేతల సహకారంతో ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా అర్హులకు రేషన్ కార్డులు, ట్రాక్టర్లను, తైవాన్ స్ప్రేయర్లను ఆయన చేతుల మీదుగా అధికారులు అందజేశారు. అంతకు నియోజవర్గ ప్రత్యేక అధికారి, పి.శ్రీనివాసరావు, డివిజన్ ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి, ఉప కలెక్టరు ఎన్. ఏసురత్నం, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు కొమ్మారెడ్డి చలమారెడ్డి, యార్డు ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, ఎంపీపీ బీమా లక్ష్మీకుమారి, హసీబాయి, జడ్పీటీసీ సభ్యురాలు కొనకంచి హైమావతి, తెదేపా మండల నేత శెట్టిపల్లి యల్లమంద, అధికారులు పాల్గొన్నారు.

ఓబులేశునపల్లెలో.. : మండల పరిధిలోని ఓబులేశునపల్లెలో తహశీల్దార్ కె.శివన్నారాయణమూర్తి నేతృత్వంలో పలువురు మండల స్థాయి అధికారుల బృందం గ్రామసభ నిర్వహించారు. ప్రజల సమస్యలకు సంబంధించి అర్జీలు తీసుకున్నారు. పలు శాఖల అధికారులు అభివృద్ధి పనులు వివరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మండాది (వెల్దుర్తి) : ప్రజల సమస్యల పరిష్కారానికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మభూమి-మా ఊరు నిర్వహిస్తున్నారని తహశీల్దార్ మువ్వా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని మండాది, పట్లవీడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మండాదిలోని కొందరు ప్రతి జన్మభూమిలో అర్జీలు ఇస్తున్నా పథకాలు మంజూరు కాలేదని, జన్మభూమి కమిటీ సూచించిన వారికే అవి మంజూరు చేస్తున్నారని తహశీల్దార్‌ను ప్రశ్నించారు. దీనికి స్పందించిన ఆయన అర్హులందరికీ అన్యాయం జరగదని, మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పట్లవీడులో మండల ప్రత్యేక అధికారి ఏడీఏ కబ్బిరెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో సుగుణ, పంచాయతీరాజ్ ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, ఎంఈవో అల్లి సురేష్, తెదేపా నేత సామినేని నరసయ్య, కుర్రి శివారెడ్డి, అధికారులు, నేతలు పాల్గొన్నారు.



వెల్దుర్తి : తహశీల్దార్ వెంకటేశ్వరరావును ప్రశ్నిస్తున్న గ్రామస్థుడు

మాచర్ల : 2019లో కూడా చంద్రబాబు సీఎంగా ఉంటేనే రాష్ట్రం ప్రగతిబాటలో ప్రయాణిస్తుందని పురపాలిక ఛైర్‌పర్సన్ నెల్లూరి మంగమ్మ అన్నారు. బుధవారం 5వ విడత జన్మభూమి కార్యక్రమం పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. 4,5,6 వార్డుల ప్రజలు పాల్గొన్నారు. పురపాలిక కమిషనర్ గిరికుమార్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంగమ్మ మాట్లాడుతూ ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు జన్మభూమి కార్యక్రమం ద్వారా అధికారులను మన వద్దకే సీఎం పంపుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో ఆయన ఆదర్శమని కొనియాడారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చి పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న తెదేపా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. పట్టణంలో తాను ఛైర్‌పర్సన్ అయ్యాక రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, తాగునీరు, రహదారులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కమిషనర్ గిరికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పట్టణంలో అర్హులకు రేషన్ కార్డుల, ఇళ్ల నిర్మాణాల మంజూరుకు అర్హులను ఎంపిక చేసిందన్నారు. కౌన్సిలర్లు రమేష్‌కుమార్, సంతోష్, రాణి, సీడీపీఓ వెంకటరమణ, రంగాసత్యం మాట్లాడారు.



దుర్గి : విద్యార్థుల నృత్య ప్రదర్శన



జమ్మలమడకలో రేషన్‌కార్డు అందజేస్తున్న భీమయ్య

కారంపూడి : వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న వారు వాటిని వినియోగించాలని ఎంపీడీవో హీరాలాల్ నాయక్, తహశీల్దార్ ప్రసూన పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గాదెవారిపల్లె, భట్టువారిపల్లె గ్రామాల్లో జన్మభూమి- మా ఊరు గ్రామసభలను ఎంపీడీవో, తహశీల్దార్ బృందాలు చేపట్టాయి. అధికారులు గాదెవారిపల్లెలో 8, భట్టువారిపల్లెలో 6 రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఎంపీపీ రమావత్ నాగుల్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం వ్యాధిగ్రస్థులకు పలు వైద్య సేవలు ఉచితంగా సేవలు చేస్తుందని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గాదెవారిపల్లెలో గర్భిణులకు తహశీల్దార్, సర్పంచి దోర్నాల బ్రహ్మారెడ్డి, వైస్ ఎంపీపీ చావా వీరాంజనేయులు, పంగులూరి అంజయ్య, పంగులూరి పుల్లయ్య సీమంతాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పులిచర్ల అమర నాగేశ్వరమ్మ మృతి చెందగా భర్త వెంకటరెడ్డికి చంద్రబీమా పథకం కింద ₹1.95 లక్షలు అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వలపా బాలస్వామి, ఎంపీటీసీ సభ్యులు మళ్లా ధనలక్ష్మి, ఉన్నం లక్ష్మీనారాయణ, గోళ్ల సురేష్, మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జమ్మలమడక (మాచర్ల గ్రామీణ) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల జన్మభూమి ప్రత్యేకాధికారి, డీఎఫ్‌వో భీమయ్య అన్నారు. బుధవారం మండలంలోని జమ్మలమడకలో నిర్వహించిన జన్మభూమి సభలో మాట్లాడి లబ్ధిదారులకు రేషన్ కార్డులు ఆయన పంపిణీ చేశారు. అంతకు ముందు తెదేపా నియోజవర్గ బాధ్యుడు చలమారెడ్డి హాజరై చంద్రబాబు చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలను వివరించారు. జడ్పీటీసీ సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వ పథకాలు దరిచేరడం లేదని, దస్త్రాల్లోనే తప్ప క్షేత్రస్థాయిలో లబ్ధి చేకూరడం లేదన్నారు. ఎంపీపీ పేర్ల గురవమ్మ మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు మరింత చేరువ చేయాలని చెప్పారు. అనంతరం పలుశాఖల అధికారులు అమలు చేస్తున్న పథకాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, మహిళలకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేశారు. తహశీల్దారు వెంకటేశ్వరరావు, ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, సర్పంచి గొబ్బూరి కోటయ్య, ఈవోపీఆర్‌డీ గంగామోహన్, ఎంఈవో నాగయ్య, ఏవో రామమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ నవత, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు మాణిక్యం, విద్యుత్తు శాఖ ఏఈ రాంబాబు, వెలుగు ఏపీఎం బాబూజీ ప్రసంగించారు.

సావిత్రి బాయి పూలేకు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న బీసీ నేతలు

మాచర్ల, న్యూస్‌టుడే : సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా బీసీ సంఘం, భాజపా నేతలు ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. బుధవారం బీసీ సంఘ నేతలు తమ కార్యాలయంలో మాట్లాడుతూ దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమంలో జింకల నాగేశ్వరరావు, పాండు రంగారావు, వెంకటేశ్వర్లు, భాజపా కార్యాలయంలో కాశీపతి, ఈశ్వరయ్య, కృష్ణ, శ్రీను, నాగేశ్వరరావు, హనుమాయమ్మ పాల్గొన్నారు.

మాచర్ల : పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంఘ మహిళా కార్యదర్శి హనుమమ్మ అధ్యక్షత వహించారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయునిలు ప్రమీలాదేవి, రాజేశ్వరిని సన్మానించారు. ఎస్టీయూ నేతలు గంగాధరబాబు, కిషోర్, భాస్కరబాబు, పోతురాజు, మధుసూదనరావు, కిరణ్, గోవిందరావు, రత్యానాయక్ పాల్గొన్నారు.

దుర్గి : సావిత్రిబాయి పూలే జయంతి బుధవారం మండలంలోని పలు పాఠశాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ, కస్తూర్బాతో పాటు పలు పాఠశాలల్లో ఆమె చిత్రపటాన్ని ఉంచి పూలదండలు వేశారు. జన్మభూమి గ్రామసభలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాదు, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు చలమారెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పూలే చిత్రపటానికి పూలదండలు వేసి మహిళల్లో విద్యాభివృద్ధికి ఆమె కృషిని వివరించారు.

కారంపూడి : జాతీయ మహిళా ఉపాధ్యాయినుల దినోత్సవం బుధవారం కారంపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయునులను ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ నేతృత్వంలో సత్కరించారు.

కాపలా ఉన్నారుగా.. ఓ కునుకు తీద్దాం



అటు జన్మభూమి కార్యక్రమం జరుగుతోంది.. పల్లెలో ఎప్పుడో కానీ కనిపించని గ్రామాధికారి సభ వేదికకు వెనుక కుర్చీలో కూర్చుని కునికిపాటు తీశారు. మరి ఆయనతో తెచ్చుకున్న సామగ్రి పోతుందనే బెంగో ఏమో కానీ తన సంచికి కాపలాగా గ్రామ సహాయకున్ని ఉంచారు. అయ్యవారు అలా కుర్చీలో కునుకు తీస్తుండగా గ్రామ సహాయకుడు కటికనేలపై కూర్చుని కాపలా కాశారు. ఈ దృశ్యాన్ని మండలంలోని జమ్మలమడకలో 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

- న్యూస్‌టుడే, మాచర్ల గ్రామీణ

CLASSIFIEDS

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

ప్రముఖ టెలిమార్కెటింగ్ కొరకు డీలర్స్ డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. Franchise కొరకు సంప్రదించండి. 8142657223, 040 38163916.

BUSINESS OFFER

హోల్‌సేల్ వస్త్రవ్యాపారులకు మావద్ద ఆల్ శారీస్, డ్రస్‌మెటీరియల్స్, షూటింగ్ షర్టింగ్స్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కాస్ట్‌కు లభించును. Hyd: 7095930991/ 9121017798/ E/G ద్వారపూడి: 7337530469

ప్లాస్టిక్ ఇంజక్షన్ మౌల్డింగ్ మేన్యువల్ మెషిన్లు. రా మెటీరియల్ సప్లై చేసి తయారైన ప్రొడక్ట్ కొంటాం, 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్, నె॥ 20 వేలు పైగా ఆదాయం. (నో ఛార్జెస్), R.J. ఎం॥పై॥ - 82978 57211.

థర్మోకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారీ మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నె॥ 20 వేలు ఆ॥, బై బ్యాక్ అగ్రిమెంట్, (నో ఛార్జెస్). సైకో ఇంజినీరింగ్, విజయవాడ - 88972 67259.

EDUCATION

శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫైర్ & సేఫ్టీ, ల్యాండ్ సర్వే, JCB, ప్రొక్లెయిన్, క్రేన్, ఫోర్క్ లిఫ్ట్, వెల్డింగ్, A/C మెకానిక్, ఆపరేటర్ ట్రైనింగ్స్. కోర్సు తర్వాత జాబ్ లభించును. హాస్టల్, ఫుడ్స్ కలదు. రైల్వేస్టేషన్ రోడ్, ఆంధ్రాబ్యాంక్ ATM పైన రాజమండ్రి. ✆ 99668 41177.

SPOKEN ENGLISH

ఛాలెంజ్ ఇంగ్లీషు 50 గళ్ళలో 50 రోజులలో మాట్లాడు రేపటి నుండి 5 రోజులు ఫ్రీ క్లాసులకు హాజరుకండి. ప్రామాణిక 7/1 అరండల్‌పేట, గుంటూరు. ✆ 94405 39029.

HEALTH CARE

బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యంలేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర॥ 79953 92747, 96030 55647.

PEOPLE CARE

OLD AGE HOME

విజయ్ ఓల్డేజ్ హోం & హోంకేర్ సర్వీస్. వృద్ధులు, మంచాన ఉన్నవారికి 24 గం॥ సేవలు చేయుటకు ఆయా/ అటెండర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99121 73322, 99124 53322.

REAL ESTATE

A.P.Govt **అమరావతి** రాజధాని నిర్మాణములకు రైతులనుంచి తీసుకొన్న భూములకు ప్రతిగా సచివాలయం/VIT ప్రాంతంలో రైతులకిచ్చిన స్థలము అమ్మకము. J.P.చౌదరి. ✆ 84640 37777.

రాజధాని అమరావతి రాయపూడి మండడం, ఉద్దండరాయునిపాలెం వెలగపూడికి అతి దగ్గరలో గ॥ 7500/- అపార్ట్‌మెంట్ ఫ్లాట్ 15 లక్షలు. బ్యాంక్‌లోన్ కలదు. 92464 70909.

FLAT FOR SALE

2 BHK Flats 1145 Sq.ft Full Furniture Ready for Occupation at Inner Ring Road Guntur, Municipal Administrative Office back side by TNR Constructions. ✆ 98481 34857, 99661 24453.

గుంటూరు శ్యామలానగర్‌లో Park Ville Projects వారి లక్ష్మీనిలయం అపార్ట్‌మెంట్ నందు 2 & 3 BHK గ్రేటెడ్ కమ్యూనిటీలో 120 ఫ్లాట్స్ కలవు. ✆ 99633 88996.

LAND FOR SALE

ప్రకాశం జిల్లా ఒంగోలు-నంద్యాల రోడ్‌లో ఒంగోలుకు 62 k.m, దొనకొండకు 34 k.m దూరంలో ఉద్యానవన పంటలను సేంద్రీ-సహజ పద్ధతిలో సాగుచేయుటకు అనువుగా తయారు చేసి, గోవులను, కషాయములకు కావలసిన మొక్కలను పెంచుతూ 10 బోర్లు కల్గిన ఏక ప్రదేశముగానున్న 50 ఎకరాల భూమి అమ్మకంనకు కలదు. ✆ 9949163768.

PLOT FOR SALE

గుంటూరు సిటీ నందు పొన్నూరురోడ్ శ్రీచైతన్య ఠాగూర్ జూనియర్ కాలేజ్ ఎదురు మెయిన్‌రోడ్ ఫేసింగ్‌తో 1016 చదరపు గజముల కమర్షియల్ స్థలము షాపింగ్ కాంప్లెక్స్‌లకు, మోటర్ షోరూమ్‌లకు, ఇతర కమర్షియల్‌కు అనువైన స్థలము చుట్టూ 8 అడుగుల కాంపౌండ్‌వాల్, డస్ట్‌పుల్లింగ్ చేసిన 2 కల్వర్ట్స్, 2 పెద్ద గేట్లతో నిర్మాణానికి సిద్ధంగా ఉన్న స్థలము అమ్మ కమునకు కలదు. ✆ 93941 02664, 95732 68961.

నంబూరు VVIT కాలేజి దగ్గర్లో పంచాయతీ ప్లాట్లు 110 చ.గ.లు రూ. 5 లక్షలు & చెవిటికల్లు, నందిగామ హైవే ఆనుకొని CRDA LP No's గల ప్లాట్లు అమ్మకం. ✆ 99081 66858.

తాడికొండ అడ్డరోడ్ నుండి రావెల వెళ్ళు మెయిన్‌రోడ్‌ను ఆనుకొని CRDA అప్రూవల్ ప్లాట్లు చ.గ. కేవలం రూ. 6500/- మాత్రమే బ్యాంక్ లోన్ సౌకర్యం. కస్టమర్లు మాత్రమే సంప్ర॥ 91103 41418.

LEASE / RENT

బొన్సాసామిల్లులు-2 "42", లాన్సాసామిల్లులు-1 "48" HP-"48" అమ్మకానికి/అద్దెకు. PNR టింబర్ ట్రేడర్స్ చిలకలూరిపేట. ✆ 94402 57389.

TO-LET

విద్యానగర్ 3/8లైన్ నేతాజి రోడ్ ఇండిపెండెంట్ హౌస్ 3BHK అద్దెకు ఇవ్వబడును. ✆ 94916 69641.

అమరావతి రోడ్డు శ్రీ వెంకటేశ్వర కాలని సాయిబాబా గుడి దగ్గర 2BHK ఇండిపెండెంట్ పోర్షన్ 2వ ఫ్లోర్ 24 గం॥ నీటి వసతి కలదు. ✆ 94902 49499, 94944 14588.

COMMERCIAL

గుంటూరు నల్లచెరువు 2/1వ లైన్ డో.నెం॥ 81-3-424 4 షట్టర్సు, R.C.C. బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోరు 28X60 అ॥ కొలతలు గల బిల్డింగు షాప్‌కు గోడౌన్స్‌కు అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ Cell: 99480 40901.

JOBS

Wanted Computer Instructor is Required to Teach M.S.Office, Excel & Tally Package Languages to Students in Hindu College. Contact 98483 92883/0863-2222814.

Wanted Home Tuition for CA IPCC Accounts and Tax Completed Students/Lecturers. ✆ 97037 70451.

Ignis Careers Pvt Ltd., An English Training Frim is Recruiting Sales/ Marketing: 3 Years Exp. in School Related Business, Banking, Insurance Etc., Salary: 20K to 30K. Locations: Krishna, Guntur. Apply with CV/ Resume to hr@igniscareers.com, ✆ 9100778563/ 9989027755. (Call Between Mon-Sat 9.30 AM- 6 PM)

An ISO Certified Electronic Company Required Services Engineers and Sales Persons Qul: MBA, Diploma Electronics. ✆ 99633 44958.

Dream India Technologies Wanted 3yrs Exp Tally ERP-9, Faculty Qual: M.Com/M.B.A/ CA/ICWA. Salary 12,000/- - 16,000/-Rs Ph: 73311 94359.

Req Civil Eng(JR/SR) with 2 to 15 yrs Exp To work in Railway BGLINE Project. ✆ 82973 13335. E-mail:irpinfratech@yahoo.in.

గుంటూరు ప్రముఖ సంస్థలో పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జి కలిగిన రిసెప్షనిస్ట్, టెలీకాలర్ మరియు అనుభవం కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆ 94907 89174, 93980 65629.

మా సంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. వయస్సు 18-35 సం॥లోపు. అర్హత 10th, గుంటూరు. గుంటూరు పరిసర ప్రాంతాల వారికి మాత్రమే. ✆ 79955 33563.

హైదరాబాద్‌లోని ఇళ్ళల్లో 24 గం.లు వృద్ధులకు సేవచేయడాన్కి, పిల్లలను చూస్కోవడాన్కి 100 మంది ఆడ/ మగవారు కావలెను. జీతం:10 వేలు. భోజనం+వసతి ఫ్రీ.✆ 7032025222

గుంటూరు నవభారత్‌నగర్ గాయత్రి బోటిక్ నందు పనిచేయుటకు అనుభవం కల్గిన సేల్స్‌గర్ల్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆ 95058 77888.

25 సం॥లుగా నడుపబడుతున్న ప్రముఖ బ్రెడ్ ప్రొడక్ట్స్‌లను సేల్ చేయుటకు పార్ట్‌టైమ్ & ఫుల్ టైం ఆటో డ్రైవర్స్ కావలెను. సంప్ర॥ 90592 36666.

గుంటూరు CAFEలో పనిచేయుటకు అర్జెంటుగా లేడీస్ కావలెను. (22 సం॥లోపు) ఆకర్షణీయమైన జీతం, బృందావన్ గార్డెన్స్ మెయిన్‌రోడ్, 96424 39161, 80744 01613.

గుంటూరు ఓవర్‌సీస్‌లో పనిచేయుటకు లేడీ కౌన్సిలర్, రిసెప్షనిస్ట్ కావలెను. అర్హత: ఏదైనా డిగ్రీ. సంప్ర॥ 85000 59394.

ప్రైవేటు బ్యాంకులో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ (7 No's) కావలెను. Age: 35 లోపు, Q: ఇంటర్ - P.G. జీ: 12500-16700. 90529 40954.

ఆఫీస్‌బాయ్స్ వెంటనే కావలెను: జీ: 9 వేలు. 2 సం॥లు. Exp. ఇంటర్ (పాస్/ఫెయిల్), వయస్సు 30 లోపు బ్రాడీపేట, ఫోన్: 9133386513.

డిభి ఫ్యాషన్ నందు కంప్యూటర్ ఆపరేటర్, సేల్స్‌మెన్స్ కావలెను. బయోడేటాతో సంప్రదించవలెను. Cell No: 92460 39751, అరండల్‌పేట, గుంటూరు.

7th-డిగ్రీ పాస్/ఫెయిల్ ఐన 39 మంది స్త్రీ/పు కావలెను. జీ.రూ॥9500/- + కమీషన్ + ఫ్రీరూమ్. సంప్ర॥ 26 సం॥లోపు వారు: సింధూప్రమోషన్స్, 14/3 అరండల్‌పేట, గుంటూరు. ✆ 85558 00261.

ప్రముఖ ఆడిటర్ (C.A) ఆఫీసు నందు పనిచేయుటకు B.Com & Tally అనుభవం కల్గి ఉన్న Male అభ్యర్థులు కావలెను. సాయిరామ్ కాంప్లెక్స్, కొత్తపేట, గుంటూరు. ✆ 99896 66307.

విజయవాడ, గుంటూరులో ఇళ్ళలో 24 గం. వృద్ధులకు సేవచేయడానికి, వంటకు, పిల్లలను చూసుకోవడానికి 20 మంది ఆడవారు కావలెను. జీ: 9 వేలు+ భోజనం, వసతి. ✆ 91335 68887.

హౌస్ నెంబర్స్ సర్వే చేయుటకు గుంటూరులో స్టాఫ్ కావలెను. (లోకల్ వారికి ప్రాధాన్యత) అర్హత: 10th పాస్, సంప్ర॥ 99668 77539, 88858 57047.

ICICI Bank & క్యాపిటల్ ఫస్ట్ కంపెనీలో రెగ్యులర్ బిల్స్(X) వసూలు చేయుటకు సొంత వాహనము కలిగిన యువకులు కావలెను. జీ: 15,000/- మరియు ఇన్సెంటివ్స్: 6000/- ✆ 98855 96666.

ప్రముఖ తిరుమల ట్రాక్టర్స్ నందు చిలకలూరిపేట నాదెండ్ల మండలాల్లో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ & మెకానిక్స్ స్పేర్‌పార్ట్స్ ఇన్‌ఛార్జి కా॥ అ: డిగ్రీ/డిప్లమో, ITI. Ph: 96522 74477, 83749 50999.

DRIVERS

కారుడ్రైవర్లు వెంటనే కావలెను: జీ: 16-17 వేలు. ఓనర్ వద్ద ఆటోమెటిక్ లగ్జరీకార్లకు సిటీ, హైవేల్లో 8 సం॥ల అనుభవం. లైసెన్స్, 40 సం॥లోపు వయస్సు. బ్రాడీపేట, ఫోన్: 9133386531.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

సావిత్రిబాయికి ఘన నివాళి

బొర్రావారిపాలెం (నిజాంపట్నం), న్యూస్‌టుడే: ఎన్నో అవమానాలను ఎదుర్కొని దేశంలోనే తొలి ఉపాధ్యాయినిగా సావిత్రిబాయిపూలే ఎదిగారని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. సావిత్రిభాయి పూలే 187వ జయంతి బుధవారం బొర్రావారిపాలెంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగింది. దీనిలో పాల్గొన్న కేసన మాట్లాడుతూ జ్యోతిబాపూలే ఆదర్శభావాలతో తన భార్య సావిత్రిబాయిపూలేను చదివించి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారన్నారు. దీనికి గుర్తుగా జనవరి 3ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ క్రమంలోనే గత ఏడాది నుంచి రాష్ట్రంలో ఉపాధ్యాయిని దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం షణ్ముఖ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ప్రియదర్శిని గౌడ్ పేద విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. జనని జన సమష్టి సాయి సేవాసమితి వృద్ధులకు భోజనం ఉచితంగా అందిస్తున్న సంస్థ ఛైర్మన్ యేమినేని రామాంజనేయులును సేవా శిరోమణి అవార్డు, అందించి సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి అంగిరేకుల ఆదిశేషు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూరగాని లక్ష్మి, మాజీ ఎంపీపీ బుచ్చి రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లోకం మోషే, కేసన రామస్వామి, విశ్రాంత జడ్జి ప్రసాదరావు, అరుణ బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కేసన

రైల్వేస్టేషన్ తనిఖీ చేసిన డీఆర్ఎం



రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న డీఆర్ఎం వీజీ భూమా

వినుకొండ: గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ వీజీ భూమా బుధవారం సాయంత్రం వినుకొండ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సాంకేతిక సిబ్బంది కోసం నూతనంగా నిర్మించిన నివాస గృహాలను ఆమె పరిశీలించారు. లోటుపాట్లు సరిదిద్దాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వీటిని ప్రారంభించేందుకు ఈనెల 17న సౌత్‌సెంట్రల్ రైల్వే జీఎం రానున్నారని పేర్కొన్నారు. స్టేషన్‌లో తాగునీటి సమస్యను ప్రయాణికులు ప్రస్తావించగా పురపాలకసంఘం అధికారులతో మాట్లాడాలని స్థానిక అధికారులకు ఆమె సూచించారు. మచిలీపట్నం, యశ్వంత్‌పూర్, గరీబ్‌రథ్ రైళ్లను స్టేషన్‌లో ఆపాలని కోరగా పరిశీలిస్తామని తెలిపారు. స్టేషన్ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు.

వర్సిటీ అకడమిక్ సెనెట్ సభ్యునిగా సుందరాచారి



గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు సర్వజనాసుపత్రి న్యూరాలజీ విభాగం అధిపతిగా పనిచేస్తున్న ఆచార్య ఎన్.వి.సుందరాచారిని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం అకడమిక్ సెనెట్ సభ్యునిగా నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య బుధవారం జీవో నంబరు.2 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన అరుదైన వ్యాధులపై సమర్పించిన పరిశోధనాపత్రాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. వైద్య రంగంలో పరిశోధనలపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్న ఆయన ఇప్పటికే పీహెచ్‌డీ చేసే వైద్యులకు గైడ్‌గా కూడా పనిచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల నుంచి మొత్తం ఐదుగురు ఆచార్యులను ప్రభుత్వం నియమించగా అందులో సుందరాచారి ఒకరు కావడం గమనార్హం. ఈ కమిటీ సభ్యులు వైద్య విద్య బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించడంతో పాటు కొత్త కోర్సులు ప్రారంభించడానికి సిఫార్సు చేయవచ్చు.

మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలోని పరికరాలు, యంత్రాల మరమ్మతులు వెంటనే జరిగే విధంగా చూడాలని సూపరింటెండెంట్ రాజునాయుడు సూచించారు. ఈ పరికరాల పర్యవేక్షణ బాధ్యతను చూస్తున్న టెలిమ్యాట్రిక్ అండ్ బయోమెడికల్ సర్వీసెస్(టీబీఎస్) ప్రతినిధులతో బుధవారం సూపరింటెండెంట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజునాయుడు మాట్లాడుతూ ఏదేని పరికరం, యంత్రం పనిచేయకుండా మొరాయిస్తే కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసిన వెంటనే మరమ్మతులు చేసేవిధంగా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఈ నిబంధన సక్రమంగా అమలు కావడంలేదన్నారు. దీనివల్ల రోగులకు వైద్య సేవలందించడంలో సమస్యలు వస్తున్నాయన్నారు. అందువల్ల నిబంధనల మేర పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

27 నుంచి నిరవధిక సమ్మె



ధర్నా చేస్తున్న విద్యుత్తు సంస్థ ఒప్పంద ఉద్యోగులు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థల్లో పని చేసే ఒప్పంద కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఈ నెల 27వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు ఒప్పంద కార్మికుల ఐక్యవేదిక నాయకులు రాజశేఖర్ తెలిపారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు విద్యుత్తు భవన్ ఎదుట భోజన విరామ సమయంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 26, 27 తేదీల్లో బాపట్లలో జాతీయ సదస్సు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీసీ దామోదరనాయుడు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: వ్యవసాయంలో సాంకేతికత, డిజిటల్, ఇంజినీరింగ్ టెక్నాలజీలపై జాతీయ సదస్సు బాపట్లలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టరు వి.దామోదరనాయుడు తెలిపారు. గుంటూరు లాంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవన్‌లో జాతీయ సదస్సుకు సంబంధించి కరపత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తులు రైతులు సాధించేలా డిజిటల్, సాంకేతికత సద్వినియోగంపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సదస్సును బాపట్ల వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల, ఆగ్రోస్, భారతీయ ఇంజినీరింగ్ సమాజం-ఆంధ్రప్రదేశ్ ఛాప్టర్ సహకారంతో నిర్వహిస్తున్నారని వివరించారు. ఇతర వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.angrau.ac.inలో చూడాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ ఇంజినీరింగ్ విభాగం డీన్ భాస్కరరావు, అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 86, రిటైల్ ధర - 108, చికెన్ విత్ స్కిన్ - 157, చికెన్ స్కిన్‌లెస్ - 178.

కృష్ణా జిల్లాలో: బ్రాయిలర్ ఫారం ధర - 86, రిటైల్ ధర -108, చికెన్ విత్ స్కిన్ -157, చికెన్ స్కిన్‌లెస్ - 178.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం ధర -89, 96, 106, చికెన్ విత్ స్కిన్- 172, చికెన్ స్కిన్‌లెస్- 182.

నెక్ కోడిగ్రుడ్ల ధర

★ విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.85 పై॥.

★ నెక్ విజయవాడ ఆఫీస్: Ph: 0866 - 6582559.

గాలి కొదిలేశారు..!

ఈనాడు పరిశీలన

- పెట్రోల్ బంకుల్లో ఉచిత సేవలు దూరం
- వాహన యజమానులపై ఏటా రూ.107 కోట్ల 'గాలి'భారం
- మరుగుదొడ్లు ఉన్నా తాళాలు
- పారిశుద్ధ్య లోపాలు
- జాతీయ రహదారులపై వాహనదారుల అవస్థలు









అమరావతి గ్రామం రాయపుడి పెట్రోల్ బంక్ ఇది. ఇందులో గాలి యంత్రం పని చేయడం లేదు. ప్రథమ చికిత్స పెట్టె, తాగునీటి సౌకర్యం ఉన్నాయి.

సుబ్బారావు... తన ద్విచక్ర వాహనాన్ని చక్కగా వాడుతుంటారు. ప్రతి వారం టైర్లలోని గాలి ఒత్తిడిని పరిశీలిస్తారు. కచ్చితంగా సరిపడా గాలి ఉండేలా చూసుకుంటారు. అదేమి చాదస్తం అని స్నేహితులు అంటే.... టైర్లలోని గాలి ఒత్తిడికి, వాహనం మైలేజీకి సంబంధం ఉందని చెబుతారు. సరిపడా గాలి ఉంటే వాహనం మైలేజీ బాగా వస్తుందని వివరిస్తారు.

పెట్రోలు పోయించుకునే బంకులో ఉచితంగా గాలి కొట్టించుకుందామని వెళ్లే సుబ్బారావు లాంటి సగటు వాహనదారులకు నిరుత్సాహమే మిగులుతోంది.. పెట్రోలియం కంపెనీలు చెబుతున్న ప్రకారం ఉచితంగా గాలి కొట్టాలన్న నిబంధన సక్రమంగా అమలు కావడం లేదు. . వీటిని కొన్ని బంకులు మాత్రమే పాటిస్తున్నాయి.. యంత్రం పాడైందనో.. సిబ్బంది లేరనో వాటిని మూలకు చేరుస్తున్నారు.. పూర్తి ఉచితంగా అందాల్సిన సేవకు ఏటా వాహనదారులు రెండు జిల్లాల్లో కలిపి రూ.107కోట్లు చెల్లిస్తుండటం గమనార్హం.. పెట్రోలు బంకుల్లో నిబంధనల ప్రకారం అందాల్సిన ఇతర సేవలు, ప్రజల్లో చైతన్యంపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.

5 బంకుల్లో ఈ ఐదు తప్పనిసరి...

1. ఉచిత గాలి
2. ఉచిత మరుగుదొడ్ల సౌకర్యం (TOILET)
3. ప్రాథమిక చికిత్సకు అవసరమైన దూది, బ్యాండేజీ, మందు
4. వినియోగదారుని కోరికపై పెట్రోల్/డీజిల్ నాణ్యత, కచ్చితమైన కొలతను తెలియజేసే కిట్
5. సలహాలు, ఫిర్యాదుల పుస్తకం

జిల్లా	బంకుల సంఖ్య
కృష్ణా	230
గుంటూరు	243

న్యూస్‌టుడే, అమరావతి

పెట్రోల్ బంకుల్లో లభ్యమయ్యే ఉచిత సేవలను పరిశీలిస్తే ఉచిత గాలి మినహా మిగిలిన సౌకర్యాలు ఆయా బంకుల్లో కల్పిస్తారన్న విషయం చాలా మందికి తెలియదు. గాలి ఉచితంగా ఇవ్వాలన్న విషయం తెలిసినా వాహనదారులకు ఆ సేవలు అందడం లేదు. కొన్ని బంకుల్లో ఉచితంగా గాలి పెట్టడం లేదు. గాలి యంత్రం ఉన్నా పెట్టేందుకు సిబ్బంది కనిపించరు. మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నా పరిశుభ్రంగా ఉండని పరిస్థితి. కొన్ని చోట్ల తాళాలు వేసి ఉంటాయి. పెట్రోల్ నాణ్యత, కొలతలపై ఆయా పెట్రోల్ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియంలు ఎప్పటికపుడు తనిఖీలు చేస్తుంటాయి. ప్రతి ట్యాంకరు లోడ్ రాగానే ఆయా బంకుల యాజమాన్యాలు నాణ్యత, కొలతలను పరిశీలించుకుంటాయి. ఆ తరువాతే ట్యాంకుల్లోకి దిగుమతి చేసుకుంటాయి. ట్యాంకులోకి దిగుమతి అయిన తరువాత నాణ్యతలో లోపం వస్తే ఆయా బంకు యాజమాన్యాలదే బాధ్యత. అందుకే ప్రతి ఒక్కరూ నాణ్యత విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటారు. ఇక వాహనదారుకు నాణ్యత, కొలతపై అనుమానం వస్తే తక్షణం దాన్ని నివృత్తి చేసే ఉపకరణాలు ప్రతి బంకులో అందుబాటులో ఉంటాయి. నాణ్యత నిర్ధారణకు ఫిల్టర్ పేపర్ పరీక్ష, డెన్సిటీ పరీక్షలు నిర్వహించి తెలియజేస్తారు. ఇవన్నీ ప్రతి పెట్రోల్ బంకులో ఉండాలి. వాహనదారులకు ఈ విషయాలు తెలిసినా పరీక్షించమని కోరేది 1 శాతం కంటే తక్కువే.

వాహనానికి ఖర్చు ఇలా...



ప్రతి ద్విచక్ర వాహనం, కార్లు తదితర వాహనాలు ప్రతి వారం తమ వాహనం టైర్లలో గాలి ఒత్తిడి సక్రమంగా ఉండేలా చూసుకుంటాయి. ప్రైవేటు దుకాణాల్లో ద్విచక్ర వాహనానికి ఒకసారి గాలి పెడితే రెండు టైర్లకు కలిపి రూ. 10 వసూలు చేస్తే అదే కారుకు రూ. 20 తీసుకుంటారు. ఇక లారీలు ఆటోలది ఇదే పరిస్థితి. మన ద్విచక్రవాహనాలు, కార్లను తీసుకుని ఏటా కేవలం గాలి కోసమే అయ్యే ఖర్చును లెక్కిస్తే... అమ్మో అనుకోవాల్సిందే.

వాహనం	వారం ఖర్చు	నెల ఖర్చు	ఏడాది ఖర్చు (రూపాయల్లో)	రెండు జిల్లాల్లో వాహనాలకు.. (రూ.)
బైక్	10	40	480	92,93,61,600
కారు	20	80	960	14,74,56,960

కేవలం ద్విచక్ర వాహనాలు, కార్లకు ఉచితంగా గాలి పెట్టకపోతే వాహన యజమానులపై ఏడాదికి పడే భారం అమ్మో అనుకోకతప్పదు. అది రూ.107,68,18,560గా లెక్క తేలింది.

రెండు జిల్లాల్లో వాహనాల సంఖ్య

జిల్లా	కార్లు	ద్విచక్రవాహనాలు
విజయవాడ	82,417	7,84,932
కృష్ణారూరల్	23,710	7,52,730
గుంటూరురూరల్	39,657	3,23,126
గుంటూరు సిటీ	7,817	75,382
మొత్తం	1,53,601	19,36,170

ఉచిత గాలి కొన్ని చోట్ల కనిపించదు...

ప్రతి వాహనానికి ఉచితంగా గాలి పెట్టాలన్నది ఆయా పెట్రోలియం కంపెనీల నిబంధన. దీనికి అనుగుణంగా ఆయా పెట్రోలియం కంపెనీలే గాలి యంత్రాలను బంకుల్లో ఏర్పాటు చేస్తాయి. అయితే కొన్ని చోట్ల ఇది అమలుకు నోచుకోవటం లేదు. సిబ్బంది కొరత అని కొన్నిచోట్ల, పని చేయడం లేదంటూ ఇంకొన్ని చోట్ల గాలి పెట్టటం లేదు. ఫలితంగా వాహన యజమానులు దుకాణాల్లో డబ్బులు ఇచ్చి గాలి పెట్టించుకుంటున్నారు.

పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలు కల్పిస్తున్నాం

ప్రతి పెట్రోల్ బంకులో వినియోగదారుల కోసం తప్పనిసరిగా అందుబాటులో ఉండే ఉచిత సేవలను అందిస్తున్నాం. అయితే కొన్ని చోట్ల మాత్రం ఉచిత గాలి ఉండటం లేదు. యంత్రం పాడైతే సదరు కంపెనీ వచ్చి మరమ్మతులు చేయాలి. ఒక్కోసారి ఇది ఆలస్యం అవుతుంది. ఒక్కోసారి సిబ్బంది కొరత వల్ల ఉచితంగా గాలి ఇవ్వలేకపోతున్నారు. **-సిహెచ్.నరసింహారావు, కృష్ణా జిల్లా పెట్రోల్ బంకుల సంఘం అధ్యక్షుడు**

పరిశీలన

నగరంలోని పెట్రోల్‌బంకుల్లో మరుగుదొడ్డి సౌకర్యం అందుబాటులో ఉంది. పెట్రోల్ నాణ్యత, కొలతలో అనుమానం ఉంటే పరిశీలించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయి. ఆయా కంపెనీలు నిత్యం వీటిని పర్యవేక్షిస్తుంటాయి. అయితే ఉచిత గాలి మాత్రం పగటి పూట సైతం అందుబాటులో లేని బంకులు కొన్ని ఉన్నాయి. గాలి యంత్రాలున్నా వాటిని కొన్ని చోట్ల ఉపయోగించటం లేదు. కొన్ని చోట్ల పనిచేయటం లేదు. అపుడపుడు మొరాయిస్తున్నాయి.

1. ప్రదేశం: మధురానగర్ పెట్రోల్ బంక్
పరిశీలన: ఉచిత గాలి అందుబాటులో లేదు. ఇక్కడ మిషన్ ఉంది. కానీ వాడుతున్న దాఖలాలు లేవు. నిరుపయోగంగా పడి ఉంది.

2. ప్రదేశం: మహాత్మాగాంధీ రోడ్డులో హెచ్‌పీ పెట్రోల్‌బంక్
పరిశీలన: ఉచిత గాలి యంత్రం ఉంది. పెట్రోలు పంప్‌నకు సమీపంలో ఉండటంతో ద్విచక్రవాహనాలు ఆగి గాలి పెట్టించుకునేందుకు అనువుగా లేదు.

3. ప్రదేశం: మహాత్మాగాంధీ రోడ్డులోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ బంక్
పరిశీలన: గాలి ఉచితంగా పెడుతున్నారు. ఇరుకైన ప్రదేశంలో బంక్ ఉంది.

4. ప్రదేశం: గాంధీనగర్‌లోని గారపాటి పెట్రోల్‌బంక్
సేవలు: ఉచిత గాలి అందుబాటులో ఉంది.

5. ప్రదేశం: సీతారాంపురంలోని ఐఓసీ పెట్రోల్‌బంక్
సేవలు: ఉచిత గాలి ఉంది. కానీ పెట్టేందుకు సిబ్బంది అందుబాటులో లేరు.

6. ప్రదేశం: గూడవల్లిలోని లారీ యజమానుల సంఘం పెట్రోల్ బంక్
సేవలు: గాలి యంత్రం ఉంది. ఉచిత గాలి ఎపుడూ అందుబాటులో ఉంటుంది. విశాలమైన ప్రాంగణంలో అన్ని సౌకర్యాలతో ఉంది. ప్రథమ చికిత్స పెట్టె ఉంది.

7. ప్రదేశం: బందరురోడ్డులో భారత్ పెట్రోలియం బంక్
సేవలు: విశాలమైన ప్రాంగణం. ఉచితంగా గాలి అందుబాటులో ఉంది.

8. కానురు: ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంక్
పరిశీలన: గాలి యంత్రం పని చేయడం లేదు. వాహన యజమానులు అడిగితే పనిచేయడం లేదని సిబ్బంది సమాధానం చెబుతున్నారు. మరుగుదొడ్లకు తాళాలు వేస్తారు.

ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత

జిల్లా కలెక్టరు కోన శశిధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టరు కోన శశిధర్, పక్కన ఎమ్మెల్యే మోదుగుల, జేసీ క్రితికా శుక్ల

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజల ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి పథకాలను పారదర్శకంగా అమలు చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టరు కోన శశిధర్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఎల్‌పీజీ పంపిణీదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా కంప్యూటరైజ్డ్ ఆన్‌లైన్ డ్రా కార్యక్రమం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జిల్లా సంయుక్త కలెక్టరు క్రితికా శుక్ల అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టరు మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హెచ్.పి. గ్యాస్ కంపెనీలకు సంబంధించి పంపిణీదారుల ఎంపికను కంప్యూటరైజ్డ్ ఆన్‌లైన్‌లో చేపట్టడాన్ని అభినందించారు. ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావు లేకుండా కలెక్టరేట్‌లోని నిక్ కేంద్రంలోని అంతర్జాలం ద్వారా చేపట్టారన్నారు. ఆన్‌లైన్ డ్రాలో పంపిణీదారులుగా ఎంపికైన వారు ప్రజలకు సకాలంలో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను చేరవేసినపుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన అందజేయటమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. గతంలో గ్యాస్ కోసం 20 కిలోమీటర్ల దూరం వరకు వెళ్లి సిలిండర్ తెచ్చుకునే వారని, ప్రజలకు అందుబాటులోకి గ్యాస్‌ను తెచ్చేందుకు మారుమూల ప్రాంతాల్లోనూ పంపిణీదారులను ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డీజీఎం మీరానాయర్ ఎల్‌పీజీ పంపిణీదారుల కంప్యూటరు ఆన్‌లైన్ డ్రా ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. కృష్ణా జిల్లా ఊటుకూరు కేంద్రానికి సంబంధించి ఆన్‌లైన్ డ్రా ద్వారా ఎంపిక చేశారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన 257 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 230 మందిని ఎంపిక చేశారు. సమావేశంలో హెచ్‌పీసీఎల్ డీజీఎం ఖాద్రీ, డీఎస్‌వో చిట్టిబాబు, ఆయా గ్యాస్ కంపెనీల అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

పదో తరగతి పూర్తవగానే కొంతమంది బాలికలు బలవంతంగా పెళ్లిపీట లెక్కుతున్నారు. తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడం.. వారిని పైచదువులకు ప్రోత్సహించక పోవడం.. బాలికలను భారంగా పరిగణించి వారికి పెళ్లి చేసి అత్తారింటికి పంపుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించి కేజీబీవీలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. పదో తరగతి తర్వాత బాలికలను చదువుకునేలా ప్రోత్సహిస్తోంది.

– న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్

చైతన్యం పెంచేలా.. విద్యార్జన చేసేలా..

బాలికలను ప్రోత్సహించేలా పైచదువులు | జూనియర్ కళాశాలలుగా కేజీబీవీలు | సన్నాహాలు చేస్తున్న ప్రభుత్వం

జిల్లాలో మొత్తం 24 కేజీబీవీలు ఉన్నాయి. వాటిలో 5010 మంది బాలికలు చదువుకుంటున్నారు. వీరిలో పదోతరగతి విద్యార్థినులు 800 మంది. ఏటా ఇంటర్మీడియట్‌లో చేరుతున్న విద్యార్థినులు 300లోపే ఉంటున్నారని అధికారులు చెబుతున్నారు. వీరిలో తల్లిదండ్రులు లేని అనాథలు, తల్లి లేదా తండ్రి లేని బాలికలు కేజీబీవీల్లో చదువుకుంటున్నారు. గత మూడేళ్లుగా బాల్య వివాహాలు నమోదైంది స్వల్పమే అయినా గుర్తించనవి మాత్రం భారీగానే ఉంటున్నాయి. దాదాపుగా 500లకు పైగా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు అనధికార అంచనా.



తయారు చేసిన వస్తువులు ప్రదర్శిస్తున్న బాలికలు

విద్యతో పాటు చేతివృత్తులు : కేజీబీవీల్లో విద్యతో పాటు బాలికల సమగ్రాభివృద్ధి సాధనకు అనుగుణంగా ప్రత్యేకంగా చేతివృత్తులపై శిక్షణ ఇస్తున్నారు. కుట్టుమిషన్‌పై ఎంబ్రాయిడరీ, అల్లికలు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తూ ఏదో ఒక చేతివృత్తి ద్వారా జీవించేందుకు కావాల్సినంత సంపాదించుకునే నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా చర్యలు ఉంటున్నాయి.

మనోధైర్యానికి కిశోర వికాసం : బాలికల్లో మనో ధైర్యాన్ని నింపడమే లక్ష్యంగా కిశోర వికాసం పేరిట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో యువతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. వారి ద్వారా బాలికా విద్యాలయాల్లో ఉన్నత విద్యకు ఉన్న అవకాశాలు, ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రత, బాల్యవివాహాలతో జరిగే నష్టం తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించి చైతన్యం తెస్తున్నారు. తద్వారా బాల్యవివాహాలను నిర్మూలించాలన్నది లక్ష్యం. వివాహ వయస్సు, శారీరక నిర్మాణం తదితర అంశాలను వివరిస్తున్నారు.

జిల్లాలో 18 చోట్ల జూనియర్ కళాశాలలు : బాలికల్లో విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా రెండు కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో 2017-18 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ కోర్సులు ప్రారంభించనున్నారు. బెల్లంకొండ, నాదెండ్లల్లో ఉన్న కేజీబీవీలను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. వీటిలో 100మంది విద్యార్థినులకు ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సుల్లో తరగతులు నిర్వహించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరో 16 కేజీబీవీల్లో కూడా ఇంటర్మీడియట్ కోర్సులు నిర్వహించాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. అది కార్యరూపం దాల్చితే 1800 మంది బాలికలు ఇంటర్మీడియట్ చదువుకునేందుకు మార్గం సుగమం అవుతుంది. ఇంటర్మీడియట్ కోర్సుల నిర్వహణకు ఏడు తరగతి గదులు అవసరమని అధికారులు గుర్తించారు. అందుకు తగిన వసతులు లేకుంటే ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకునే యోచనలో ఉన్నారు.



కబడ్డీ ఆడుతున్న బాలికలు

తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం



బాలికల తల్లిదండ్రులు, సంరక్షకులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నాం. బాలికలకు ఉన్న విద్యావకాశాలు గురించి వివరిస్తున్నాం. కేజీబీవీల్లో ఉపాధ్యాయుల పోస్టులు అన్నీ భర్తీ చేశారు. వృత్తి శిక్షణకు కూడా శిక్షకులు ఉన్నారు. ముస్లిం మైనారిటీ విద్యార్థినులు 60మంది కంటే ఎక్కువగా ఉన్న మూడు కేజీబీవీల్లో ఉర్దూలో విద్యాబోధన చేస్తున్నాం. 18 చోట్ల ఇంటర్మీడియట్ కోర్సులు ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనలు కూడా చేశాం.

-వై.శ్రీలక్ష్మి, సహాయ జిల్లా బాలికాభివృద్ధి అధికారిణి

సంపూర్ణ వికాసానికి చర్యలు



బాలికల సంరక్షణకు ఐసీడీఎస్ తరపున ప్రత్యేకంగా చాలా పథకాలు అమలు చేస్తున్నాం. కిశోర వికాసం పేరిట బాల్యవివాహాల నిరోధానికి ప్రాజెక్టుల పరిధిలో యువతులను గుర్తించి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. సంక్షేమశాఖల ఆధ్వర్యంలో నిర్వహించే వసతిగృహాలు, కస్తూర్బా పాఠశాలల్లో కూడా నిర్దిష్టంగా విద్యకు అవకాశాలు, బాల్యవివాహాలతో జరిగే నష్టం గురించి వివరిస్తున్నాం.

-ప్రసూన, సీడీపీవో నరసరావుపేట ప్రాజెక్టు

చదువుకుంటా



రేమిడిచర్ల స్వగ్రామం. నాన్న ఆటో డ్రైవర్. పదోతరగతి తర్వాత చదువుకోవటం ఎలా అని ఆలోచన ఉండేది. బాలికలకు చదువుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు గురించి ఉపాధ్యాయులు చెబుతున్నారు. పదోతరగతి తర్వాత ఇంటర్మీడియట్ చదువుకునేందుకు కూడా కోర్సులు పెడుతున్నట్లు చెబుతున్నారు. చదువుకునేందుకు వచ్చిన మంచి అవకాశం వినియోగించుకుంటా.

-దుర్గాభవాని, పదోతరగతి, కేజీబీవీ నరసరావుపేట

కళ్లార్పుతుండవోయ్..!



➠ నిమిషానికి 15 సార్లు చేస్తే మేలు ➠ అరగంటకోసారి కళ్లకు వ్యాయామం తప్పనిసరి
➠ పెరుగుతున్న దృష్టి లోపాలు ➠ యుక్త వయస్సులోనే కళ్లద్దాలు ➠ ఆధునిక గాడ్జెట్‌ల వల్లే అంటున్న నిపుణులు



❖ 'మా అబ్బాయి ఎంత చెప్పినా వినట్లేదు. స్కూల్ నుంచి వచ్చినప్పటి నుంచి అదే పనిగా స్మార్ట్‌ఫోన్‌ని వదలడం లేదు. కాసేపు పక్కన పెట్రా అంటే ససేమేరా అంటున్నాడండీ..'

- ఓ తండ్రి వైద్యుడికి చేసిన ఫిర్యాదు.

❖ 'మీ అబ్బాయి అద్దాలు వాడుతున్నారు కదూ..!' అని తనకు తెలిసినట్టుగా అన్నాడు డాక్టర్.

- 'మీకెలా తెలుసండీ' అని నోరెళ్లబెట్టాడు తండ్రి.

ఈనాడు డిజిటల్, గుంటూరు


'ఈ గాడ్జెట్లను ఎంతవరకూ వాడాలో అంతవరకే వాడాలి. మితిమీరితే మీవాడు ఇలానే కళ్లద్దాలు పెట్టుకోవాల్సిందే మరి. అని డాక్టర్ చెప్పడంతో ఆ తండ్రి ఆలోచనలో పడ్డారు. చాలా మంది తండ్రుల పరిస్థితి ఇది.

అద్దాలు రానివారు అదృష్టవంతులంటారు. అద్దాలు లేకుండా ప్రపంచాన్ని చూడటం అనేది వరమే. ఇప్పుడా అదృష్టవంతుల సంఖ్య బాగా తగ్గుతోంది. చుట్టూ ఉన్న సమాజాన్ని అద్దాలతోనే చుడాల్సి వస్తోంది. దేవుడిచ్చిన కళ్లు రెండయితే, స్వయం కృతాపరాధంగా సంపాదించేవి మరో రెండు.. అవేనండీ అద్దాలు. కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవడానికి వాటితోనూ వ్యాయామం చేయించాలి. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి దోహదపడుతుందనటంలో సందేహం లేదు. కానీ ఏదీ పరిమితికి మించికూడదు.

ప్రతి పది మందిలో నలుగురు అద్దాలతోనే...


కళ్లకు ఇబ్బంది కలిగించే ఏ పరిజ్ఞానమైనా అవసరమైనంత మాత్రమే వాడాలని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇప్పుడొచ్చే అత్యాధునిక గాడ్జెట్‌లైన స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, ల్యాప్‌టాప్, ఎల్ఈడీ టీవీ లాంటివి ఎక్కువసేపు చూస్తే కళ్లకు ఇబ్బందే. ఇలా ఎక్కువ గాడ్జెట్‌లకు అలవాటై ఎక్కువ సమయం వెచ్చించి కళ్లకు ఇబ్బందులు తెచ్చుకుంటున్నారు. దీంతో దృష్టి లోపాలు తలెత్తుతున్నాయి. చివరకు కళ్లద్దాలు వాడాల్సి వస్తోంది. నిపుణుల అంచనా ప్రకారం ఇప్పుడు ప్రతి 10 మందిలో కనీసం నలుగురు నుంచి ఐదుగురు అద్దాలతోనే కనిపిస్తున్నారు. ఇవి జన్యుపరంగా వచ్చిన లోపమా అంటే లేదు.. స్వయం కృతాపరాధమేనని అంటున్నారు వైద్యులు.

కళ్ల మంట, తెలియని అలసట...



గాడ్జెట్స్ వాడేవారిలో కళ్లార్పడం తగ్గిపోవడంతో నల్లగుడ్డుపై పొర పొడిగా మారుతోంది. దీనివల్లే కళ్లు మండుతున్నట్లు, తెలియని అలసట ఉన్నట్లనిపిస్తుందని చెబుతున్నారు. ఎక్కువగా ఏసీలో కూర్చున్నవారిలోనూ ఈ సమస్య కనిపిస్తోంది. ఈ యంత్రాల ద్వారా గదిలోని తేమతో పాటు కంటిలోని తేమనూ లాగేస్తున్నాయి. తద్వారా గదిలోని తేమతో పాటుగా కంటిలోని తేమనూ లాగేస్తున్నాయి. తద్వారా కంటిలోని తేమ మాయమవుతోంది. ఇప్పటికైనా జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ ఈ సమస్య ఉంటే ఆర్టిఫిషియల్ డ్రాప్స్ ద్వారా ఉపశమనం పొందవచ్చని వారు సూచిస్తున్నారు. ఏసీకి ఎదురుగా ఎప్పుడూ కూర్చోవద్దని అంటున్నారు.

కళ్లార్పడమూ తగ్గింది..



సహజంగా ప్రతి వ్యక్తి ఒక నిమిషానికి 15 సార్లు కళ్లార్పుతారు. ఇది జరిగితేనే కళ్లకు రక్షణ ఉంటుంది. నగరవాసుల్లో కళ్లార్పే రేటు బాగా పడిపోయిందంటున్నారు వైద్య నిపుణులు. ఇలా చేయడం వల్ల నల్లగుడ్డుపై ఉన్న పొర పగిలిపోతోంది. స్మార్ట్‌ఫోన్, ట్యాప్, ల్యాప్‌ట్యాప్ లాంటి గాడ్జెట్ల మోజులో పడి అందులో లీనమైపోయి కళ్లార్పడం బాగా తగ్గించేశారు. నిపుణుల పరిశీలన ప్రకారం వీటిని వాడే వ్యక్తి నిమిషానికి ఐదుసార్లు కూడా కళ్లార్పడం లేదంటున్నారు. కళ్లు ఆర్పడం వల్ల గుడ్డుపై ఉన్న పొర తడుస్తూ కంటికి కావాల్సిన ఆక్సిజన్‌ను అందిస్తుంటుంది. దానివల్ల కళ్లకు రక్షణ ఏర్పడుతుంది.

ఇబ్బంది అయితేనే.. వస్తున్నారు..

కళ్లకు తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వారి సంఖ్య తక్కువే. కళ్లు బాగా నొప్పి పెడితే ఆస్పత్రులకు వస్తున్నారు. కొందరు దృష్టి లోపం ఉన్నా.. అద్దాలు పెట్టుకోవడం లేదు. ఇలాంటి వారిలో సమస్య రెట్టింపు అవుతోందని చెబుతున్నారు.



ఏం చేస్తే బాగుంటుంది..

❖ గాడ్జెట్‌లను అవసరం మేరకే చూసుకుని పక్కనపెడితే మంచిది.
❖ పనిలో ఉన్నా ప్రతి అరగంటకో, గంటకో కనీసం 2 నిముషాల పాటు కళ్లను పైకి, కిందకు కుడి ఎడమలకు చూడటం, కనుగుడ్డును తిప్పాలి.

ఇదీ నిజం..

❖ కళ్ల పరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చేవారిలో 60-70 శాతం మందికి అద్దాల్ని సూచిస్తున్నారు.
❖ అద్దాలు కలిగిన వారిలో 30 శాతం మంది యువతే.
❖ గత ఐదేళ్ల కాలంలో అద్దాలు తగిలించుకునే వారి సంఖ్య రెట్టింపయ్యిందని నిపుణుల అంచనా.

కళ్లద్దాలు పొందేవారిలో..

దృష్టి లోపం ఉన్నవారు..	50 శాతం
కళ్లు అలసటగా ఉన్నవారు..	30శాతం
తలనొప్పి ఉన్న వారు..	20 శాతం

సెల్‌ఫోన్/ట్యాబ్..

కళ్లకు ఉండాల్సిన దూరం- కనీసం 1 నుంచి 1.5 అడుగులు
పెడుతున్నది- 1.5 అడుగులు

ల్యాప్‌టాప్/ కంప్యూటర్

కళ్లకు ఉండాల్సిన దూరం- కనీసం 2 - 2.5 అడుగులు
పెడుతున్నది- 1.5 అడుగులు



ఈ ఆహారమే మేలు.. ›››



విటమిన్ ఏ, డీ ఉన్న ఆహార పదార్థాల్ని ఎంత బాగా తీసుకుంటే కళ్లకు అంత మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. చేప, గుడ్డు, పాలు, క్యారెట్ లాంటి వాటితో పాటు పండ్లను తీసుకోవాలి. దృష్టిలోపమున్నా, లేకపోయినా విటమిన్ ఏ డ్రాప్స్‌ని పిల్లలకు కచ్చితంగా వేయించాలి.

లోపం ఎలా వస్తోంది..? ›››



ఆస్పత్రులు, క్లినిక్‌లకు వచ్చే వారిని పరీక్షించినప్పుడు కళ్ల పరంగా చాలా లోపాలు బయటపడుతున్నాయి. వీరిలో ఎక్కువ మంది స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, ట్యాబ్‌లాంటి వాటితో గడుపుతున్నారు. అదీ రోజుకు మూడు గంటలు, దానికి మించి వాడుతున్నారు. ఇలాంటి వారిలో కళ్లకు బాగా అలసట రావడం, నిద్రపోవాలని అనిపించడం, కళ్లు నొప్పిగా ఉండటం, తలనొప్పి పెరగడం, నుదురులో తిరుగుతున్నట్లు అనిపించడం, తెర, అక్షరాలు చూసినప్పుడు నొప్పి పెట్టడం లాంటి లక్షణాలు ఉన్నట్లు వారు గుర్తించారు. వీటికి చాలా దగ్గరగా కూర్చోవడమూ ప్రమాదంగా పరిణమించింది.


కంటికి విశ్రాంతి తప్పనిసరి ›››

ప్రస్తుతం కంటికి తగినంత విశ్రాంతి ఇవ్వడం లేదు. ఎప్పుడూ సెల్‌ఫోన్, కంప్యూటర్లపై గడుపుతున్నారు. అలాగే మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల తగినంత పోషకాలు అందకపోవడం కూడా చిన్న వయస్సులోనే దృష్టి లోపాలు తలెత్తడానికి కారణం. అందుకే పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలి. ఎక్కువ మంది కంటి సంబంధిత ఇబ్బందులు వచ్చినప్పుడే ఆస్పత్రికి వస్తున్నారు. అలాకాకుండా ఏడాదికి ఒకసారి తప్పనిసరిగా పరీక్షలు చేయించుకుంటే మంచిది. కంప్యూటర్ ముందు ఎక్కువగా గడిపేవారు ప్రతి 20 నిముషాలకు 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువులని 20 సెకండ్ల పాటు చూస్తే మంచిది. కాంతి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లో, కార్యాలయాల్లో సరిపడా వెలుగు వచ్చేలా చూసుకోవాలి. ఒకవేళ సైటు వచ్చినా ఇబ్బంది లేదు. ఆహారంలో మార్పు, మందుల వాడకం వల్ల అదుపులో ఉండటంతో పాటు, తగ్గే అవకాశం ఎక్కువగా ఉంది.

– కృష్ణారెడ్డి, కంటి వైద్య నిపుణులు

ధ్రువపత్రాలు నిశ్చింతగా భద్రపరుచుకోండి

▲ డిజీలాకర్ యాప్‌తో ఎన్నో ఉపయోగాలు ▲ అరచేతిలోనే అన్ని పత్రాలు



న్యూస్‌టుడే, ఈపూరు

మన వ్యక్తిగత ధ్రువపత్రాలు, డాక్యుమెంట్లను జాగ్రత్తగా భద్రత పరుచుకుని అవసరానికి వినియోగించుకుంటాం. అయితే వాటిని ప్రతిసారీ వెంటతీసుకు వెళ్లాలంటే కష్టమైనపని. వీటి కోసం కేంద్ర ప్రభుత్వం డిజీలాకర్ పేరుతో ప్రత్యేకంగా యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇది జీమెయిల్ లాగా కూడా ఉపయోగపడుతుంది. ఈ యాప్‌లో ఆధార్, ఓటరుకార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, చదువుకు సంబంధించిన ధ్రువపత్రాలను డిజీలాకర్‌లో దాచుకోవచ్చు. ఇలా మనం దాచుకున్న పత్రాలు ఒరిజినల్లా కాదా అని ప్రభుత్వం సరిచూసుకుంటుంది. అనంతరం ఈసైన్ అవుతుంది. ఈసైన్ అయిన తర్వాత మనం సంబంధిత ధ్రువపత్రాలను ఉపయోగించుకోవచ్చు. డిజీలాకర్‌లో దాచుకున్న పత్రాలను అవసరమైనపుడు జిరాక్స్ తీసుకోవచ్చు. అవసరమైన వారికి ఈయాప్ నుంచే మెయిల్‌ద్వారా పంపుకోవచ్చు. తనిఖీల సందర్భంగా ఎవరైనా డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలు చూపమంటే సెల్‌ఫోన్‌లో డిజీలాకర్ ఓపెన్‌చేసి చూపవచ్చు. ప్రభుత్వం రూపొందించిన ఈ యాప్‌లో భద్రపరిచిన పత్రాలు దొంగిలించడం, లేదా హాక్ చేయడం కష్టతరమైన పని.



డిజీలాకర్‌లో రిజిస్టర్ అవడం ఇలా..

గూగుల్‌ప్లే స్టోర్‌లో డిజీలాకర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌ను ఓపెన్‌చేసి సైనప్‌పైన క్లిక్ చేయాలి. తర్వాత పేరు, ఆధార్, సెల్ నంబరు, ఎంటర్ చేయాలి. అనంతరం వెరిఫికేషన్ కోడ్‌తో ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేయడం ద్వారా మన రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. రిజిస్టర్ అయినప్పటి నుంచి మనం మన ధ్రువపత్రాలను స్కాన్‌చేసి అప్‌లోడ్ చేసుకోవచ్చు.

ఏటికి ఎదురీత



నూజండ్ల మండలం పాత త్రిపురాపురం ప్రజలు వినుకొండ చేరాలంటే నరకమే. వారు పొలం వెళ్లాలన్నా, పట్టణానికి చేరుకోవాలన్నా వీరికి వంతెన అందుబాటులో లేదు. పదుల కి.మీ.చుట్టూ తిరిగి రాలేక నడుంలోతు ఉన్న గుండ్లకమ్మ నది నీటిలో ప్రమాదకరంగా ఇలా పయనిస్తూ అవతల వైపు చేరుతున్నారు.

-న్యూస్‌టుడే, వినుకొండ

మంచు దుప్పట్లో..



వేకువ వేళలో పొగమంచు పరుచుకుంటుంది. ఆ సమయంలో వాహనదారులు లైట్లు వేసుకున్నా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి. ఈ క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితి ఉత్తర భారతంలో అనుకుంటే పొరపాటే. గుంటూరు జిల్లా నూజండ్లలో పొగమంచు ఇలా కమ్మేసింది.

– న్యూస్‌టుడే, నూజండ్ల



విద్యాబోధనలో ఏడుకొండలు

అంధత్వాన్ని ఓడించి..

ఆంగ్ల బోధనలో దిట్టగా నిలిచి

విద్యార్థులకు అక్షర కాంతులు పంచుతున్న ఉపాధ్యాయుడు

లూయిస్ బ్రెయిలీ జయంతి ప్రత్యేక కథనం

అంధత్వాన్ని అధిగమించారు. బ్రెయిలీ లిపితో ఉన్నత విద్య అభ్యసించారు. జీవితంలో ఉపాధ్యాయునిగా స్థిరపడి చిన్నారుల్లో అక్షరజ్ఞానాన్ని నింపుతున్నారు. వారి ఉన్నతికి బాటలు వేస్తూ ఇతర ఉపాధ్యాయులకు దీటుగా రాణిస్తున్నారు. తన విద్యా బోధన ద్వారా విద్యార్థుల అభిమానాన్ని చూరగొంటున్నారు.

– న్యూస్‌టుడే, నరసరావుపేట గ్రామీణ

రొంపిచర్లకు చెందిన ఏడుకొండలు మాస్టారుకు బాల్యంలోనే అంధత్వం ఉంది. దాన్ని ఎంతో కష్టపడి అధిగమించి గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డారు. శంకరభారతీపురం జడ్పీ పాఠశాలలో 12ఏళ్లు ఉపాధ్యాయునిగా పనిచేసిన ఆయన ఇటీవల ఇసప్పాలెం జడ్పీ పాఠశాలకు బదిలీపై వెళ్లారు.

విద్యాభ్యాసం సాగిందిలా..

నరసరావుపేటలోని అంధుల పాఠశాలలో 1972లో ఒకటో తరగతిలో చేరారు. పదో తరగతి వరకు అక్కడే చదువుకున్నారు. బ్రెయిలి లిపితో పుస్తకాలు చదవటం, రాయడం నేర్చుకున్నారు. తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివారు. బీమవరంలో బీఈడీ చేశారు. ఇందులో రాష్ట్ర స్థాయిలో 963 ర్యాంకు సాధించారు. డీఎస్సీలో ఓపెన్ మెరిట్ ద్వారా ఉద్యోగం పొందారు. 29ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఈయన వద్ద విద్య అభ్యసించిన అనేక మంది విద్యార్థులు ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారు. ఇంజినీర్లుగా, వైద్యులుగా, బ్యాంకర్లుగా ఉద్యోగాలు పొందారు. ఇటీవల పూర్వ విద్యార్థులతో సత్కారం అందుకున్నారు.

విజయాలు ఇలా..

☛ చదువుకునేటప్పుడు చదరంగం, షాట్‌పుట్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించారు. అవి ఉద్యోగ సాధనకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.
☛ పురస్కారాలు అందుకోవటం అంటే ఈయనకు ఇష్టం ఉండదు. అయినప్పటికీ రెండేళ్ల క్రితం డీవైఈవో ఒత్తిడి మేరకు డివిజన్ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుని పురస్కారం అందుకున్నారు.
☛ స్వచ్ఛంద సంస్థల వారు విద్యా కృషీవలుడు అనే బిరుదు ఇచ్చారు.
☛ 16 సంవత్సరాల నుంచి పదో తరగతికి ఆంగ్లం బోధిస్తున్నారు. ఈయన బోధించే ఆంగ్లం సబ్జెక్టులో పదో తరగతి విద్యార్థులు అనేక సార్లు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. 10జీపీఏకి పది తెచ్చుకున్న వారు ఉన్నారు.
☛ కుటుంబపరంగాను విజయాన్ని సాధించారు. ఒక్కగానొక్క కుమార్తెను అమెరికాలో ఎంటెక్ చదివించారు. అక్కడే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడేలా చేశారు.

ఆంగ్ల బోధనలో దిట్ట

ఈయన ఆంగ్ల బోధనలో దిట్ట. బ్రెయిలీ లిపితో కూడిన పాఠ్యపుస్తకాలను ఉపయోగిస్తూ పిల్లలకు విద్యా బోధన చేస్తుంటారు. విద్యార్థులు ఆయన పిరియడ్ కోసం ఎదురు చూస్తుంటారు. పాఠం చెప్పారంటే అది విద్యార్థుల మనస్సుల్లో నాటుకుపోతుంది. చిన్నారులకు వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ బోధన సాగించడం ఈయన ప్రత్యేకత. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. ఇందుకోసం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తారు.

సానుభూతికన్నా.. సమానత్వం ఇవ్వాలి



విభిన్న ప్రతిభావంతులకు సానుభూతికన్నా.. సమానత్వం ఇవ్వాలి. బ్రెయిలీ లిపి ప్రెస్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు బ్రెయిలీ లిపితో కూడిన పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు. దీనివల్ల అనేక మంది చదువులో వెనకడుగు వేయాల్సి వస్తోంది. ప్రభుత్వం కూడా వికలాంగులకు వారు చేయగలిగిన పనులను అప్పగించాలి. ఇటీవల వచ్చిన టాక్ సాఫ్ట్‌వేర్ వల్ల మాలాంటి వారికి ఎంతో ఉపయోగపడుతుంది. దీంతో నెట్‌లో మనకు కావాల్సిన సమాచారం డౌన్‌లోడ్ చేసుకుని, చదువుకునేందుకు వీలు కలుగుతుంది. ఇందులో అక్షరాన్ని వేలితో తాకగానే దాని శబ్దం వెలువడుతుంది. దీనివల్ల అది ఏ అక్షరం, అంకె అనేది గుర్తుపట్టేందుకు వీలవుతుంది.

- సీహెచ్ ఏడుకొండలు, ఉపాధ్యాయుడు



ప్రపంచ వాణిజ్య సంస్థ అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించడానికి ఏర్పాటైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఆర్థిక సంస్థ. భాగస్వామ్య దేశాల మధ్య జరిగే వస్తువులు, సేవలు, మేధోసంపత్తి హక్కుల వాణిజ్యాన్ని నియంత్రించడం, వాణిజ్య సంబంధాలను సమర్థంగా నిర్వహించేందుకు అనువైన కార్యాచరణను రూపొందించడం, వివాదాలను పరిష్కరించడం దీని ప్రధాన బాధ్యతలు. తాజాగా జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) 11వ మంత్రుల స్థాయి సదస్సు ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఏ పరిష్కారం చూపకుండానే ముగిసింది.

ప్రతిభ

ఆహారానికి ఏదీ భద్రత...?

డబ్ల్యూటీవో మంత్రుల స్థాయి సదస్సు - 2017

ప్రపంచ వాణిజ్య సంస్థ 11 వ మంత్రులు స్థాయి సదస్సు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో డిసెంబరు 10 నుంచి 13 వరకు నాలుగురోజుల పాటు జరిగింది. ఈ సదస్సుల్లో 164 సభ్య దేశాలు పాల్గొన్నాయి. సేవా వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఈ-కామర్స్ సేవలు, మార్కెట్ సౌలభ్యం, దేశీయ నియంత్రణలు, ఆహారభద్రత, వాణిజ్యం - మహిళా సాధికారత తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో ఆహారధాన్యాల నిల్వ, రాయితీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినా ఎలాంటి పరిష్కారం చూపకుండానే చర్చలు ముగిశాయి. బహుళైచ్ఛిక వాణిజ్య విధానాల విషయంలోనూ ఎలాంటి పురోగతి లేదు. అయితే మత్స్య సంపదపై రాయితీల నిషేధం విషయంలో సభ్యదేశాలకు ఉన్న నిబద్ధతపై 2019 కల్లా పరిష్కారాన్ని చూపుతామనే భరోసా ఇచ్చేందుకు మంత్రుల స్థాయి సమావేశం ప్రయత్నించింది.

- భారత్, చైనా సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎలాంటి కఠినతర నిబంధనలు లేకుండా తమ తమ దేశాల్లో ఆహారభద్రతా కార్యక్రమాలను అమలు చేసేందుకు అమెరికా మోకాలడ్డింది. దీంతో చర్చలు విఫలమయ్యాయి. ప్రధాన విషయాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో ప్రపంచ వాణిజ్య సంస్థలోని భాగస్వామ్య దేశాలన్నీ మూకుమ్మడిగా ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంటుంది. కాబట్టి ఏ ఒక్క దేశమైనా కావాలనుకుంటే ప్రక్రియను ముందుకు సాగనీయకుండా చేయొచ్చు.
- 2001 లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో అపరిష్కృత సమస్యలకు పరిష్కారాలను ప్రతిపాదించకుండానే 'కొత్త అజెండా'ను తెరమీదకు తెచ్చేందుకు యూరోపియన్ సమాఖ్య (ఈయూ) దేశాలు పావులు కదుపుతున్నాయి. ఆహారభద్రత సాధనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులపై 2001 లో దోహాలో జరిగిన చర్చలు ఎటూ తేలకుండా ముగిశాయి. నాటి నుంచి నేటి వరకు ఆహారభద్రత హక్కుల విషయమై ఇతమిద్ధంగా తేలిందేమీ లేదు. సమావేశం అనంతరం వెలువరించాల్సిన మంత్రుల ప్రకటన కూడా రద్దయ్యింది. దీంతో భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి.
- సభ్య దేశాలు నిరాశకు గురవడం కొంత కటువైనదైనప్పటికీ అవి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ రాబెర్టో అజేవేడో వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సమావేశాలకు భారత్ తరఫున కేంద్రమంత్రి సురేశ్ ప్రభు హాజరయ్యారు. ఒక సభ్య దేశం వైఖరి కారణంగా ఎలాంటి నిర్ణయాలు లేకుండానే సమావేశాలు ముగిశాయని భారత్ ప్రకటించింది.

భద్రతలేని ఆహార హక్కు

ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రులు స్థాయి సమావేశంలో అమెరికా వ్యతిరేకత చూపినా భారత్ మాత్రం ఆహార భద్రత హక్కు విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల పక్షాన గట్టిగానే వాదించింది. గత దశాబ్ద కాలంగా తమ దేశాల్లోని వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలను చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు ఇదే విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మాత్రం మోకాలడ్డుతున్నాయి.

- సంపన్న దేశాలకు అనుకూలంగా రూపొందించుకున్న డబ్ల్యూటీఓ నిబంధనలను సవరించాలని భారత్, చైనా ప్రతిఘటించినా అడుగు ముందుకు పడలేదు. ఆది నుంచి భారత్ ఈ దిశగా పట్టిన పట్టు విడవకుండా కృషి చేస్తోంది. సన్న, చిన్నకారు, అల్పాదాయవర్గ రైతుల నుంచి సరైన మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరించి, తిరిగి దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే యంత్రాంగాన్ని మెరుగుపరిచి, పటిష్టవంతం చేసే దిశగా భారత్ సుదీర్ఘ కసరత్తు చేస్తోంది.
- డబ్ల్యూటీఓ నిబంధనల ప్రకారం రైతుల నుంచి సేకరించే వ్యవసాయ ఉత్పత్తులకు, ఆహార రాయితీల కింద ఇచ్చే మొత్తం సొమ్ము, ఆ దేశ మొత్తం ఆహార ఉత్పత్తుల విలువలో (1986-88 నాటి ధరల ప్రకారం) 10 శాతానికి మించకూడదు. ఒకవేళ అభివృద్ధి చెందుతున్న దేశాలు రైతులకు అంతకు మించి

జనరల్ స్టడీస్

చెల్లించినట్లయితే దాన్ని వాణిజ్య నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఇలాంటి పరిమితులు తాము అమలు చేస్తున్న 'ఆహారభద్రత' కార్యక్రమానికి విఘాతం కలిగిస్తాయంటూ భారత్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 2013 లో బాలిలో జరిగిన సమావేశంలో కూడా దీనిపై చర్చించారు. అప్పట్లో ఈ విషయమై ఒక అంగీకారానికి వచ్చి 'శాంతి నిబంధన' ప్రతిపాదించారు. ఇది ఒకరకంగా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు రక్షణ కవచం లాంటిది. దీని ప్రకారం ఏ దేశమైనా ఈ 10 శాతానికి మించి చెల్లించరాదనే నిబంధనను ఉల్లంఘిస్తే దాన్ని డబ్ల్యూటీఓలో సవాలు/ ఫిర్యాదు చేయకూడదనేది ప్రధాన సారాంశం. ఈ శాంతి నిబంధన ఉన్నా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల సార్వభౌమ హక్కులను కాలరాసి, రైతులకు ఆహార రాయితీలు ఇవ్వకుండా, కనీస మద్దతు ధర చెల్లించకుండా సంపన్న రాజ్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. కాబట్టి భారత్ ఈ బ్యూనస్ ఎయిర్స్ సమావేశంలో 'శాంతి నిబంధన' లోని అంశాలను మరింత మెరుగుపరచి, ఆహార భద్రత సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుక్కునేలా దీన్ని తీర్చిదిద్దాలని డిమాండ్ చేసింది. తృతీయ ప్రపంచ దేశాలు సైతం ఈ విషయంలో భారత్‌లో గొంతు కలిపాయి.

- నిజానికి అమెరికా, యూరోపియన్ దేశాలు ఉమ్మడిగా తమ రైతులకు ఏటా 16 వేల కోట్ల డాలర్లకు పైగా భారీ రాయితీలు ఇస్తున్నాయి. స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం నుంచి సమకూరుతున్న వాటాలో అమెరికా తిరిగి సగభాగాన్ని రైతుల సబ్సిడీల కోసమే కేటాయిస్తోంది. అమెరికాతో పోలిస్తే భారత్ రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తున్నది అత్తెసరు మాత్రమే.

అమెరికా సేంద్రియ సాగు, పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పుకుని వ్యవసాయ స్థూలదేశీయోత్పత్తి వాటాలో 40 శాతం నిధులను 'గ్రీన్ బాక్స్' పేరిట రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తోంది. అయినా ప్రపంచవాణిజ్య సంస్థ వీటిని మార్కెట్ విచ్ఛిన్నకర రాయితీలుగా పరిగణించకపోవడం దారుణం. అమెరికా లాంటి సంపన్న దేశాలు 'గ్రీన్ బాక్స్' పేరుతో డబ్ల్యూటీఓ నిబంధనలకు చిక్కకుండా తప్పించుకుంటున్నాయి.

- సగానికిపైగా జనాభాకు వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న, మూడోవంతు జనం ఆర్థాకలితో అలమటిస్తున్న భారత్ లాంటి దేశాలలోని పరిస్థితులు అమెరికాకు పూర్తి భిన్నం. రైతులకు మద్దతు ధరలు చెల్లించడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకాలపై రాయితీలు ఇవ్వక తప్పదు. ఈ తరహా చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశించిన 'మార్కెట్ విచ్ఛిన్నకర రాయితీల పరిధి' లోకి వస్తాయని ఐరోపా, అమెరికా దేశాలు గొంతు చించుకుంటున్నాయి. ఈ రకమైన సంపన్న దేశాల దాష్టీకాన్ని భారత్ మొదటి నుంచీ అనేక వేదికలపై ఎప్పటికప్పుడు ఎండగడుతూనే వస్తోంది.
- 2013 లో బాలిలో, 2015 లో నైరోబీ సదస్సుల్లో వర్ధమాన దేశాలను కూడగట్టుకుని, న్యాయమైన తమ హక్కులు, బడుగు బలహీన వర్గాల ఆహార భద్రత కోసం, రైతులను ఆదుకోవడానికి భారత్ తన వాదనను గట్టిగానే వినిపించింది. ఆహార భద్రత హక్కుల కోసం కృషి చేస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై 10 శాతం పరిమితి నిబంధనను ఎత్తేయాలని గతంలోనే 45 దేశాలను కూడగట్టుకుని డబ్ల్యూటీఓలో వాదించింది.

కానీ అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు భారత్ వాదనను తోసిపుచ్చాయి. ఈసారి మాత్రం వర్ధమాన దేశాల గళం మరింత పదునెక్కింది. చైనాతో సహా 100 కు పైగా దేశాలు మద్దతు ఇచ్చాయి. ఎలాంటి నిర్ణయం లేకుండా సమావేశాలు ముగిసినా అమెరికా తీరుపై ధిక్కార స్వరం మరింత పెరగడం ఆ దేశ వైఖరిలో మార్పు తెస్తుందేమో చూడాలి.

ప్రపంచ వాణిజ్యం - మహిళా సాధికారత

ఆహారభద్రత విషయంలో ఎటూ నిర్ణయం తీసుకోలేకపోయిన డబ్ల్యూటీఓ - 17 సమావేశం 'మహిళా సాధికారత' పట్ల మాత్రం చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రపంచంలో నాలుగింట మూడోవంతు దేశాలు సభ్యులుగా ఉన్న డబ్ల్యూటీఓ వర్తక, వాణిజ్యాల్లో మహిళల భాగస్వామ్యంపై ఎదురవుతున్న అవరోధాలను తొలగించడానికి సత్వర చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. లింగ సమానత, మహిళా సాధికారత కోసం విశేషంగా మద్దతు ఇస్తున్న భారత్ డబ్ల్యూటీఓలో మైనార్టీ వర్గంలో ఉన్నా, బాగా ప్రభావితం చేసేదిగా ఉండి కూడా ఈ విషయంపై సానుకూలంగా వ్యవహరించలేదు. లింగ భేదం వాణిజ్య సంబంధమైన విషయం కాదని, వాణిజ్య సంబంధిత అంశాలకు - మహిళా సాధికారకతకు లంకె పెట్టడం సమంజసం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

- అభివృద్ధి చెందిన దేశాలు అవలంబిస్తున్న లింగపరమైన విధానాల్లో ఉన్నత ప్రమాణాలుగా పేర్కొంటున్నవి అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు అడ్డుకట్ట వేయడమేకాక అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ మహిళలకు ప్రోత్సాహం కల్పించడాన్ని పరోక్షంగా నియంత్రిస్తున్నాయి. అలాగే లింగసంబంధమైన అంశాలపై చర్చలు చేపట్టడానికి డబ్ల్యూటీఓ వేదికగా, ఒక సరైన వేదిక అవసరమని భారత్ అభిప్రాయపడింది. ఎందుకంటే ప్రపంచ వాణిజ్య సంస్థ అనేది కేవలం వాణిజ్య సంబంధ సంస్థ. వాణిజ్యేతర అంశాలైన కార్మికులు, పర్యావరణం- ప్రమాణాలు మొదలైనవి చర్చించడానికి డబ్ల్యూటీఓలో మరొక విభాగాన్ని ఏర్పాటు చేయడం సమంజసమని భారత్ అభిప్రాయం.
- ప్రపంచ వాణిజ్య సంస్థ చరిత్రలోనే తొలిసారిగా 119 సభ్య దేశాలు 'మహిళలు - వాణిజ్యం' అనే బ్యూనస్ ఎయిర్స్ డిక్లరేషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అంగీకరించాయి. మహిళల వాణిజ్య భాగస్వామ్యంలోని ప్రతిబంధకాలను తొలగించేందుకు, ఆర్థిక - వాణిజ్య రంగంలో మహిళా సాధికారతను వేగవంతం చేసేందుకు ఇది దోహదం చేస్తుంది. డిక్లరేషన్‌లో పొందుపర్చిన కార్యాచరణ మహిళలకు మరిన్ని మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని డబ్ల్యూటీఓ పేర్కొంది. లింగ సమానత ద్వారా సాధికారత సాధ్యమవుతుందని, తద్వారా ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఇవి దోహదం చేస్తాయని పేర్కొంది.
- వాణిజ్యంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా మహిళలకు సమానావకాశాలను కల్పించడం సాధ్యమవుతుందని, తద్వారా ప్రపంచ స్థూల దేశీయోత్పత్తికి 2025 నాటికి 28 ట్రిలియన్ డాలర్లు జతకూడతాయని ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్నా గోంజాలెజ్ అభిప్రాయపడ్డారు.
- ఈ డిక్లరేషన్ మహిళల అభ్యున్నతికి ప్రతిబంధకంగా నిలుస్తున్న డబ్ల్యూటీఓ నిబంధనలను గురించి వెల్లడించడంలో విఫలమైందని, దీనికి బదులు అసమానతలు, అణిచివేతలకు దోహదం చేస్తున్న డబ్ల్యూటీఓ విధానాలకు ముసుగువేసి చూపించినట్లు ఉందని 160 దేశాలకు చెందిన మహిళా హక్కుల సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ప్రపంచంలోని అన్ని మహిళా హక్కుల సంఘాలు ఈ డిక్లరేషన్‌ను తిరస్కరించాయని, డబ్ల్యూటీఓ అనుసరిస్తున్న హానికరక విధానాల నుంచి దృష్టి మళ్లించడానికి చేపట్టిన వేసిన ఎరగా దీన్ని ప్రకటించారని మహిళల న్యాయం,

ప్రపంచ వ్యవసాయ వాణిజ్య నిబంధనలను ప్రజాస్వామికంగా సంస్కరించాలన్నదే భారత్ ప్రధాన ఆశయం. ఆకలి, దారిద్ర్యం నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించాలనేది ఐక్య రాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకమైంది. ఆహారభద్రత కల్పనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులను గౌరవించాల్సిన ఆవశ్యకత సుస్పష్టం.

సంక్షేమ విభాగం, ఆసియా ఎకనామిక్ ఫోరం, గ్లోబల్ కో-ఆర్డినేటర్ కేట్‌లాపిన్ అభిప్రాయపడ్డారు.

- డబ్ల్యూటీఓ సభ్య దేశాలు, మద్దతుదారులు మాత్రం వాణిజ్య, ఆర్థిక లావాదేవీల్లో మహిళల వెనుకబాటుతనాన్ని సరిదిద్ది, వారిని ప్రోత్సహించేదిగా ఉందని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది దోహదం చేస్తుందని చెబుతున్నాయి. లింగ సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్య దేశాలు విధానాలను రూపొందించి, మదింపు చేస్తాయని, దీని ప్రగతి నివేదిక 2019 లో విడుదల చేసే అవకాశం ఉందని ప్రపంచ వాణిజ్య సంస్థ పేర్కొనడం గమనార్హం. భారత్ మాత్రం ఈ చర్యను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది.

ఈ-కామర్స్

ఈ-కామర్స్ సేవలపై ప్రపంచవ్యాప్త నిబంధనలు ఉండకూడదని భారత్ వాదిస్తోంది. ఇలాంటి నిబంధనలకు తాము వ్యతిరేకం కాకపోయినా ఇవి తమకు ఇబ్బందికరంగా ఉంటాయని భారత్ అభిప్రాయం. ఈ-ట్రాన్స్‌మిషన్‌పై సభ్యదేశాలు కస్టమ్ డ్యూటీ విధించడాన్ని నిషేధించేందుకు ఉద్దేశించిన మారటోరియాన్ని విస్తరించడంపై అంగీకారం తెలిపేందుకు భారత్ ముందస్తు షరతులు విధించింది.

- 1998 లో జరిగిన రెండో మంత్రుల స్థాయి సమావేశంలో 'గ్లోబల్ ఈ-కామర్స్ డిక్లరేషన్'లో ఈ మారటోరియాన్ని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం సభ్య దేశాలు తమ ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించడాన్ని కొనసాగించవచ్చని నిర్ణయించారు. ఇది తాత్కాలికమే అయినా ప్రతి రెండేళ్లకోసారి జరిగే మంత్రుల స్థాయి సమావేశంలో దీన్ని పొడిగించుకుంటూ వస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించేందుకు 'శాశ్వత మారటోరియం' విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్య అభివృద్ధి చెందుతున్న దేశాలు చూపుతున్న చొరవను ప్రభావితం చేసేదిగా ఉందని భారత్ అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు భారత్ సహా పలు దేశాల్లోని దేశీయ ఔషధ తయారీ పారిశ్రామిక రంగానికి హాని కలిగించవచ్చనేది అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన. ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన విభాగాల్లో రూపొందించిన వర్క్ ప్రోగ్రామ్ మార్గదర్శకాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని అనుసరించి ఈ-కామర్స్‌పై చర్చలు కొనసాగించడానికి ఇతర సభ్యదేశాల అంగీకారాన్ని, మద్దతును బట్టి మారటోరియంపై భారత్ తన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని పేర్కొంది.
- మొత్తానికి ఈ-కామర్స్‌పై ప్రతిబంధకంగా పరిణమిస్తున్న నిబంధనలను ఎత్తివేయాలని భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే తమ దేశ సాఫ్ట్‌వేర్, అకౌంటింగ్ నిపుణులు, నర్సులకు ఇతర దేశాల్లో అవకాశాలు కల్పించాలని భారత్ కోరుతోంది.



రచయిత:
డాక్టర్ జి.వి.ఎల్. విజయ్‌కుమార్

ఏపీ టెట్

చరిత్ర

ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తి వరకు ఆదిమానవుడు

- భారతదేశంలో నివసించిన ఆదిమానవుడిని రామా పిథికస్ అంటారు.
- ఐరోపాలో నివసించిన ఆదిమానవుడిని నియాండెర్తల్ నరుడు అంటారు.
- మొదటి మేధావి మానవుడిగా హోమో ఎరక్టస్‌ను పేర్కొంటారు.
- ఆధునిక మానవుడి శాస్త్రీయ నామం హోమో సెపియన్
- మానవుడి అభివృద్ధి మొత్తం 5 దశల్లో జరిగింది.
- ఆదిమానవుడి కాలాన్ని మూడు యుగాలుగా విభజించారు. అవి: 1. ప్రాచీన శిలాయుగం, 2. మధ్య శిలాయుగం, 3. నవీన శిలాయుగం
- ప్రాచీన, మధ్య శిలాయుగాల్లో మానవుడు వేటను ప్రధాన వృత్తిగా చేసుకుని సంచార జీవితాన్ని గడిపేవాడు. ఈ యుగాల్లో మానవుడు ఆహార సేకరణ/ ఆహార అన్వేషణ దశలో ఉండేవాడు.
- ప్రాచీన శిలాయుగంలో మానవుడు పెద్ద పెద్ద బండరాళ్లను పెచ్చులుగా కొట్టి ఆయుధాలుగా ఉపయోగించేవాడు. వాటినే ఛేదకాలు, దరకాలు, చేతి గొడ్డళ్లు అనేవారు.
- మానవుడు చేతి గొడ్డలిని వాడిన కాలం ప్రాచీన శిలాయుగం.
- మధ్య శిలాయుగంలో అతిచిన్న రాళ్లను ఆయుధాలుగా ఉపయోగించాడు. కాబట్టి ఈ యుగాన్ని సూక్ష్మ శిలాయుగం అంటారు.
- సూక్ష్మ శిలాయుగంలో మానవుడు నిప్పును కనుక్కున్నాడు. జంతువులను మచ్చిక చేసుకున్నాడు.
- నవీన శిలాయుగంలో మానవుడు వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా మార్చుకుని, స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ యుగంలో రాతి గొడ్డలి, రాతి కొడవలి, రాతి పారలను ఆయుధాలుగా ఉపయోగించాడు.
- మధ్యప్రదేశ్‌లోని నంద్రా గ్రామంలో రాతి పనిముట్లు లభించాయి.
- జమ్మూ కశ్మీర్‌లో రాతితో చెక్కిన పరికరాలు లభించాయి.
- ఝార్ఖండ్‌లో పురాతన రాతి పనిముట్లు లభించాయి.
- తమిళనాడులోని గుడియం గుహల నుంచి సూక్ష్మరాతి పరికరాలను వెలికితీశారు.
- మహారాష్ట్రలోని నెవాస ప్రాంతంలో నవీన శిలాయుగపు పనిముట్లు లభించాయి.
- ఆదిమానవుడు ఉపయోగించిన రాతి గొడ్డలి ఆంధ్రప్రదేశ్‌లోని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కామకూర్‌లో లభించింది.
- కర్నూలు జిల్లాలోని బెలూమ్ గుహలు, బేతంచెర్ల, బనగానపల్లి ప్రాంతాల్లో ఆదిమానవుడి ఆనవాళ్లను కనుక్కున్నారు.
- ఎముకలతో చేసిన పనిముట్లు కర్నూలు జిల్లాలోని ముచ్చర్ల చింతమానులో లభించాయి (ఇవి భారత ఉపఖండంలో ఇంకెక్కడా దొరకలేదు).
- ఆదిమానవుడు గుహల్లో చిత్రాలను గీసేవాడు.
- వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ముద్దనూరు మండలంలోని చింతకుంట గ్రామంలో ఆదిమానవుడి పది రాతి చిత్రకళా స్థావరాలు లభించాయి.
- చింతకుంట రాతి చిత్రకళా స్థావరాల్లో మొత్తం 200 చిత్రాలున్నాయి. వీటిలో 10 తెలుపు రంగులో ఉండగా మిగిలినవి ఎరుపు రంగులో ఉన్నాయి.
- ఎరుపు రంగు చిత్రాల్లో ఒకే గుహలోని మూపురం ఉన్న ఎద్దు చిత్రం ప్రసిద్ధి చెందింది. ఈ గుహను స్థానికంగా ఎద్దుల, ఆవుల గుండు అని పిలుస్తారు.

ఆంధ్రదేశంలో ఉన్న ఇతర రాతి చిత్ర కళా స్థావరాలు

- బొల్లారం, కాలువబుగ్గ, కేతవరం, ఆధోని - కర్నూలు జిల్లా.
  - శ్రీకాళహస్తి, రేణిగుంట, వెంబ ఖండ్రిగ - చిత్తూరు
  - నాయుడుపల్లె, సింగరాయకొండ - ప్రకాశం
  - వేల్పుమడుగు, భోగదవి తెనగల్ - అనంతపురం
  - చింతకుంట, దాపల్లి - కడప
  - కావలి, నందిపాడు - నెల్లూరు
  - వినుకొండ - గుంటూరు
- 12000 సంవత్సరాల నుంచి మానవులు వ్యవసాయం చేసి, పంటలు పండించడం ద్వారా ఆహారాన్ని పొందుతున్నారు.

- సుమారు 100 కోట్ల సంవత్సరాల కిందట భూమి ఏర్పడింది.
- భూమిపై ఆవిర్భవించిన తొలి జీవ పదార్థం లార్వా.
- ప్లాజిల్లేటాను ప్రాథమిక జీవరాశిగా పేర్కొంటారు.
- ఏప్స్ అనే తోకలేని కోతి నుంచి మానవుడు ఆవిర్భవించాడు.
- మానవుడు నివసించిన తొలి ఖండం ఆఫ్రికా. ఆఫ్రికాలోని ఆదిమానవుడిని ఆస్ట్రలో పిథికస్ అంటారు.

ప్రతిభ

భారత్‌లో ఆవిర్భవించిన తొలి సామ్రాజ్యం..?



రచయిత
బొత్స నాగరాజు
విషయ నిపుణులు

- **భారతదేశంలో ఆదిమానవుల ప్రారంభ వ్యవసాయ ఆనవాళ్లు లభించిన ప్రాంతాలు**
  బెలూచిస్థాన్ - 9000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
  కశ్మీర్ - 5000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
  బిహార్ - 4000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
- ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో 5000 సంవత్సరాల కిందటి బూడిద దిబ్బలు బయటపడ్డాయి.
- అనంతపురం జిల్లాలోని పాళ్వాయిలో బూడిద దిబ్బలు/ మసి దిబ్బలు వెలుగు చూశాయి.
- ఆదిమానవులు అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసేవారు.
- మన రాష్ట్రంలో నేటికీ యానాదులు, చెంచులు సంచార జీవితాన్ని గడుపుతున్నారు.
- ఆదిమానవులు పురుషులు, స్త్రీలు, పిల్లలు అంతా కలిసి గుంపులు, గుంపులుగా వేటకు వెళ్లేవారు.
- వేట బాగా జరగాలని జంతువులు, వృక్షాలు, నదులు, పర్వతాలను పూజించేవారు.
- ఆదిమానవుడు తన ఆహార పదార్థాలను మట్టి పాత్రలు/ కుండల్లో దాచుకునేవాడు.
- చనిపోయిన వారికి రాక్షసగుళ్ల పేరుతో సమాధులు నిర్మించేవారు.

సామ్రాజ్యాలు, గణతంత్రాల ఆవిర్భావం

- 2700 సంవత్సరాల కిందట ప్రజలు గంగా, యమునా పరీవాహక ప్రాంతాల్లో స్థిరపడ్డారు.
- సంస్కృత భాషలో జన అంటే తెగ, పదం అంటే స్థిర పడిన ప్రాంతం.
- మహా జనపదాల కాలంలో దిల్లీ, అత్రంజిఖేర, కౌశాంబి, పట్నా, అయోధ్య, రాజగర్ లాంటి నగరాలు అభివృద్ధి చెందాయి. (రెండో నగరీకరణ).
- గమనిక: సింధు నాగరికత కాలాన్ని తొలి నగరీకరణగా పేర్కొంటారు.
- 16 మహాజనపదాల్లో 14 జనపదాలు రాచరిక వ్యవస్థను, 2 జనపదాలు గణతంత్రాలను కలిగి ఉండేవి.
- వజ్జి, మల్ల నాటి రెండు గణతంత్రాలు.
- ఎన్నికైన రాజ్యాధినేత ఉన్న రాజ్యాలను గణతంత్రాలుగా పేర్కొంటారు.
- భారతదేశంలో ఆవిర్భవించిన తొలి సామ్రాజ్యం మగధ సామ్రాజ్యం.
- వజ్జి గణరాజ్యం మగధకు ఉత్తర దిక్కులో ఉండేది.
- మహిళలు, బానిసలు, సేవకులకు గణరాజ్య సభల్లో పాల్గొనే హక్కు లేదు.
- బుద్ధుడు, మహావీరుడు గణ రాజ్యాలకు చెందినవారే.
- **మగధ తొలి సామ్రాజ్యంగా ఆవిర్భవించడానికి దోహదపడిన అంశాలు:**
  - శక్తిమంతమైన రాజులు, వంశాల పాలన
  - ఇనుప గనులు విస్తారంగా ఉండటం
  - సారవంతమైన నదీ తీరప్రాంతాలు ఉండటం.
- మగధ రాజ్యం గంగానదికి రెండు వైపులా విస్తరించి ఉంది.
- మగధ దక్షిణ భాగంలో ఇనుప గనులు విస్తారంగా ఉన్నాయి.
- హర్యంక వంశానికి చెందిన బింబిసారుడు, అజాతశత్రువు మగధను బలమైన రాజ్యంగా తీర్చిదిద్దారు.
- మహాపద్మనందుడి కాలంలో మగధ వాయవ్యం నుంచి ఒడిశా వరకూ విస్తరించింది.
- మహాజనపదాల కాలంలో భూయజమానులను గృహపతి/ గాహపతి అనేవారు.
- వ్యవసాయ కూలీలను భర్తుకా అని, బానిసలను దాసులు అని పిలిచేవారు.
- యుద్ధంలో ఓడిపోయిన సైనికులను దాసులుగా మార్చేవారు.
- రాజులు సిరిసంపదలతో ఉండటానికి పన్నులు అధికంగా వసూలు చేయడంతోపాటు నిత్యం ఇతర రాజ్యాలపై దండయాత్రలు చేసేవారు.
- పట్టణాల్లో ఉండే వృత్తిపనివారు ఒకరోజు రాజు పొలంలో ఉచితంగా పని చేయడం ద్వారా వృత్తి పన్ను చెల్లించేవారు.
- రైతులు రాజుకు చెల్లించే భూమి శిస్తును 'భాగ' అనేవారు. ఇది పంటలో 1/6 వంతు.
- గోండుల గ్రామపెద్ద పట్లాను పోలి ఉండేవాడు.
- గ్రామంలో అధిక ధనవంతుడైన వ్యక్తిని గ్రామపెద్దగా నియమించేవారు.
- గ్రామపెద్ద పాలనా, న్యాయ, పోలీస్ విధులు నిర్వహించేవాడు.
- నాణేల ముద్రణ, ఉపయోగం మహాజనపదాల కాలంలోనే ప్రారంభమైంది.

మొదటి సామ్రాజ్యాలు

- మౌర్య వంశ, మౌర్య రాజ్య స్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు. గొప్పవాడు అశోకుడు.
- మౌర్యుల పాలనకు ఆధారాలు: అశోకుడి శాసనాలు, అర్థశాస్త్రం, ఇండికా.
- కౌటిల్యుడు సంస్కృత భాషలో రచించిన అర్థశాస్త్రం ఒక పాలనాశాస్త్రం.
- గ్రీకు రాయబారి మెగస్తనీస్ చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానంలో ఇండికా గ్రంథాన్ని గ్రీకుభాషలో రాశాడు.
- మౌర్యుల కాలంలో రాజ్యం నేటి అఫ్గనిస్థాన్ నుంచి దక్షిణాన కర్ణాటక వరకు, తూర్పున బెంగాల్ వరకు విస్తరించింది.
- మౌర్యుల రాజధాని పాటలీపుత్రం.
- పాటలీపుత్రం, దాని చుట్టూ ఉన్న ప్రాంతం చక్రవర్తి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉండేది.
- అధికారుల పనితీరును వేగుల ద్వారా రాజులు తెలుసుకునేవారు. దూతల ద్వారా రాజు తన సందేశాలను అధికారులకు పంపేవాడు.
- తక్షశిల, ఉజ్జయిని, సువర్ణగిరి, తోశాలి లాంటి ప్రాదేశిక రాజధానులను రాజకుమారులు పరిపాలించేవారు. వారిని గవర్నర్లు/ కుమారామాత్యులుగా పిలిచేవారు.
- మౌర్యుల కాలంలో సువర్ణగిరి బంగారు గనులకు ఎంతో ప్రసిద్ధి చెందింది.
- తక్షశిలలో విదేశీ వస్తువులు విరివిగా దొరికేవి.
- భారతదేశంలో తొలి శాసనాలు వేయించింది అశోకుడు. అతడి శాసనాలు ఎక్కువగా ప్రాకృత భాషలో, బ్రాహ్మీలిపిలో ఉన్నాయి.
- 'నేను చక్రవర్తి అయిన 8 సంవత్సరాలకు కళింగయుద్ధం (క్రీ.పూ. 261) చేశాను' అని అశోకుడు తన 13 వ శిలాశాసనంలో (దౌళి/ జౌగాడ శాసనం) పేర్కొన్నాడు.
- కళింగ యుద్ధంలో లక్షమందికి పైగా మరణించడంతో అశోకుడు హృదయ పరివర్తన చెంది, యుద్ధాన్ని త్యజించాడు.
- ఉపగుప్తుడి సలహాతో అశోకుడు బౌద్ధ మతాన్ని స్వీకరించాడు.
- ధమ్మ/ ధర్మ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికి ధర్మ మహామాత్రులు అనే ఉద్యోగులను నియమించాడు.
- ధమ్మ ప్రాకృత పదం కాగా ధర్మ అనేది సంస్కృత పదం.
- సిరియా, ఈజిప్ట్, గ్రీస్, శ్రీలంక దేశాల్లో ధర్మాన్ని ప్రచారం చేయడానికి రాయబారులను పంపాడు.
- మనుషులకే కాకుండా జంతువులకు కూడా వైద్య సదుపాయాలు కల్పించిన తొలి భారతీయ చక్రవర్తిగా అశోకుడు పేరొందాడు.
- మౌర్యులకు సామంతులుగా ఉన్న శాతవాహనులు దక్కన్‌లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు.
- శాతవాహనుల రాజధాని ధాన్యకటకం (అమరావతి).
- గౌతమీపుత్ర శాతకర్ణి, వాశిష్ఠీ పుత్ర పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి లాంటి రాజులు గొప్పవారు.
- అమరావతి, భట్టిప్రోలు, వడ్డమానుకొండ లాంటి ప్రాంతాల్లో బౌద్ధ ఆలయాలు, స్తూపాలను నిర్మించారు.
- రోమ్, బెంగాల్‌తో సముద్ర వ్యాపారం చేశారు.
- రోమన్ నాణేలు, రోమ్ శైలి కుండలు వీరి రాజ్య భాగాల్లో లభించాయి.
- పులోమావి పాలనాకాలం నాటి మ్యాకదోని శాసనం కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లాలో దొరికింది.
- పులోమావి 8 వ పాలనా సంవత్సరంలో మాక్యదోని శాసనం వేశారు.
- పులోమావి మహాసేనాపతి స్కందనాగుని శాతవాహన ఆహారంలో కుమారదత్త అధిపతిగా ఉన్న వేపుర గ్రామంలో కాంత తెగ నాయకుడు సమ్వ ఒక చెరువును తవ్వించినట్లు మాక్యదోని శాసనం పేర్కొంటోంది.
- వేపుర గ్రామాధిపతి - కుమారదత్త. కాంత తెగ నాయకుడు - సమ్వ
- శాతవాహనులను ఓడించి శ్రాంతమూలుడు ఇక్ష్వాక రాజ్యాన్ని స్థాపించాడు.
- ఇక్ష్వాకుల రాజధాని విజయపురి (కృష్ణానది తీరం, నాగార్జున కొండ ప్రాంతం)
- వీరు రాముడి వంశానికి చెందినవారుగా చెప్పుకున్నారు.
- శ్రాంతమూలుడు, వీరపురుషదత్తుడు లాంటి రాజులు అశ్వమేధ, రాజసూయ యాగాలు చేశారు.
- నాగార్జున కొండవద్ద అతిపెద్ద ఆరామం, స్తూపం నిర్మించారు. (స్తూపం, చైత్యం, విహారం ఈ మూడూ ఉన్న ప్రాంతాన్ని ఆరామం అంటారు.)

భారత ఉపఖండంలో కొన్ని ముఖ్యమైన సామ్రాజ్యాలు

కుషాణులు

- కుషాణులు రెండువేల సంవత్సరాలకు పూర్వమే చైనా ప్రాంతం నుంచి వలస వచ్చి అఫ్గనిస్థాన్ కేంద్రంగా తమ సామ్రాజ్యాన్ని స్థాపించారు.
- కుషాణుల్లో గొప్పవాడు కనిష్కుడు.
- కనిష్కుడు క్రీ.శ. 78 లో సింహాసనాన్ని అధిష్టించి, శక యుగాన్ని ప్రారంభించాడు.
- శక యుగాన్నే శాలివాహన శకం లేదా శతాబ్దంగా పేర్కొంటున్నారు.
- భారతదేశం శక క్యాలండర్‌ను అనుసరిస్తోంది. శక యుగం సాధారణ యుగానికి 78 సంవత్సరాల తర్వాత ఉంటుంది.
- భారత్‌లో కుషాణుల కాలంలో ఇరాన్, చైనా, రోమ్ దేశాలతో వ్యాపారం బాగా జరిగేది.

గుప్తులు

- గుప్తులు బిహార్‌లోని పాటలీపుత్రాన్ని రాజధానిగా చేసుకుని సామ్రాజ్యాన్ని స్థాపించారు.
- గుప్త వంశ మూలపురుషుడు శ్రీగుప్తుడు. (క్రీ.శ. 320 లో శ్రీగుప్తుడు గుప్త సామ్రాజ్యాన్ని స్థాపించినట్లు చెబుతారు)
- గుప్త రాజ్య స్థాపకుడు మొదటి చంద్రగుప్తుడు.
- గుప్త రాజుల్లో గొప్పవాడు రెండో చంద్రగుప్తుడు. ఇతడి బిరుదు విక్రమార్కుడు.
- రెండో చంద్రగుప్తుడి కాలాన్ని స్వర్ణయుగంగా పేర్కొంటారు.
- రెండో చంద్రగుప్తుడి ఆస్థానంలో నవరత్నాలు అనే కవులు ఉండేవారు. నవరత్నాల్లో కాళిదాసు గొప్పకవి.
- **ముఖ్యమైన గుప్తరాజులు:** మొదటి చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు, రెండో చంద్రగుప్తుడు, కుమారగుప్తుడు, స్కంధగుప్తుడు.

కారంపూడిలో గొలుసు దొంగలు

కారంపూడి, న్యూస్‌టుడే : మండల కేంద్రమైన కారంపూడిలో పోలీసుస్టేషన్‌కు అతి సమీపంలో, సెయింట్ జాన్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలకు ఎదురుగా ఓ మహిళ మెడలోని బంగారు గొలుసుకు ఒకరు లాక్కెళ్లారు. ఇక్కడ దేవరకొండ శంకరలింగం, భార్య అంకమ్మలు బడ్డీ కొట్టు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం కొట్టు ముందు చీపురుతో అంకమ్మ ఊడుస్తుండగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి సిగరెట్లు కావాలని చెప్పారు. దీంతో ఆమె కొట్టులోకి వెళ్లి వాటిని ఇస్తుండగా ఆమె మెడలోని 3 సవర్ల నాంతాడును లాగేసుకున్న యువకుడు పరుగున కొట్టు నుంచి బయటకు వచ్చి ద్విచక్ర వాహనం ఉన్న మరో వ్యక్తితో కలిసి ఉడాయించాడు. సాయంత్రం పోలీసులకు బాధితురాలు సమాచారం ఇవ్వగా పోలీసులు పాఠశాల ముందున్న సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించి చోరీ జరిగిందని నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై మురళి దర్యాప్తు జరుపుతున్నారు.



సీసీ కెమెరాలో నమోదైన చోరుల చిత్రాలు

వివాహితపై అత్యాచారయత్నం

రెంటచింతల, న్యూస్‌టుడే : రెంటచింతలకు చెందిన మాజీ హోంగార్డు ఓ వివాహిత పట్ల మంగళవారం అసభ్యంగా ప్రవర్తించాడు. అత్యాచారం చేసేందుకు యత్నించినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పి.వెంకట కోటయ్య గతంలో హోంగార్డుగా విధులు నిర్వహించాడు. మంగళవారం రెంటచింతలలోని అంకమ్మ నగర్‌లో నివసిస్తున్న ఓ వివాహితపై అఘాయిత్యానికి ప్రయత్నించాడు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో వెళ్లి పోలీసులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: సొంతింటి కల నెరవేరాలంటే చేయాల్సిన దానాలు?, వాస్తురీత్యా విద్యుత్ ఉపకరణాలు ఏ దిశలో ఉండాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆడదే ఆధారం (సీత, విసు).

మధ్యాహ్నం

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'వంకాయ ఉలవకారం', మీ చేతివంట 'పన్నీర్ చెనా కర్రీ', 'ఆలూ పాలక్‌రైస్', జస్ట్ ఎ మినిట్ 'కాజూ గోబీపకోడి' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జీన్స్–2 (రిపీట్), 06-00: ఒకరి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ – సూపర్‌హిట్ కామెడీ షో, 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం

11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 డీజే రిపీట్
01:15 స్టే.. ఫూలిష్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 నా షో నా ఇష్టం రిపీట్

సాయంత్రం

04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే.. పోరా
09:00 పటాస్
09:30 టాప్స్
10:00 క్రిరాక్ కిడ్స్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస - బ్రహ్మకుమారి (ఉ.6:00, రా.11:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా.10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.6:30, రా.10:00)
- ★ అమృతం: డైరీ డిలైట్స్ (ఉ.8:00, మ.12:30, రా.8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.1:00, రా.8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ.1:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు ఆడుకునే బొమ్మలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు (ఉ.9:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా? (మ.2:00, రా.7:00)
- ★ సుఖజీవనం (ఉ.10:00, మ.2:30, రా.9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. చెడు అలవాట్లు - కీళ్ల నొప్పులు, 2. నొప్పి నివారణ మాత్రలు - వాస్తవాలు, 3. చెవిలో శబ్దాలు (ఉ.10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (మ.3:00, రా.9:00)
- ★ డా. ఈటీవీ: క్యాన్సర్ కేర్ (ఉ.11:00)
- ★ డా. ఈటీవీ: దంత సంరక్షణ (ఉ.11:15)
- ★ డా. ఈటీవీ: అజీర్తి సమస్యలు (మ.3:30, రా.7:30)
- ★ డా. ఈటీవీ: జనరల్ హెల్త్ (మ.3:45, రా.7:45)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలిషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: ఇద్దరు కొడుకులు (శోభన్‌బాబు, రాధ) 10-00: మార్నింగ్ షో: నిత్యాకల్యాణం పచ్చతోరణం (చలం) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: దొంగమొగుడు (చిరంజీవి, రాధిక) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఒక సినిమాకథ (రాజేంద్రబాబు) రాత్రి: 7-00: ఫస్ట్ షో: వాడె వీడు (ఎన్టీఆర్, మంజుల) 10-00: ప్రముఖ దర్శకుడు పి.సి.రెడ్డితో గుర్తుకొస్తున్నాయి... (రెండవ భాగం).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కీన్వ కాబూలినా టిక్కీ & జుకిని మిల్లెట్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మసాలా ఎనగై, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - సగ్గుబియ్యం టిక్కీస్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - బ్రొకోలి సూప్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - జొన్న రొట్టె & పండుమిరపకాయ పచ్చడి, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్డ్ వెజ్ సాగూ, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చెనా ఘూర్ గరం, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ (మొగలై స్టైల్) - బెండకాయ మటన్ కర్రీ, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - మేతి బార్లీ సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ బిర్యానీ & పాలక్ ఈడ, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) వంకాయ బజ్జీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - మటన్ ఖీమ బఠానీ రైస్ & గోంగూర మటన్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - టమాటో అటుకులు, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - ఉసిరి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి - చికెన్ ఫ్రైడ్ రైస్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, అలంపురం, పశ్చిమ గోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, గంగారం, వికారాబాద్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 04-01-2018

SVBC — **ఉదయం:** 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడ సేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకువేళాయె - దత్తాత్రేయస్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, **సాయంత్రం:** 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు నేను.. నా.. స్వామి, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - రామేశ్వరలక్ష్మణేశ్వర దేవస్థానం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

భక్తి TV — **ఉదయం:** 6-00 శ్రీసాయి హారతి, 6-30 సద్గురుస్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 8-00 పుణ్యక్షేత్రం, 8-30 జ్యోతి స్వరూపా అయ్యప్ప, 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 4-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనకధారాస్తోత్రం, 5-30 సాయిగీతామృతం, 6-00 సద్గురుస్తోత్రం, 7-00 భక్తివిశేషాలు,7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగవద్గీత 9-00 దుర్గాసప్తశతి, 9-30 మహాభారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11-00 గోదామృతం.

ZEE తెలుగు — **ఉదయం:** 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్, 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: నాగవల్లి 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్ 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 కల్యాణ వైభోగం (రిపీట్), **సాయంత్రం:** 04-00 బిగ్ సెలబ్రిటీ చాలెంజ్ ఇంటర్‌నేషనల్, 05-00 జై కృష్ణ ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్),11-00 బిగ్ సెలబ్రిటీ చాలెంజ్ ఇంటర్‌నేషనల్ (రిపీట్).

maa — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: చంద్రలేఖ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: యమదొంగ, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్రబంధం, 10-00 నీలికలువలు, 10-30 దసరా వచ్చిందయ్య (రిపీట్).

GEMINI — **ఉదయం:** 06-00 టెలిషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: దేవుళ్లు, 11-30 నాగిని -2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: ఆ నలుగురు, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: ఆర్య.

HBO — ఉదయం: 06-00 స్టార్ ట్రెక్ 2: ది రాత్ ఆఫ్ ఖాన్, 07-56 ది కరాటే కిడ్ పార్ట్ 2, 09-59 బ్యాక్ టు ది ఫ్యూచర్ పార్ట్ 3, మధ్యాహ్నం:12-03 మ్యాన్ ఆఫ్ స్టీల్, 02-27 పుష్ ఇన్ బూట్స్, సాయంత్రం: 04-03 వే ఆఫ్ ది డ్రాగన్, 5-53 ది డిక్టేటర్ రాత్రి: 07-08 ది లాస్ట్ ఎయిర్‌బెండర్, 09-00 కుంగ్ ఫూ పాండా 2, 10-40 పాల్.

రైతేరాజు

మిరపలో తెగుళ్ల నివారణ

వాణిజ్య పంటలలో ప్రధానమైనది మిరప. ఈ పంటను ఎక్కువగా కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాలో పండిస్తారు. నష్టమైనా, లాభమైనా ఏటా ఎంతో కొంత విస్తీర్ణంలో సాగు చేస్తారు. అలాంటి మిరపకు కొన్నేళ్లుగా చీడపీడలు అధికమయ్యాయి. పెట్టుబడి ఎక్కువగా పెట్టే ఈ పంట సాగులో సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టాలు తప్పవు. ప్రస్తుతం మిరప పూత, పిందె, కాయ దశలో ఉంది. ఈ ఏడాది బొబ్బర తెగులు (వైరస్) సోకి చాలా మంది రైతులు నష్టపోయారు. మిరపలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను పిడుగురాళ్ల ఉద్యానశాఖ అధికారి మోహన్ వివరించారు.

పైముడత: తామర పురుగులు ఆకుల అడుగు భాగంలో చేరి రసం పీల్చడం వల్ల ఆకులు పైకి ముడుచుకొని ఉంటాయి. దీని నివారణకు లీటరు నీటికి ట్రైజోఫాస్ 1.25 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. వేపనూనె 5 మి.లీ. జిగురు 1.5 మి.లీ. (గమ్)తోకలిపి పిచికారి చేయాలి.

కింది ముడత: ఇది నల్లి వల్ల వస్తుంది. నల్లి ఆశించిన ఆకులు కిందికి ముడుచుకొని తిరగబడిన పడవ ఆకారంలో కనిపిస్తాయి. ఇంకా ముదిరితే ఆకు పసుపు రంగులోకి మారి పూత, పిందె రావటం తగ్గిపోయి, వచ్చినవి రాలిపోతాయి. దీని నివారణకు ఫాసలోన్ 3 మి.లీ. డైకోఫాల్ 5 మి.లీ. లీటరు నీటికి చొప్పున పిచికారి చేయాలి. దీనికి వేపనూనె, జిగురు కలపాలి. పైముడత, కింది ముడత రెండూ ఉన్నట్లయితే పెగాసిస్ లీటరు నీటికి 2 గ్రా. చొప్పున పైరుపై చల్లుకుని బొబ్బర తెగులు ఆశించకుండా చూసుకోవచ్చు.

పేనుబంక: చిన్న పురుగులు గుంపులు గుంపులుగా చేరి లేత కొమ్మలు, ఆకుల కాండంపై చేరి రసం పీల్చడం వల్ల నల్లగా మారి వైరస్‌ను వ్యాప్తి చెందిస్తాయి. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అంతేగాక పేనుబంక, తెల్లదోమను ముందుగానే గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టి, బొబ్బర తెగులు రాకుండా అరికట్టవచ్చు.



పైముడత తెగులు

ఆకుమచ్చ: సర్కోస్పోర తెగులు వల్ల ఆకులపై గోధుమరంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు బ్లైటాక్స్ 3 గ్రా. గానీ డైథేన్-ఎం-45 2.5 గ్రా./లీటరు నీటికి చొప్పున కలిపి, దానికి + స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రాము 10 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

బూడిద తెగులు: బూడిద తెగులు సోకిన ఆకులపై తెలుపురంగులో బూడిదలా కనిపించే మచ్చలు ఏర్పడతాయి. తెగులు మరింత ఉధృతమైనప్పుడు ఆకులు పుసుపు వర్ణంలోకి మారి రాలిపోతాయి. దీని వల్ల పూత, పిందె నిలబడకుండా రాలిపోతాయి. దీని నివారణకు కెరాథేన్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

ఎండు తెగులు: ఎండు తెగులు భూమిలోని శిలీంధ్రం వల్ల వస్తుంది. దీని వల్ల మొక్కలు గుంపులు గుంపులుగా ఎండిపోతాయి. దీని నివారణకు కిలో ట్రైకోడర్మావిరిడీ శిలీంధ్రాన్ని 100 కిలోల పశువుల ఎరువులో కలిపి పైరులో చల్లుకోవాలి. పంటకు నీటి తడులు అందించినప్పుడు ఈ శిలీంధ్రం వ్యాప్తి చెంది తెగులు పెరగకుండా ఆపుతుంది. అంతేగాక బైటాక్స్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలపై చల్లాలి.


పూత రావటానికి : పూత బాగా రావటానికి పొటాషియం నైట్రేట్ (13-0-45) 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అంతేగాక వచ్చిన పూత పిందెగా మారి రాలుతుంటే ప్లానోఫిక్స్ 4 మి.లీ., 5 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. సూక్ష్మపోషకాల లోపం తలెత్తినప్పుడు ఫార్మొలా-4, 5 గ్రా. + బోరాన్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, మాచవరం (గుంటూరు జిల్లా)

పాడి పరిశ్రమలో పాకల ప్రాధాన్యం

పాకలను ఒక వరుసలో కానీ, రెండు వరుసల్లో కానీ కట్టేసేలా నిర్మించుకోవచ్చు. ఈ పాకల నిర్మాణానికి ప్రభుత్వం- ఉపాధి హామి పథకం ద్వారా తోడ్పాటునిస్తోంది. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా పాకలను గడ్డితో గానీ, షెడ్ రేకులతో గానీ కప్పి, నిర్మించుకోవచ్చు. పాకల్లో దాణా, పశుగ్రాసం తినేందుకు 'మేంజర్' ఏర్పాటుచేయాలి. పాకల్లో నేల జరుడుగా కాక, కాస్త గరుకుగా ఉండాలి. పాడి పశువులు కూర్చున్నప్పుడు, శరీర బరువులో సగానికిపైగా వాటి మోకాళ్ళపై పడుతుంది కాబట్టి రబ్బర్‌మ్యాట్లను పరచాలి.. తక్కువ ధరలో పాకల నిర్మాణం చేపట్టాలి. పశువుల మల మూత్రాలు నీటితో జారిపోయేలా వాలు ఉండేలా పాకలు నిర్మించాలి. షెడ్‌కు దగ్గరలోనే నీటి సౌకర్యం ఉండాలి. షెడ్‌నుండి వచ్చే పశువుల మూత్రం, పేడ, దగ్గరలోని పశుగ్రాస క్షేత్రాలకు మళ్ళించాలి. పాకల వల్ల చలి, ఎండబారి నుండి పశువులకు రక్షణ లభిస్తుంది. పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉండి, పాల దిగుబడి పెరుగుతుంది.

పల్నాట.. పూర్ణమ్మలు



చిన్న వయసులోనే కుటుంబ బాధ్యతలు తలకెత్తుకొని చిన్నారి పూర్ణమ్మ పడిన అగచాట్లను పుత్తడిబొమ్మ పూర్ణమ్మలో గురజాడ నాడు కళ్లకు కట్టినట్లు చూపారు.. తరాలు మారినా.. నేడు పల్నాట బాలికలు పూర్ణమ్మ కష్టాలనే ఎదుర్కొంటున్నారు. లోకం పోకడ తెలియక ముందే.. . బాల్యంలోని మధురానుభూతులు పూర్తిగా ఆస్వాదించక ముందే వారిని వివాహ బంధంతో బందీలను చేస్తున్నారు. అభంశుభం తెలియని పసిమొగ్గలు కుటుంబ భారం మోస్తున్నారు. పేదరికం కారణంగా పల్నాడులో బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తాజా అధ్యయనంలో జిల్లాలో పల్నాడులో బ్యాల వివాహాల్లో అగ్రస్థానంలో ఉన్నాయని తేలింది. పాఠశాలల్లోనూ 9, 10వ తరగతిలో ఎక్కువగా బాలికల డ్రాపౌట్సు ఎక్కువగా ఉండటం దీనికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

బాల్య వివాహాల్లో దక్షిణ భారతదేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది.. రాష్ట్రంలో బాల్య వివాహాల నిరోధక చట్టం కింద 600 కేసులు నమోదు కాగా ఈసంఖ్య 894కు పెరిగిందని గతేడాది విజయవాడలో కలెక్టర్ల సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆ శాఖాధికారులు వివరించారు.

అధ్యయనంలో వెల్లడైన అంశాలు..

- చిన్న వయసులోనే బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని జిల్లా అధికారుల కమిటీ తన అధ్యయనంలో తేల్చిచెప్పింది.
- బాల్యవివాహాల వల్ల తల్లీబిడ్డలపై తీవ్ర ప్రభావం, అబార్షన్లు, తక్కువ బరువుతో శిశువులు జన్మిస్తున్నారని జిల్లా అధ్యయన కమిటీ సభ్యులైన ప్రభుత్వాసుపత్రిలోని గైనకాలజిస్టులు చెబుతున్నారు.
- చిన్న వయసులో వివాహాలు జరిగిపోతున్నందున వారికి పుట్టిన పిల్లల్లో 67.5 శాతం మంది తక్కువ బరువుతో పుడుతున్నారు.
- చిన్న వయసులో గర్భం దాల్చిన వారిలో హిమోగ్లోబిన్ 11 గ్రాముల కంటే తక్కువగా ఉంటున్నవారు 65 శాతం మంది, 24 శాతం మందికి రక్తపోటు సమస్య ఉంటోంది.
- పుట్టబోయే బిడ్డ అంగవైకల్యం, రక్తహీనత, ఆరోగ్య సామాజికంగా నష్టం కలుగుతోంది.
- బాల్యాన్ని కోల్పోవడం, ఆడుతూ పాడుతూ గడపాల్సిన కాలాన్ని కష్టాలతో ఈదడం, ఇంట్లోని కుటుంబ సభ్యుల మధ్య ఏర్పడే చిన్నపాటి వివాదాలను సరిదిద్దుకోలేక కాపురాలు దెబ్బతింటున్నాయి.



పెరుగుతున్న బాల్య వివాహాలు
పేదరికమే బాలికలకు శాపం

పిడుగురాళ్ల గ్రామీణ, న్యూస్‌టుడే

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారు బాలికలే ఎక్కువగా ఉంటున్నారు. అబ్బాయిలను ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తుండగా, అమ్మాయిలను మాత్రం ప్రభుత్వ బడులకు పంపిస్తున్నారు. అదేవిధంగా కళాశాలలకు వెళ్లే వారిలో బాలురు అధికంగా ఉంటున్నారు. బాలికలు మాత్రం వంటింటికి లేదా.. చిన్న వయసులోనే పెళ్లి చేయడంతో సంసార బాధ్యతలు మోస్తున్నారు. పల్నాడులో అధిక శాతం మంది అమ్మాయిలను ఎప్పటికైనా పెళ్లి చేసి పంపించేయడమే కదా.. అన్న భావనతో గ్రామంలోనో, సమీపంలోనున్న ప్రభుత్వ బడుల్లో చేర్పించి పాఠశాల విద్యతో సరిపెడుతున్నారు. ఉన్నత చదువులకు ఇతర ప్రాంతాలకు పంపించాలంటే భయపడటమూ మరో కారణం కాగా ఉన్నత విద్య డబ్బులతో కూడుకున్నది కావడం ప్రధాన కారణం. పెళ్లి చేసి పంపించే అమ్మాయికి పెద్ద చదువులెందుకనే భావనలో చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేసేస్తున్నారు.

ఫిర్యాదులు వస్తే సరి.. లేకుంటే పెళ్లే..

మాచర్ల మండల పరిధిలోని కొప్పునూరులో ఓ గిరిజన బాలికకు బాల్య వివాహం చేస్తుండగా ఐసీడీఎస్ అధికారులు దాన్ని అడ్డుకున్నారు. అదే ప్రాంతంలోని కంభంపాడు గ్రామంలో 8వ తరగతి చదువుతున్న ఓ బాలికకు వివాహం చేయాలని ప్రయత్నిస్తుండగా అధికారులు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లి తంతును నిలిపివేశారు. పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామంలో గత నవంబరులో 13 ఏళ్ల బాలికను గ్రామానికి చెందిన ఓ యువకునితో వివాహం జరిపించేందుకు సిద్ధపడుతుండగా రెవెన్యూ సిబ్బంది వివాహాన్ని నిలిపివేశారు. బాల్య వివాహం జరిపిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చిన సందర్భంలో అధికారులు అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కొంతమంది ఇతర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా పెళ్లి తంతు జరిపిస్తున్నారు.

అవగాహన కల్పించినా.. మారని తీరు

ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయి సమావేశాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు, మండల మహిళా సమాఖ్య సమావేశాల్లో మహిళా సంఘ సభ్యులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్నారు. వీరు గ్రామాల్లో ప్రచారం చేపడుతున్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను గ్రామీణులకు వివరిస్తున్నారు. మగవారికి 21 ఏళ్లు, ఆడవారికి 18 ఏళ్లు నిండకుండా వివాహం జరిపించరాదని ప్రచారం చేస్తున్నారు. ఎక్కడైనా గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని సమాచారం అందితే అందరిని సమన్వయపరిచి గ్రామాలకు వెళ్లి ఇరువైపులా వారిని కలిసి కౌన్సిలింగ్ జరిపి బాల్యవివాహాలు జరగకుండా నివారించే ప్రయత్నం చేస్తున్నారు. ఐసీడీఎస్, సర్వశిక్ష అభియాన్, పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తూ బాల్యవివాహాల నిరోధానికి కృషి చేస్తున్నారు. అయినా బాగా వెనుకబడిన పల్నాడు ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయి.

భారంగా భావిస్తున్నారిలా..

- పాఠశాలలు, కళాశాలలకు పంపించడం ఖర్చుతో కూడుకున్నది కావడంతో పల్నాడులో బాలికలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు.
- ఆర్థిక ఇబ్బందులు, సకాలంలో పంటలు పండక, పెట్టుబడులు దక్కక, కరవు రక్కసి పీడిస్తుండటంతో బంధువుల్లో వరుసయ్యే వారుంటే బాలికకు చిన్న వయసులోనే పెళ్లి జరిపించేస్తున్నారు.
- పల్నాడులో ఎక్కువగా తండాలు ఉండటంతో పాటు వలసలు వెళ్లే కుటుంబాలు అధికంగా ఉండడం, ఆడపిల్లల్ని ఒంటరిగా ఇంటి వద్ద ఉంచలేక, వారిని కూలీ పనులకు పంపించలేక 18 ఏళ్లు నిండాకుండానే వివాహం జరిపిస్తున్నారు.



గుంటూరు సర్వజనాసుపత్రికి ప్రసవం కోసం వచ్చే వారిలో పల్నాడు నుంచి పేద కుటుంబాలకు చెందినవారే ఎక్కువగా ఉంటారు. కాన్పు కోసం వచ్చిన 150 మంది మహిళల్లో 20 శాతం మంది 18 సంవత్సరాలలోపు ఉన్న వారేనని ఓ అధ్యయనం ద్వారా గతంలో వెల్లడైంది.

మా వంతు ప్రయత్నం చేస్తున్నాం

అంగన్‌వాడీ కార్యకర్తలు ద్వారా ఎప్పటికప్పుడు గ్రామాల్లో బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్నాం.. ఇటీవల దాచేపల్లిలో 25 సంవత్సరాల యువకుడికి 17 ఏళ్ల బాలికను ఇచ్చి వివాహం చేసేందుకు ప్రయత్నిస్తుండగా వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలిపి వేశాం. గ్రామీణ ప్రాంతాల వారు కూడా బాల్యవివాహాలు జరుగుతుంటే వెంటనే 1098కి ఫోన్ చేస్తున్నారు. మాకు సమాచారం ఇచ్చినా, అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలిసినా వెంటనే తహశీల్దారుతో కలసి ఆయా గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా బల్యవివాహాలను జరిపించినా, ప్రోత్సహించినా అటువంటి వారిపై కేసులు కూడా నమోదు చేస్తాం.

- అనురాధ, సీడీపీఓ, పిడుగురాళ్ల

గుడ్డుకు.. పురస్కారం



మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ నుంచి అవార్డు అందుకుంటున్న విద్యార్థి మాబు సుభాని(పాతచిత్రం)

ప్రపంచంలో చాలా దేశాల్లో మంచి ఆలోచనలకు నగదు బహుమతులు అందజేస్తున్నాయి. కొన్ని సంస్థలు ఉద్యోగాలు ఇస్తున్నాయి. ఇందుకు భిన్నంగా ఓ సంస్థ జాతీయ స్థాయిలో పురస్కారాన్ని ప్రకటించింది. అది చూసిన ఓ ఇంటర్ విద్యార్థి తన ఆలోచనను పంచుకుని ఆ అవార్డు పొందాడు. ఆ విశేషాలు ఆ విద్యార్థి మాటల్లో విందాం.

నా పేరు మాబూ సుభాని. మాది గుంటూరు జిల్లా లాం గ్రామం. నేను 10వ తరగతిలో ఉన్నప్పుడు గుంటూరు రైల్వేస్టేషన్‌కు సైన్స్ ఎక్స్‌ప్రెస్ వచ్చింది. దానిలో ప్రదర్శనలు చూస్తున్న సమయంలో ఓ వ్యక్తి వచ్చి కరపత్రం ఇచ్చాడు. దానిలో "నేషనల్ ఇన్నోవేటివ్ ఫౌండేషన్-ఇండియా ఆధ్వర్యంలో సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు, ఆలోచనలకు ఏటా "ఏపీజే అబ్దుల్ కలాం ఇగ్నేటివ్ అవార్డులు ప్రదానం చేస్తారు" అని ఉంది. అప్పుడే ఏదో ఒక కొత్త ఆలోచన చేయాలని నిర్ణయించుకున్నా. 'ఎక్స్‌పైరీ డేట్ స్టాంపింగ్ ఆన్ ఎగ్స్' అనే ఆలోచన చేశా. అది సమాజానికి ఎలా ఉపయోగపడుతుందనే విషయాన్ని ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి ఆ సంస్థకు పంపించా. వారు దానిని అవార్డుకు ఎంపిక చేసి 2017 డిసెంబరు 22వ తేదీన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నా.

నేను నా గుడ్డు: ఎక్కువ పోషకాలు అందుతాయి. ఇది పిల్లలకు తప్పనిసరని వైద్యులు చెబుతున్నారు. అయితే అది 21 రోజులు మాత్రమే చెడిపోకుండా ఉంటుంది. కోళ్లు పొదిగేందుకు కూడా 15 రోజులులోపే ఉంది.

సమస్య ఇక్కడే: మార్కెట్‌లో ఎవరు డజన్ గుడ్లు తెచ్చుకున్నా.. వాటిలో రెండూ, మూడు పనికి రాకుండా పోతున్నాయి. అది ఎన్ని రోజులదో గుర్తించే అవకాశం లేదు. బయటకు బాగా కనిపించినా లోపల పరిస్థితిని గుర్తించ లేము.

పరిష్కారం : ఉత్పత్తి అయిన రోజు, గడువు తేదీ రెండు వేయడం ద్వారా ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యకరమైన గుడ్డు అందుతుంది. మార్కెట్‌లో ధరలు పెరిగినప్పుడు వాటిని నిల్వచేసి అధిక ధరలు అమ్ముకునే విధానాన్ని అరికట్టవచ్చు. అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. నాలో స్ఫూర్తిని నింపింది.

– నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

నరసరావుపేటలీగల్,న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో నిందితునికి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెన్నెల బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నరసరావుపేటలోని నవోదయనగర్‌కు చెందిన ఆరాధ్యుల అరుణకుమారి బాలబాలాజీ డెయిరికి పాలు సరఫరా చేసింది. అందుకు గాను 6,79,454 రూపాయలు అరుణకుమారికి గుంటూరు జేకేసీ కళాశాల ఆంజనేయనగర్‌కు చెందిన డెయిరీ ప్రతినిధి వెంకటేశ్వరరెడ్డి 5,19,454 నగదు రూపంలో చెల్లించారు. మిగిలిన 1,40,000 రూపాయలకు గాను 26-11-2015న చెక్కు ఇచ్చాడు. అరుణకుమారి సదరు చెక్కును బ్యాంకులో వేయగా నగదు లేక అది చెల్లకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. వెంకటేశ్వరరెడ్డిపై నేరం రుజువు కావడంతో ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

మరో కేసులో ఆరు నెలల శిక్ష

పట్టణానికి చెందిన గాలి జీవరత్నం వద్ద ఒంగోలుకు చెందిన కె. ఇసాకు 19-8-2014న రూ.2,50,000 అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపులో భాగంగా 25-7-2015న చెక్కు ఇచ్చాడు. జీవరత్నం చెక్కును బ్యాంకులో వేయగా నగదు లేక చెక్కు చెల్లకపోవడంతో అతను కోర్టును ఆశ్రయించాడు. ఇసాకుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి వెన్నెల ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

భర్తను కొట్టిన కేసులో భార్య, ప్రియుడికి...

పెదకొండూరు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: భర్తను కొట్టిన కేసులో భార్య, ప్రియుడు ఇద్దరికీ ఆరు నెలల జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు. పెదకొండూరుకు చెందిన కొలకలూరి స్వర్ణకుమారి 2015, ఫిబ్రవరి 16న వేకువజామున బహిర్భూమికని వెళ్లి ఎంతకూ రాకపోవడంతో ఆమె భర్త రవిబాబుకు అనుమానం వచ్చింది. ఆయన వెళ్లి చూడగా అక్కడ మొక్కజొన్న చేలో స్వర్ణకుమారి, అదే గ్రామానికి చెందిన ప్రియుడు కొండూరు రవితో కలిసి ఉండటంతో ప్రశ్నించాడు. దీంతో ఇద్దరూ కలిసి రవిబాబును గాయపడేలా కొట్టారు. అతను ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతూ కేసు పెట్టారు. అప్పటి హెచ్‌సీ కరీముల్లా కేసు నమోదు చేశారు. ఏపీపీ ఆర్.శ్రీదేవి కేసు వాదించగా నిందితులిద్దరికీ జైలుశిక్ష విధించారు.

హాయ్! బుజ్జీ!!



రంగు రంగుల పేపర్ వెయిట్‌లు...
వాటి లోపల్లోపల చిత్రమైన ఆకారాలు...
మధ్య మధ్యలో గాలి బుడగలు...
అక్కడక్కడా అలంకారాలు...
అన్నీ కలిసి గుండ్రటి ఆ గాజులో...
ఎలా దూరాయి చెప్మా?

పేపర్ వెయిట్.. తయార్!

మనం స్కూళ్లలో, కార్యాలయాల్లో గాజు పేపర్ వెయిట్‌లను చూస్తూనే ఉంటాం కదూ. పరీక్షించి వాటిని ఎప్పుడైనా చూశారా? లోపల బోలెడు రంగులుంటాయ్. ఆకులు, పువ్వుల్లాంటి డిజైన్‌లుంటాయ్. మధ్య మధ్య నీటి బిందువుల్లా కనిపించే గాలి బుడగలుంటాయ్. అవన్నీ లోపలికి ఎలా వెళ్లి ఉంటాయ్? ఎప్పుడైనా ఆలోచించారా? లోపలికి వెళ్లినట్టు ఎక్కడా దారి కనిపించదు. ఎక్కడా అతికినట్టూ అనిపించదు. మరి అంత అందంగా, గుండ్రంగా అవి ఎలా తయారవుతాయబ్బా?

తయారీ ఎలా?



◆ గాజు పేపర్ వెయిట్‌లను తయారు చేయడానికి మూల పదార్థంగా కరిగి ఉన్న గాజు ద్రవాన్ని వాడతారు. గాజు ముక్కల్ని 2000డిగ్రీల ఫారన్‌హీట్ దగ్గర మండించి ద్రవరూపంలోకి మారుస్తారు. అది ఒక కొలిమి దగ్గర ద్రవరూపంలో పై నుంచి కారుతుంటుంది. అక్కడ దూరం నుంచి గాలి ఊదడానికి వీలుగా ఉండేలా స్ట్రాలాంటి ఇనుప గొట్టాన్ని వాడతారు. దాని చివరను గాజు ద్రవం పడే దగ్గర పెట్టి గుండ్రంగా తిప్పుతూ ఉష్ణోగ్రతని తగ్గిస్తారు.



◆ అది కొంచెం కొంచెం గట్టి బడే సమయంలో చమ్కీల్లాంటివాటిని, రంగుల్నీ అద్దుతారు. పొడవు గొట్టాన్ని అటూ ఇటూ తిప్పుతూ మెత్తగా ఉన్న గాజును మెలికలు తిప్పి రకరకాల ఆకారాలు సృష్టిస్తారు.



◆ లోపలి డిజైన్ పూర్తయిన తర్వాత పైన మరోసారి గాజు ద్రవం పోసి గొట్టాన్ని గుండ్రంగా తిప్పుతారు. దాన్ని ఓ గుంట గరిటలాంటి దాంట్లో పెట్టి గుండ్రంగా తిప్పుతూ బంతి ఆకారం తెస్తారు.



◆ గొట్టానికి చివరిగా ఉన్న గాజు బంతిని చాకుతో కత్తిరించి అడుగుభాగాన్ని చదును చేస్తారు. అంతే. వేడి పూర్తిగా చల్లారే వరకూ పక్కన పెట్టి తర్వాత దాన్ని ప్యాక్ చేసేస్తారు. వాటినే మనం బజార్‌లో కొనుక్కుంటాం.

◆ ఇది సాధారణంగా గాజు పేపర్ వెయిట్ తయారీలో పాటించే విధానం. ప్రాంతాల్ని బట్టి ఈ విధానంలో కొన్ని మార్పులు ఉంటుంటాయి. కొన్నింటిని ఒక్కొక్కటిగా మనుషులే తయారు చేస్తే మరి కొన్ని ఫ్యాక్టరీల్లో పెద్ద ఎత్తున తయారవుతున్నాయి. గాజు పేపర్ వెయిట్‌లతోపాటు ఇప్పుడు ప్లాస్టిక్, రెజీన్‌లతో చేసిన పేపర్ వెయిట్‌లనూ ఎక్కువగా వాడుతున్నారు.

పుట్టింది ఎప్పుడంట?


● 1845 నుంచి 1860ల మధ్యలో తొలిసారిగా యాంటిక్ పేపర్ వెయిట్‌లను తయారుచేశారు.
● జస్టిన్ స్కూబర్ట్ అనే ఆయన మొదటగా వీటిని తయారు చేశారని చెబుతారు. ఎక్కడంటే ఫ్రాన్స్‌లో.
● ఇప్పుడు మనం చూస్తున్న గాజు వెయిట్‌లు మాత్రం 1940ల తర్వాత పుట్టినవే.

లోపల పువ్వులెలా?

● ద్రవపు గాజు మెత్తబడే సమయంలో ప్రత్యేకమైన పరికరాల్ని ఉపయోగించి చిన్న పువ్వులు, ఆకుల్లాంటి డిజైన్‌లను ముందే చేసి పెట్టుకుంటారు. వాటిని వెయిట్ తయారు చేసేప్పుడు లోపలే ముందు అందంగా పేరుస్తారు. రంగులు అద్దడం అయినా అంతే. నీటి బిందువుల్లా కనిపించాలనుకున్న చోట స్ట్రాలాంటి గొట్టంలో నుంచి గాలిని ఊదుతారు. దీంతో లోపల సన్నని గాజు బుడగలొస్తాయి.



బింబా & బబ్లూ — అండమాన్‌లో సాహసాలు 1



ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?

స్కూల్ సవాల్

1. మన దేశంలో సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు జరిగింది?
2. వాస్కోడీగామా ఏ దేశస్థుడు?
3. ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?



- షణ్ముఖరావు, తొమ్మిదో తరగతి
బి. నేతాజీ, ఏడో తరగతి,
జడ్‌పీహెచ్ స్కూల్, చల్లవానిపేట, శ్రీకాకుళం జిల్లా

ఆణిముత్యం

మంచిపనిని మించిన పూజలేదు, మానవత్వాన్ని మించిన సంపద లేదు
- మదర్ థెరిసా


నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.


Thumb - థమ్
Subtle - సటల్

కవలలేవి?

ఒకేలా ఉన్న జతను పట్టుకోండి



దారి కనుక్కోండి!



సబ్జెక్ట్ ల్యాబ్ — సైన్స్

ఇక్కడున్న బొమ్మలు, వాక్యాల ఆధారంగా ఖాళీల్లో వచ్చే పదాలేంటో కనుక్కోగలరా?

1. We ______ with our (ముక్కు బొమ్మ)
2. We ______ with our (కళ్ల బొమ్మ)
3. We ______ with our (చెవి బొమ్మ)
4. We ______ with our (నాలుక బొమ్మ)
5. We ______ with our (చేతుల బొమ్మ)

జవాబులు: స్కూల్ సవాల్: 1. 1857 2. పోర్చుగీస్ 3. నయా రాయ్‌పూర్
కవలలు: 2,4 సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్: 1.Smell 2.See
3.Listen 4.Taste 5.Touch

వెలగని 'విద్యా జ్యోతి'

(మొదటి పేజీ తరువాయి)

ఉపకరించేలా వాటిని జిల్లా పరిషత్ నిధులతో అయిదారేళ్లుగా జిల్లాలో ముద్రించటం ఆనవాయితీగా వస్తుండగా 378 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే సుమారు 15 వేల మంది విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నారు. ఆయా సబ్జెక్టుల్లో అనుభవజ్ఞులైన 85 మంది బోధన నిపుణులు గౌరవ వేతనం కూడా ఆశించకుండా అభ్యసనావళి రూపకల్పనలో పాలు పంచుకోగా దానికి 'చంద్రన్న విద్యా జ్యోతి'గా నామకరణం చేసి జిల్లా కేంద్రం నుంచి ఆయా మండలాలు, డీవైఈవో కార్యాలయాలకు పంపారు.

ఆదేశాలు ఉన్నందునే.. : జన్మభూమి - మా ఊరు గ్రామ సభలు జనవరి రెండో తేదీ నుంచి జరుగనున్నందున జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో వాటిని అందజేయించాలనే ఆదేశాలు తమకు ఉన్నందున ముందుగా వచ్చినా పంపిణీ చేయలేదని ప్రధానోపాధ్యాయుడొకరు తెలిపారు. అయితే ఈ సభల నిర్వహణకు ముందుగానే జిల్లా పరిషత్ అధ్యక్షురాలు స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులతో పంపిణీ చేయించాలని సూచించినట్లు తెలిసింది. ఆ మేరకు అప్పట్లోనే చర్యలు తీసుకుంటే ఈపాటికే విద్యార్థులకు అవి చేరేవి. అయితే ఆ పని చేయలేదు. తెనాలి డివిజన్లో కొంత వరకు పంపిణీ చేసినట్లు తెలిసింది. దీనిపై జిల్లా విద్యా శాఖ అధికారిణి గంగాభవానీని వివరణ కోరగా జన్మభూమి గ్రామ సభలతో సంబంధం లేకుండానే వాటిని అందజేయాలని గతంలోనే అధికారులకు సూచించామన్నారు. ఇప్పటికే కొంత మేరకు ఈ ప్రక్రియ జరిగిందని, ఇంకా ఎక్కడైనా జరుగకుండా ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్యం సరఫరా నిలిపివేత

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకలకు వందల కోట్లలో మద్యం అమ్మకాలు చేశామనే సంతోషం ఆ వ్యాపారుల్లో ఒక్క రోజులోనే ఆవిరైపోయింది. బుధవారం జిల్లా వ్యాప్తంగా మద్యం సరఫరాను ఆశాఖ అధికారులు నిలిపివేయడం వ్యాపారులతోపాటు మద్యం ప్రియుల్లో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే..మద్యం అమ్మకాలపై ఆబ్కారీశాఖ గొలుసు దుకాణాలను అరికట్టాలని, లూజు విక్రయాలు జరగకూడదనే ఉద్దేశ్యంలో మద్యం సీసాలను స్కానింగ్ చేసి విక్రయించే విధానాన్ని తీసుకువచ్చింది. గత యేడాదిన్నర కాలంగా అందరికి స్కానింగ్ యంత్రాలు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేసింది. వాటిపై అవగాహన కల్పించింది. మద్యం వ్యాపారి తమ దుకాణం నుంచి విక్రయించే ప్రతి సీసాను కచ్చితంగా స్కానింగ్ చేసి అమ్మాలని ఆదేశించారు. తద్వారా గొలుసు దుకాణాల్లో మద్యం సీసాలు పట్టుబడితే ఆ సీసాపై ఉన్న బార్‌కోడ్ ఆధారంగా ఏ దుకాణదారుడు వాటిని సరఫరా చేశారనేది తెలిసిపోతుంది. దాని ఆధారంగా దుకాణదారుడిపై చర్యలు తీసుకోవడం, లైసెన్సు రద్దు చేయడం జరుగుతుంది. ఆ విధంగా గొలుసుదుకాణాలను కట్టడి చేయటానికి ప్రవేశపెట్టిన ఈ విధానాన్ని మద్యం దుకాణదారులు అమలు చేయడం లేదని అధికారులు గుర్తించారు. జిల్లాలో సుమారుగా 349 వైన్ షాపులు, 184 బార్లు ఉన్నాయి. అధికారులు తనిఖీల్లో 300 వైన్స్ దుకాణాల్లో స్కానింగ్ యంత్రాలను ఉపయోగించడం లేదని గుర్తించారు. ప్రభుత్వం మద్యం గొలుసు దుకాణాలపై కఠినంగా వ్యవహరిస్తున్న క్రమంలో మద్యం వ్యాపారులు స్కానింగ్ చేయకుండా పక్కదారిలో అమ్మకాలు చేయడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బార్లలో ఇప్పటి వరకు ఆ యంత్రాలను ఏర్పాటు చేయకుండా రూ.కోట్లలో వ్యాపారాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వ్యాపారులపై కఠినవైఖరి అవలంభిస్తే తప్ప గొలుసు దుకాణాలను పూర్తిగా నియంత్రించాలనే లక్ష్యం నెరవేరదని నిర్ణయించారు. బుధవారం నుంచి స్కానింగ్ చేయకుండా వ్యాపారాలు చేస్తున్న వారికి మద్యం సరఫరా పూర్తిగా నిలివేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

కట్టడి అయ్యేనా?

(మొదటి పేజీ తరువాయి)

పది నుంచి రాత్రి ఏడు గంటల వరకు వీటిని నిర్వహిస్తూ రోజుకు రూ.కోటి నుంచి కోటిన్నర వరకు పందేలు కడుతుండగా మూడ్రోజుల్లో రూ.5 కోట్ల వరకు చేతులు మారుతున్నాయి.

☛ రేపల్లె మండలం గుడ్డికాయలంక, బొబ్బర్లంకలో భారీస్థాయిలో బహిరంగంగా కోడి పందేలను గత రెండేళ్లు ప్రజాప్రతినిధులే స్వయంగా ప్రారంభించడం విశేషం. రూ.10, 25, 50 వేల బరులు, రూ.లక్ష బరిని వేర్వేరుగా ఏర్పాటు చేసి అతిథులకు పసందైన విందులు ఇచ్చారు. అప్పటి నుంచి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పందెంరాయుళ్లు వచ్చి కోళ్లు, డబ్బుల సంచులతో బరిలోకి దిగుతున్నారు. వీరిలో ఎక్కువగా వ్యాపారవేత్తలు, గుత్తేదారులు, పారిశ్రామికవేత్తలు, సినీ పరిశ్రమవర్గాలు, ద్వితీయ శ్రేణి నుంచి పెద్దస్థాయి నేతల వరకు ఉంటున్నారు. వీక్షించటానికి వచ్చిన సామాన్యులు సైతం రూ.వేలల్లో పందేలు కడుతున్నారు. ఇదే సమయంలో మూడు ముక్కలాట, జూదం పెద్దఎత్తున జరుగుతోంది. రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. అనధికారికకంగా దుకాణాలు ఏర్పాటు చేసి మద్యాన్ని సైతం అందుబాటులో ఉంచుతున్నారు. తాత్కాలికంగా రెస్టారెంట్లు ఏర్పాటు చేసి అన్ని రకాల ఆహారాన్ని విక్రయిస్తున్నారు. పందేలు జరిగే మూడ్రోజులు పోలీసు అధికారులు, సిబ్బంది ఆ చుట్టుపక్కలకు రావటం లేదు. నిర్వాహకులు, పందెంరాయుళ్ల నుంచి వారికి అమ్యామ్యాలు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఉండగా ఈసారి పండుగ ఈ నెల 14, 15, 16 తేదీల్లో జరుగనుండగా చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో కొందరు నేతల ఆధ్వర్యాన 30 ఎకరాల్లో పందేల నిర్వహణకు భూమిని చదును చేస్తున్నారు. దగ్గరుండి పర్యవేక్షిస్తూ అన్ని ఏర్పాట్లు చేయటానికి రంగం సిద్ధం చేశారు.

☛ గత సంకాంత్రి సమయంలో ఓ ప్రజాప్రతినిధి తన అనుచరులతో కలిసి కార్లలో పందెం కోళ్లతో బరి వద్దకు వెళ్తుండగా మార్గం మధ్యలో పోలీసులు ఆపారు. కోళ్లను స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నించారు. విషయం తెలిసి వారిపై సదరు ప్రజాప్రతినిధి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతో పందెం కోళ్లను వదిలేశారు. నేతల దయా దాక్షిణ్యాలపై తమ పోస్టింగ్‌లు ఆధారపడి ఉండడంతో పోలీసులు, ఇతర అధికారులు గట్టిగా వ్యవహరించలేకపోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పండుగ ముందు మూడ్రోజుల వరకు గట్టిగా వ్యవహరిస్తున్న అధికారులు ఆ తర్వాత చేతులెత్తేస్తున్నారు. చిన్న, చిన్నవారిపైనే తమ ప్రతాపం చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పండుగ సమయంలో బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లోను రహస్యంగా పందేలు వేస్తున్నారు. తహశీల్దారు, ఎస్సై, పశుసంవర్ధక అధికారితో కూడిన కమిటీ గ్రామాల్లో పర్యటించి పందెం కోళ్లను స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలున్నా పెద్దగా అమలు కావటం లేదు. అయితే ఈసారి పండుగకు పది రోజుల ముందుగానే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పందించింది. ఈ నేపథ్యంలో అధికారులు, పోలీసులు జిల్లాలో ఏ మేరకు పందేలు జరగకుండా నిలువరిస్తారో వేచి చూడాల్సిందే

పోషకాల సమతుల్యతకు అవశేషాలే ఆచ్ఛాదన

(మొదటి పేజీ తరువాయి)

సహజ చక్రాలు, ఆచ్ఛాదన' అనే అంశంపై అవగాహన కల్పించారు. సాధారణంగా రైతులందరూ పంటల అవశేషాలను తగులబెట్టడం లేదా కంపోస్టు, వర్మీ కంపోస్టు, నాడెప్ కంపోస్టు, తదితర ఎరువుల తయారీకి వినియోగించకూడదని సూచించారు. దేశంలో పంటల అవశేషాలను ఆంధ్రప్రదేశ్ మినహా దాదాపు అన్ని రాష్ట్రాలు తగులబెడుతున్నాయని తెలిపారు. అధిక దిగుబడిని సాధించాలన్నా, భూసారాన్ని సంరక్షించుకోవాలన్నా చెక్కనాగలితోనే దున్నాలని, ట్రాక్టర్‌తో లోతుగా దున్నకూడదని చెప్పారు. ప్రకృతిలో అనేక పోషకచక్రాలున్నాయని కానీ పాశ్చాత్య దేశాల జీవనవిధానాలను అవలంభించడం వల్ల వాటి సమతుల్యత దెబ్బతింటుందని, ఆ విధానాలను నిషేధించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనరు హరిజవహర్‌లాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని చేయడం వల్ల దాదాపు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల వాడకం తగ్గిందని తెలిపారు. శిక్షణా శిబిరంలో భారత్‌లో మారిషస్ హైకమిషనర్ జగదీశ్ గోవర్ధన్, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



తెరపై కన్పిస్తూ పాలేకర్ చేసే సూచనలు, సలహాలను నమోదు చేసుకుంటున్న రైతులు

ప్రకృతి సేద్యమైనా ఫలించేనా?

(మొదటి పేజీ తరువాయి)

సౌకర్యం కల్పిస్తే లాభదాయకంగా ఉంటుందని ఇంకొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా ప్రకృతి సేద్యం చేస్తున్న రైతుల అనుభవాలను 'ఈనాడు' తెలుసుకుంది. అవి వారి మాటల్లోనే...

తక్కువ పెట్టుబడితో లాభదాయకం



ఏడేళ్లుగా ప్రకృతి సేద్యం విధానంలో వరి సాగు చేస్తున్నా. దిగుబడులు కొంతమేర తగ్గుతున్నా పెట్టుబడి వ్యయం తక్కువగా ఉండటంతో అనుసరిస్తున్నా. దుక్కుల నుంచి కోత వరకు ఎకరాకు రూ.10 వేల వరకు ఖర్చులు అవుతున్నాయి. సాంబ మసూరి రకం ఎకరానికి 25, స్వర్ణ 30, 1001 రకం 30 బస్తాల వరకు దిగుబడి ఇస్తున్నాయి. బీజామృతం, ఘన బీజామృతం, పంచగవ్వ తదితరాలను తయారు చేసుకుని పంటలకు వేస్తున్నా. ఎకరానికి ఒక బస్తా డీఏపీ వాడుతున్నా. పశువుల పేడ ఎకరాకు రెండు ట్రాక్టర్లు వినియోగిస్తున్నా. పురుగుమందులు పిచికారీ చేయడం లేదు. ఈ విధానంలో ఇప్పటివరకు నష్టాలు వచ్చిన దాఖలాలు లేకపోవడంతో మా గ్రామం మొత్తం ఇదే విధానాన్ని అనుసరిస్తోంది. ప్రభుత్వం నుంచి పురస్కారం పొందింది. హైదరాబాద్ నుంచి శ్రేష్ఠ సంస్థ వచ్చి యంత్రంతో తేమ, రసాయనాల శాతం పరీక్షించి ధాన్యం కొనుగోలు చేస్తోంది. మార్కెట్లో మిగిలిన వారితో పోల్చితే అధిక ధర ఇస్తోంది. ఇది లాభదాయకంగా ఉండటంతో అందరం ప్రకృతి సేద్యం చేస్తున్నాం.

- జి.సుందరరావు, పూసర్లపాడు, గార మండలం, శ్రీకాకుళం జిల్లా

పొలం నుంచే అన్ని ఉత్పత్తులు



పదకొండేళ్లుగా 17 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నా. బోరు ఉన్న చోట వరి వేస్తున్నా. మెట్ట భూమిలో వేరుసెనగ, కంది తదితర పంటలు పండిస్తున్నా. ఎకరాలో బీపీటీ-5204 రకం వరి 39 బస్తాల దిగుబడి ఇచ్చింది. ఒక్కొక్క బస్తా 90 కిలోల బరువు తూగుతోంది. ఉల్లి 1.25 ఎకరాల్లో వేస్తే సాధారణం 150కన్నా తక్కువగా 120 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు అందరికీ వేరుసెనగ 8- 9 బస్తాలు దిగుబడి వస్తే మాకు మాత్రం 12 బస్తాల దిగుబడి రావడంతోపాటు ఒక్కోటీ 45 కిలోల బరువు వచ్చింది. ఇంటికి సంబంధించి అన్ని కూరగాయలు, ధాన్యం పొలంలోనే పండించుకుంటాం. రెండు ఆవులతోనే సాగు చేస్తున్నాం. బెల్లం, కాఫీ పొడి మాత్రమే బయట కొనుగోలు చేస్తాం. మేము పండించిన బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి వ్యాపారులు వచ్చి క్వింటా రూ.7 వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఇంటి వద్దే మొత్తం విక్రయిస్తున్నాం. మిగిలిన పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే గిట్టుబాటు అవుతాయి. 2010లో నంది అవార్డు ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సాహం అందించింది.

- పి.నంజుండప్ప, చింతర్లపల్లి, కల్యాణదుర్గం మండలం, అనంతపురం జిల్లా

ఒడుదొడుకులు ఎదురవుతున్నాయి



ప్రకృతి సేద్యంలో పెట్టుబడి తక్కువగానే ఉన్నా సాగులో ఒడుదొడుకులు ఎదురవుతున్నాయి. ఎకరాలో పందిళ్లు వేసి దొండ, కాకర సాగు చేశా. తొలుత కాపు బాగానే వచ్చింది. ఎండుకొమ్మ, పండు తెగుళ్లు, బిళ్ల పురుగు వస్తున్నాయి. వీటి నివారణ చర్యలు తెలుసుకుని సస్యరక్షణ చేపట్టే సరికి పంట దెబ్బతింటోంది. రూ.2 లక్షలు రావాల్సిన చోట రూ.50 వేలు మాత్రమే వచ్చాయి. ప్రకృతి సేద్యపు ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెట్ లేకపోవడంతో సాధారణంగా విక్రయిస్తుండగా పెద్దగా ధర రావడం లేదు. తెగుళ్లు వచ్చిన వెంటనే నివారణకు మార్గాలు తెలియజేస్తే ఉపయోగం ఉంటుంది. దీనికి పరిష్కారం లభిస్తుందనే ఉద్దేశంతో శిక్షణకు వచ్చాను. ఆ తర్వాత ఏం చేయాలనేది ఆలోచిస్తా.

- రామ్మోహన్‌రెడ్డి, జిల్లెళ్లపాడు, వెలిగండ్ల మండలం, ప్రకాశం జిల్లా

దిగుబడి తగ్గినా లాభదాయకమే



రెండేళ్లుగా ప్రకృతి సేద్యం విధానంలో పత్తి వేస్తున్నాను. ఈ ఏడాదీ రెండెకరాల్లో సాగు చేశాను. ఇప్పటివరకు ఏడు క్వింటాళ్ల పత్తి తీసి అమ్మాను. మరో రెండు క్వింటాళ్ల వరకు తీయాల్సివుంది. పక్క పొలాల రైతులు రసాయన విధానంలో సేద్యం చేసి ఎకరాకు 8-10 క్వింటాళ్లు పండించారు. వారితో పోల్చుకున్నప్పుడు పెట్టుబడి తక్కువ కావడంతో దిగుబడి తగ్గినా నష్టాలు రాలేదు. ఈసారి భారీవర్షాలకు నీరు పొలంలో నిలిచిపోవడంతో దిగుబడి తగ్గింది. కషాయాలు పిచికారీ చేస్తే పొలం పచ్చగా పెరుగుతోంది. గతంలో పురుగుమందులు వాడి తీవ్రంగా నష్టపోయాం. ప్రకృతి సేద్యంలో పెట్టుబడి తక్కువగా ఉండటంతో పొరుగు రైతులు కూడా ఆసక్తి చూపుతున్నారు. తొలుత దిగుబడులు తగ్గుతున్నా క్రమంగా పెరుగుతున్నాయి. ఈ విధానంలో మరిన్ని మెలకువలు నేర్చుకోవడానికి ఇక్కడికి వచ్చా. ఈ విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నా.

- పి.నాగరాజు, ఉయ్యాలవాడ, ఓర్వకల్లు మండలం, కర్నూలు జిల్లా

రోజూ 200 కి.మీ. ప్రయాణం

చెన్నైలో ఉంటున్నా. నెల్లూరు జిల్లా దగదర్తి మండలం ఐతంపాడులో 60 ఎకరాలు కొనుగోలు చేసి ప్రకృతి సేద్యం చేస్తున్నా. మూడేళ్లుగా రసాయనాలు వేయకుండా మామిడి, నేరేడు, జామ తోటలు పండిస్తున్నా. ఇప్పటివరకు వివిధ కారణాలవల్ల పెట్టుబడి పెడుతున్నా ఆశించిన లాభాలు రావడం లేదు. కూరగాయల పంటలు వేస్తున్నా. నిత్యం చెన్నై నుంచి 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించి పొలానికి వచ్చి తిరిగి సాయంత్రం వెళుతున్నా. ప్రకృతి సేద్యం ద్వారా పొలం ఉన్న గ్రామం నుంచి మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. ఇప్పుడిప్పుడే కొంత ఫలితాలు వస్తున్నాయి. పంట దిగుబడులు వస్తున్నా మార్కెటింగ్ సౌకర్యం లేక దళారులకు అడిగినంత ఇవ్వాల్సివస్తోంది. ఈ క్రమంలో చెన్నైలో ఆర్గానిక్ ఉత్పత్తులు విక్రయించే వారితో మాట్లాడి ఒప్పందం చేసుకుంటున్నా. ఎకరాలో పది రకాల కూరగాయలు వివిధ రోజుల్లో కోతకు వచ్చేలా సాగు చేయాలని సూచించారు. వారి సూచనల మేరకు పండిస్తే గిట్టుబాటు ధర లభించే అవకాశముంది. ఆ దిశగా ప్రణాళికను రూపొందించుకుంటున్నా. ప్రకృతి సేద్యంలో మరిన్ని మెలకువలు నేర్చుకోవడానికే శిక్షణకు హాజరవుతున్నా. మనం ఆరోగ్యంగా ఉండటమే కాదు.. సమాజం మొత్తం ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఈ విధానాన్ని అనుసరించి పలువురికి మార్గదర్శకంగా నిలవాలని ఉంది.

- అనుమోలు సుగుణ, చెన్నై, ప్రకృతి సేద్యం మహిళా రైతు



విటమిన్-ఎ అందనంటోంది!



వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్ఎం

మూడు నెలలుగా నిలిచిన ద్రావణం సరఫరా


ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నారులకు అందని వైనం

వినుకొండ పట్టణం, న్యూస్‌టుడే

చిన్నారుల్లో రేచీకటి, అంధత్వం రాకుండా పదో నెలలో ఇచ్చే విటమిన్ 'ఎ' ద్రావణం(సిరప్) సరఫరా ప్రభుత్వాసుపత్రుల్లో నిలిచిపోయింది. సుమారు మూడు నెలలుగా ద్రావణం సరఫరా లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్ని టీకాలు, చుక్కల మందులతో పాటు దీనిని ఇప్పించలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. బిడ్డ పుట్టిన అనంతరం పదో నెల నుంచి బిడ్డకు ఐదేళ్లు వచ్చే వరకు దీనిని మొత్తం తొమ్మిది డోసులుగా ఇవ్వాల్సి ఉంది. అయితే సరఫరా లేకపోవడంతో జిల్లాలోని చిన్నారులకు అందని పరిస్థితి.

టీకాలు, చుక్కల మందులు ఇచ్చే క్రమం ఇదీ..

బిడ్డ పుట్టిన 14 రోజులకు బీసీజీ టీకా, పోలియో చుక్కల మందు వేస్తారు. ఆరు వారాలకు పెంటావాలెంట్ సూది మందు, పోలియో చుక్కలు, రోటా వైరస్ చుక్కలు, ఐపీవీ సూది మందు ఒక డోసు వేస్తారు. పదో వారంలో ఓపీవీ, పెంటావలెంట్, రోటావైరస్ మందులు రెండో డోసు వేస్తారు.



14వ వారంలో పోలియో చుక్కలు, పెంటావలెంట్ సూది మందు, రోటా వైరస్ చుక్కలు, ఐపీవీ చుక్కలు వేయాలి. పదో నెలలో ఎంఆర్ వ్యాక్సిన్, విటమిన్ 'ఎ' సిరప్ వేయాలి. ఒకటిన్నర సంవత్సరాలకు వోపీవీ, డీపీటీ, ఎంఆర్, విటమిన్ 'ఎ' రెండో డోసు వేయాలి. ఐదో సంవత్సరంలో డీపీటీ వేస్తారు.

నాలుగు నెలలుగా అందడం లేదు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో విటమిన్ 'ఎ' ద్రావణం సరఫరా నిలిచింది. మిగిలిన అన్ని సూది మందులు, చుక్కల మందుల సరఫరా సక్రమంగానే కొనసాగుతుంది. పీపీ యూనిట్లకు జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయాల నుంచి వ్యాక్సిన్లను సరఫరా చేయాల్సి ఉంది. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు అన్ని వ్యాక్సిన్లతో పాటు పదో నెల నుంచి ఐదేళ్లు వచ్చే వరకు ఆరు నెలలకోసారి విటమిన్ 'ఎ' ద్రావణం ఇవ్వాల్సి ఉండగా గత మూడు, నాలుగు నెలలుగా డోసు వేయడం లేదు. చాలా మంది తల్లిదండ్రులకు దీని గురించి పూర్తిగా అవగాహన లేకపోవడంతో ఆసుపత్రుల్లో ఏఎన్ఎంలు వేసిన టీకాలు, చుక్కల మందులు వేయించుకుని వెళ్లిపోతున్నారు. వినుకొండ ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని పీపీ యూనిట్‌లో ప్రతి బుధవారం చిన్నారులకు, గర్భిణులకు వ్యాక్సిన్లు వేస్తున్నారు. ప్రతి వారం సుమారు 80 మంది చిన్నారులను వ్యాక్సినేషన్ కోసం కేంద్రాలకు తీసుకువస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సరఫరా లేదు



విటమిన్ 'ఎ' ద్రావణం సరఫరా మన జిల్లాలోనే కాదు. రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేయలేదు. గతంలో సరఫరా చేసిన ద్రావణంలో లోపాలు కన్పించడంతో వాటిని వెనక్కు తీసుకున్నారు. అప్పటి నుంచి మళ్లీ సరఫరా చేయలేదు. ద్రావణం సరఫరా చేయగానే చిన్నారులందరికీ వేయిస్తాం. దీని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- డాక్టర్ యాస్మిన్, డీఎంహెచ్‌వో, గుంటూరు

అంధులైనా... ఆదర్శనీయులు

రక్తదానం చేసిన అంధ పాఠశాల విద్యార్థులు



రక్తదానం చేసిన విద్యార్థులతో రాజునాయుడు, వెంకటేశ్వరరావు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: వారంతా అంధులు. కనులు లేవని కలత చెందలేదు. నలుగురికి చేతనైన సాయం చేయాలన్న ఆలోచన వచ్చిందే తడవు రక్తదానానికి ముందుకొచ్చారు. శ్రీషిరిడీ సాయి అంధుల పాఠశాల తరఫున వచ్చిన ఇంటర్ విద్యార్థులు పలువురు బుధవారం గుంటూరు సర్వజనాసుపత్రి రక్తనిధి కేంద్రానికి స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రాజునాయుడు మాట్లాడుతూ ఒకరి దానం ముగ్గురికి ఊపిరినిస్తుందని, అంధులైనా రక్తదానానికి ముందుకొచ్చి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రసవం కోసం వచ్చిన వారికి, శస్త్రచికిత్స చేయించుకుంటున్నవారికి, ప్రమాదాల్లో గాయపడినవారి ప్రాణాలు కాపాడటానికి అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి వస్తుందన్నారు. అందుకే రక్తదానాన్ని మానవతకు ప్రతీకగా ప్రస్తుతిస్తారన్నారు. ఎక్కడా ఉత్పత్తి చేయలేని, ప్రత్యామ్నాయం అంటూ లేని రక్తాన్ని దానం చేసేందుకు ఆరోగ్యవంతులంతా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. 18 సంవత్సరాలు దాటిన ఆరోగ్యవంతులైన యువతీ యువకులు సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని, అంధ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా పాఠశాల నిర్వాహకులు పబ్బరాజు వెంకటేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు.

సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తెదేపా జిల్లా అధ్యక్షుడు జి.వి.ఆంజనేయులు

పట్టాభిపురం(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జిల్లా తెదేపా అధ్యక్షుడు జి.వి.ఆంజనేయులు సూచించారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జిల్లాకు చెందిన సోషల్ మీడియా విభాగం చెందిన వారికి బుధవారం కార్యశాల నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని తల్లీపిల్లా కాంగ్రెస్‌లు చేసిన దోపిడీని ప్రజలకు చేరువ చేయడంలో 2014 ఎన్నికల్లో సోషల్ మీడియా ద్వారా బ్రింగ్ బాబు బ్యాక్ టీమ్ కీలకపాత్ర వహించిందన్నారు. లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ మూడున్నర సంవత్సరాల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందన్నారు. చంద్రన్నబాట కింద గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, తక్కువ ధరకే ఇంటర్నెట్, టెలిఫోన్, కేబుల్ ప్రసారాలను ఫైబర్‌గ్రిడ్ ద్వారా అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా పింఛను అందజేయడం, రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆపదలో ఉన్న పేదలను అందుకుంటున్నామని వివరించారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియా ఎంతో శక్తివంతంగా మారిందని, ప్రజలకు సంక్షేమ పథకాల గురించి తెలియజేయడంలో మీరంతా శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు, మీడియా సమన్వయకర్త దారపనేని నరేంద్ర, సోషల్ మీడియా బృంద సభ్యులు వీర, మహేశ్, నారాయణ, అనిల్, సాంబిరెడ్డి, హుస్సేన్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.వి.ఆంజనేయులు

పెద గొట్టిపాడు ఘర్షణపై డీఎస్పీ స్థాయి అధికారితో విచారణ

గుంటూరు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మండలం పెద గొట్టిపాడు గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై నమోదైన కేసులను డీఎస్పీ స్థాయి అధికారితో విచారణ చేయిస్తున్నట్లు అర్బన్ ఎస్పీ విజయరావు అన్నారు. ఘర్షణలో గాయపడి గుంటూరు సర్వజనాసుపత్రి ఎముకల కీళ్ల చికిత్స విభాగంలో చికిత్స పొందుతున్న జె.ప్రకాష్‌ను బుధవారం ఆయన పరామర్శించారు. బాధితుని ఆరోగ్య పరిస్థితిని ఆ విభాగాధిపతి వరప్రసాద్, పర్యవేక్షకుడు రాజునాయుడు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. బాధితునితో ఎస్పీ మాట్లాడారు. ఆ రోజు వివాదం ఎలా జరిగింది..? ఘర్షణకు దారితీసిన కారణాలేంటి..? అనే విషయాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గొట్టిపాడు గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొందని, 144 సెక్షన్ కొనసాగుతుందని చెప్పారు. విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. చికిత్స పొందుతున్న ప్రకాష్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని ప్రాణాప్రాయంలేదని వైద్యులు చెప్పారని పేర్కొన్నారు. అదనపు ఎస్పీ వైటీ నాయుడు, డీఎస్పీ కండే శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ వంశీధర్, నర్సింగ్ పర్యవేక్షకురాలు పుష్ప, సివిల్‌సర్జన్ ఆర్ఎంవో ఆదినారాయణ పాల్గొన్నారు. గాయపడి చికిత్స పొందుతున్న జాన్‌ను డిశ్చార్జ్ చేశారని బాధితుని కుటుంబ సభ్యులు తెలిపారు.



బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అర్బన్ ఎస్పీకి వివరిస్తున్న ఆ విభాగాధిపతి వరప్రసాద్, పక్కన సూపరింటెండెంట్ రాజునాయుడు

నాణ్యమైన విద్యతోనే సమాజాభివృద్ధి

ఎస్వీఎన్ కాలనీ(గుంటూరు), న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించినపుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థి, విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య తెలిపారు. జేకేసీ కళాశాల స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని జేకేసీ కోసా(జేకేసీ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం) ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో స్వర్ణోత్సవ బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడు, కళాశాల పూర్వ విద్యార్థి వడ్లమూడి పూర్ణచంద్రరావు హాజరై మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానం సాధించడానికి కళాశాల చక్కని మార్గదర్శనం చేసిందన్నారు. తనకు జేకేసీ కళాశాల నాయకత్వ లక్షణాలతో పాటు అంకితభావం, క్రమశిక్షణ అలవర్చిందని పేర్కొన్నారు. జేకేసీ కోసా అధ్యక్షుడు కోటిరావు మాట్లాడుతూ 10 వేల మంది పూర్వ విద్యార్థులతో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, కార్యదర్శి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, జేకేసీ కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్, కోసా కార్యదర్శి చుక్కపల్లి రమేష్, ఉపాధ్యక్షుడు లావు పాపారావు, సంయుక్త కార్యదర్శులు జి.ఎల్.ఎన్.ప్రసాద్, కోయ సుబ్బారావు, జేకేసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్.ఆర్.కె.ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ పి.గోపీచంద్, పూర్వ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతులను అవిష్కరిస్తున్న అతిథులు

బాపట్ల

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కర్లపాలెం, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కర్లపాలెం పంచాయతీ కార్యదర్శి పులుగు రాంబాబు రెడ్డి అన్నారు. బుధవారం 216 జాతీయ రహదారికి రెండు వైపులా ఉన్న చెత్తను జేసీబీతో తొలగించి బ్లీచింగ్ చల్లించినట్లు ఆయన తెలిపారు. వ్యాపారస్తులకు, రొయ్యల షెడ్లు వారికి చెత్తను జాతీయ రహదారి ప్రక్కన వేయొద్దని ఆయన తెలిపారు.

జాతీయ ఒలింపియాడ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బాపట్ల, న్యూస్‌టుడే: జాతీయ ఒలంపియాడ్ ప్రతిభా పోటీల్లో బాపట్ల శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఏడుగురు ప్రతిభ చూపి అర్హత సాధించారని ప్రిన్సిపల్ రఘునాథగుప్తా అన్నారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించారు.

మొక్కజొన్న సాగుకే మొగ్గు

★ అపరాలకు ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగు

★ ఇదీ రబీ పంటల పరిస్థితి

రబీలో రైతులు మొక్కజొన్న సాగుకే మొగ్గుచూపుతున్నారు. ఈ సారి అపరాల విస్తీర్ణం తగ్గిపోయింది. రైతులు ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పచ్చిమిర్చి, వేరుశనగ, రాగులు సాగు చేస్తున్నారు. నీటి వసతి ఉన్నవారు దాళ్వా వరి నాట్లు వేశారు. అత్యధిక విస్తీర్ణంలో మాత్రం మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. అయితే మార్చి వరకు ఈ పంటకు నీటి తడులు ఇవ్వటం కష్టంగానే ఉన్నా దేవుడిపై భారం వేసి అన్నదాతలు ముందుకు సాగుతున్నారు.

బాపట్ల, న్యూస్‌టుడే

నియోజకవర్గంలో 68 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. పట్టిసీమ నుంచి వచ్చిన నీటితో సాగు విస్తీర్ణం 74 వేల ఎకరాలకు పెరిగింది. బాపట్ల మండలంలో ఏడు వేల హెక్టార్లలో మినహా పీవీపాలెం, కర్లపాలెంలో వరి కోతలు దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. గతేడాది రబీలో అత్యధిక విస్తీర్ణంలో అపరాలు సాగు చేసిన రైతులు, తలమాడు తెగులు కారణంగా తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఎకరాకు రూ.6 వేల పరిహారం మంజూరు చేసినా 15 శాతం మంది రైతులకు ఇంకా అందలేదు. పట్టిసీమ నీరు జులైలోనే రావటంతో ఈసారి ఖరీఫ్‌లో వరి నాట్లు 20 రోజులు ముందుగా పడ్డాయి.

కర్లపాలెం మండలంలో మాత్రం రబీ పంటగా ఎక్కువ మంది అపరాలు సాగు చేశారు. ఇప్పటికే తామర పురుగు ఉద్ధృతి ఎక్కువై అపరాల పైరు తలమాడు తెగులు బారినపడింది. అపరాల ధర మార్కెట్ తక్కువగా ఉండటం వల్ల ఈ పంటల సాగుకు దూరంగా ఉండటానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు.

★ సాగునీరు రాకపై స్పష్టత లేకున్నా, కాల్వల సమీపంలో భూముల రైతులు, బోర్లు ఉన్న వారు మొక్కజొన్న సాగు చేపట్టారు. తీర ప్రాంతంలో వేరుశనగతో పాటు మొక్కజొన్న పండిస్తున్నారు. తీర గ్రామాలతో పాటు పిన్నిబోయినవారిపాలెం, భర్తిపూడి, అప్పికట్ల రైతులు కొందరు బీర, వంగ, కాకర సాగు చేపట్టారు. పిట్టలవానిపాలెం మండలంలో పచ్చిమిర్చి పండిస్తున్నారు. అయితే పచ్చిమిర్చిలోను తెగుళ్ల సమస్య ఎక్కువగా ఉంది. మొక్కజొన్న సాగు చేసిన పొలాలకు కనీసం మూడు తడులు ఇవ్వాలి. ప్రస్తుతం తొలి తడి ఇస్తున్నారు. కాల్వలో అడుగున ప్రవహిస్తున్న నీటిని మోటార్లతో తోడుతున్నారు. మార్చి వరకు కాల్వల్లో నీటి ప్రవాహం ఉంటేనే కనీసం మోటార్లతోనైనా తడులు ఇవ్వగలుగుతారు. వ్యవసాయాధికారులు వద్దని వారిస్తున్నా.. గుడిపూడి రైతులు దాళ్వా సాగు చేపట్టారు. జమ్ములపాలెం, నరసాయపాలెం, కంకటపాలెం, మురుకుండపాడు, వెదుళ్లపల్లి, బేతపూడిలలో ఏడు వేల హెక్టార్లలో వరి కోతలను సోమవారం నుంచి ప్రారంభించారు. కొంత మంది దాళ్వా సాగు చేపట్టాలని ఆలోచిస్తుండగా, ఎక్కువ మంది పిల్లి పెసర, జనుము వేయాలని నిర్ణయించారు.



డీజిల్ ఇంజిన్ ద్వారా పంటకు నీరు పెడుతున్న దృశ్యం



భర్తిపూడిలో సాగు చేస్తున్న మొక్కజొన్న



గుడిపూడిలో సాగు చేస్తున్న దాళ్వా వరి

అపరాలు సాగు చేయవద్దని చెప్పాం: ఏవీఎస్ శాస్త్రి, ఏడీఏ

తలమాడు తెగులు కారణంతో, మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటం వల్ల రబీలో అపరాలు సాగు చేయవద్దని రైతులకు సూచించాం. ప్రత్యామ్నాయంగా రాగులు, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న సాగు చేయాలని చెప్పాం. కొందరు కూరగాయల సాగు వైపు వెళ్తున్నారు. ఇంకా వరి కోతలు కోయని రైతులను జనుము, ఆవాలు పండించాలని చెబుతున్నాం.

స్త్రీ విద్యాభివృద్ధికి సావిత్రిబాయి కృషి



పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సీఐ వినయ్‌కుమార్, ఉప్పాల మురళి

బాపట్ల, న్యూస్‌టుడే: స్త్రీ విద్యాభివృద్ధికి నాంది పలికి, తొలి మహిళా అధ్యాపకురాలిగా సావిత్రిబాయి పూలే చరిత్ర సృష్టించారని ఎంపీడీవో సుబ్బారావు, ఏపీఎం లక్ష్మీకుమారి అన్నారు. బీసీ, దళిత, ప్రజా సంఘాలు, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో వేర్వేరుగా సావిత్రిబాయి జయంతిని బుధవారం నిర్వహించారు. మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో ఆమె విగ్రహానికి ఎంపీడీవో, ఏపీఎం, పట్టణ సీఐ వినయ్‌కుమార్, బీసీ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పాల మురళి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. భాజపా మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు, స్వచ్ఛభారత్ ప్రముఖ్ సుమేరా యాస్మిన్ ఆధ్వర్యంలో సరస్వతి స్మారక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పూలేను స్ఫూర్తిగా తీసుకుని బాలికలు ఉన్నత చదువులు చదవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ డివిజన్ అధ్యక్షురాలు కల్పన, పల్లవి పాల్గొన్నారు

పౌష్టికాహారంతో ఆరోగ్యం

బాపట్ల, న్యూస్‌టుడే: మహిళలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని సరస్వతి స్మారక బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి.వేదవతి అన్నారు. కళాశాల విద్యార్థులు పట్టణంలో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన ఏడాది వరకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. గర్భిణులకు ఆసుపత్రిలో సురక్షిత ప్రసవం చేయించాలని సూచించారు.

నేడు రెండు గ్రామాల్లో 'జన్మభూమి'.

అలకాపురం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: మండలంలోని అలకాపురం, కొత్తపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గురువారం 5వ విడత 'జనభూమి-మా ఊరు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ సుజాత తెలిపారు. కార్యక్రమంలో గత జన్మభూమిలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు రేషన్‌కార్డు, పింఛన్ల మంజూరు పత్రాలు అందజేస్తామన్నారు. గ్రామస్థులకు ఏమైనా సమస్యలుంటే రాత పూర్వకంగా అందజేయాలని సూచించారు.

కర్లపాలెం: మండలంలోని రెండు గ్రామాల్లో నేడు జన్మభూమి జరుగుతుందని ఎంపీడీవో పులి శరత్‌బాబు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దుండివారిపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద, పెదగొల్లపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జన్మభూమి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

హైకోర్టు తీర్పు అధికారులకు గుణపాఠం



మాట్లాడుతున్న వైకాపా పట్టణాధ్యక్షుడు నరాలశెట్టి ప్రకాష్

బాపట్ల, న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్ సమీపంలో డొంక పోరంబోకు భూమిని ప్రైవేటు సంస్థలకు కేటాయిస్తూ పురపాలక సంఘ పాలకవర్గం చేసిన తీర్మానాన్ని హైకోర్టు సస్పెండ్ చేయటం హర్షనీయమని వైకాపా పట్టణాధ్యక్షుడు నరాలశెట్టి ప్రకాష్ అన్నారు. వైకాపా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు తీర్పు పురపాలక అధికారులకు మంచి గుణపాఠమన్నారు. రైల్వేస్టేషన్ సమీపంలోని భూమిని భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రహదారి విస్తరణకు వినియోగించాలని ఎమ్మెల్యే కోన రఘుపతి సూచిస్తే.. పాలకవర్గం, అధికారులు పట్టించుకోలేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రైవేటు సంస్థలకు భూములు కేటాయిస్తూ చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో ఎమ్మెల్యే పిల్ వేశారన్నారు. దీనిపై ఉన్నత న్యాయస్థానం స్పందిస్తూ తమకు చెందని భూమిని ప్రైవేటు సంస్థలకు ఎలా కేటాయిస్తారని, ప్రభుత్వ నిధులతో భవనాలు ఎలా నిర్మిస్తారని పురపాలక అధికారులకు అక్షింతలు వేసిందన్నారు. సమావేశంలో వైకాపా కర్లపాలెం మండలాధ్యక్షుడు దొంతిరెడ్డి సీతారామిరెడ్డి, పురపాలక ప్రతిపక్ష నేత షేక్ సయిద్‌పీర్, కౌన్సిలర్ పుష్పరాజ్యం, నాయకులు మారం రామకోటి, జోగి రాజాబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థిని కాపాడిన సహచరులు



ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న సహదేవుడు

బాపట్ల, న్యూస్‌టుడే: స్థానిక సూర్యలంక సముద్ర తీరంలో స్నానం చేస్తూ.. ప్రమాదవశాత్తూ విద్యార్థి నీటిలో మునిగిపోగా, సహచర విద్యార్థులు కాపాడిన ఘటన బుధవారం జరిగింది. తెలంగాణా రాష్ట్రం వనపర్తి జిల్లా పెబ్బేరుకు చెందిన నవభారతి టీటీసీ కళాశాల విద్యార్థులు 49 మంది, పిన్సిపల్, అధ్యాపకులు మరో 11 మంది కలిసి మొత్తం 60 మంది బాపట్ల మండలం సూర్యలంకకు విహారయాత్రకు వచ్చారు. స్థానిక బీచ్‌లో విద్యార్థులు స్నానం చేస్తుండగా.. పెబ్బేరు మండలం విప్పనగండ్లకు చెందిన సహదేవుడు అనే విద్యార్థి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయి లోపలికి కొట్టుకుపోతూ రక్షించమని కేకలు వేశాడు. సహచర విద్యార్థులు వెంటనే స్పందించి అతనిని రక్షించి చికిత్స నిమిత్తం బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థికి వైద్యులు చికిత్స చేసి ప్రాణాపాయం లేదని ప్రకటించారు. సమాచారం తెలిసి బాపట్ల గ్రామీణ సీఐ కోటేశ్వరరావు, ఎస్సై రవికృష్ణ ప్రాంతీయ ఆసుపత్రికి వచ్చి విద్యార్థి సహదేవుడిని పరామర్శించారు. ఘటన తాలూకూ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనాథ బాలల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న వేగేశన ఫౌండేషన్ అధ్యక్షుడు నరేంద్రవర్మ

బాపట్ల: అనాథల సంక్షేమానికి వేగేశన ఫౌండేషన్ తరపున చిత్తశుద్ధితో కృషి చేస్తామని సంస్థ అధ్యక్షుడు, తెదేపా నేత వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మండల పరిధిలో హనుమాన్‌నగర్‌లో ఎల్‌జీఎం అనాథ ఆశ్రమ 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును ఆయన కోశారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలో ప్యాడిసన్‌పేట తుపాను రక్షణ భవనంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

బాపట్ల

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి

బాపట్ల, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు పురపాలిక అధ్యక్షురాలు తోట మల్లీశ్వరి అన్నారు. పురపాలక సంఘంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం రాత్రి సమదుస్తులను ఉపాధ్యక్షుడు లేళ్ల రాంబాబుతో కలిసి ఆమె పంపిణీ చేశారు. కమిషనర్ తుమ్మల వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ కార్మికులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ సీతారామరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కరుణ, లక్ష్మీపతి పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు

ఊరూరా జన్మభూమి గ్రామసభలు



మహిళలకు రూ. 1.20 కోట్ల రుణాల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ సతీష్, ఎంపీపీ విజేత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శరత్‌బాబు

కంకటపాలెం, కొండుభొట్లపాలెం, గోపాపురం(బాపట్ల), న్యూస్‌టుడే: అర్హులందరికీ ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. మండలంలో కంకటపాలెం, కొండుభొట్లపాలెం, గోపాపురం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొత్తగా 51 మందికి పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంపీపీ మానం విజేత, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు రావిపూడి నాగమల్లేశ్వరరావు తదితరులు మాట్లాడారు. పొదుపు సంఘాల మహిళలకు రూ.1.20 కోట్ల బ్యాంకు రుణాల చెక్కును ఎంపీపీ విజేతతో కలిసి ఆయన పంపిణీ చేశారు. కేబీపాలెంలో ఎస్టీ కార్పొరేషన్ కింద మంజూరైన 35 రిక్షాలను లబ్ధిదారులకు సతీష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి, రైల్వే ఎస్పీ కేవీ మోహనరావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్.వెంకటసుబ్బయ్య, మండల ప్రత్యేకాధికారి ఇ. రత్నావతి, సర్పంచులు విజయలక్ష్మి, కామేశ్వరి, ఉప సర్పంచి సులోచన, తహశీల్దారు వల్లయ్య, ఎంపీడీవో సుబ్బారావు, జీడీసీసీబీ డైరెక్టర్ విజయ్, సహకార సొసైటీ అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్, సీడీపీవో గీతాంజలి, వైద్యాధికారి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల: ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్లను లబ్ధిదారులు తప్పని సరిగా నిర్మించుకోవాలని ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. పట్టణంలో 02, 12, 14, 24 వార్డుల్లో జన్మభూమి కార్యక్రమాన్ని బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24వ వార్డును ఆదర్శ వార్డుగా అభివృద్ధి చేస్తామని, ఇమ్మడిశెట్టిపాలెంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త భవనాలు నిర్మిస్తామని ప్రకటించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఎమ్మెల్సీ ప్రారంభించి ఆహార పదార్థాల రుచి చూశారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో పురపాలిక అధ్యక్షురాలు మల్లీశ్వరి, ఉపాధ్యక్షుడు రాంబాబు, కమిషనర్ వెంకటకృష్ణయ్య, తెదేపా జిల్లా కార్యదర్శి నారాయణ, పట్టణాధ్యక్షుడు దయాబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, నేతలు ఆంద్రేయ, నాగేశ్వరరావు, తాజుద్దీన్, డీఈ సీతారామారావు, టీపీవో రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



జి. ఎన్.పాలెంలో రేషన్‌కార్డు అందజేస్తున్న ఎంపీపీ వెంకట సులోచన

దమ్మన్నవారిపాలెం(కర్లపాలెం): ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికే జన్మభూమి సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పులి శరత్‌బాబు అన్నారు. దమ్మన్నవారిపాలెం సర్పంచి మాడసాని ముసలయ్య అధ్యక్షతన బుధవారం జన్మభూమి కార్యక్రమం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామన్నారు. గ్రామంలోని 31 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి 2.12లక్షలు వడ్డీలేని రుణం మంజూరైనట్లు వెలుగు ఏపీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. 48 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1200ల చొప్పున ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రన్న సంక్రాంతి కానుకలు, కొత్త రేషన్ కార్డులు అందజేశారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఏవీఎస్ శాస్త్రి, మార్కెట్ యార్డు అధ్యక్షుడు ఆంజనేయరాజు, జన్మభూమి కమిటీ సభ్యులు నక్కల వెంకటస్వామి పాల్గొన్నారు. పేరలిపాడులో జరిగిన జన్మభూమిలో తహశీల్దారు నూనె వెంకట ప్రసాదు, సర్పంచి జోగి రాహేలు, మార్కెట్ యార్డు అధ్యక్షుడు ఆంజనేయరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో కొత్త రేషన్ కార్డులు, చంద్రన్న సంక్రాంతి కానుక, 48 మంది విద్యార్థులకు రూ.57,600 ఉపకార వేతనాలు అందజేశారు. ఉపాధి పథకం పని చేసిన తమకు డబ్బు రాలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మల్లారపు వీరయ్య, జన్మభూమి కమిటీ సభ్యుడు నక్కల వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి వసుంధర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమాజ వికాసమే లక్ష్యం

జి.ఎన్.పాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: సమాజ వికాసమే లక్ష్యంగా ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమాన్ని చేపట్టిందని మండల ప్రత్యేకాధికారి ఉషారాణి అన్నారు. మండలంలోని జి.ఎన్.పాలెం, సంగుపాలెం పంచాయతీ కార్యాలయాల వద్ద బుధవారం నిర్వహించిన జన్మభూమి గ్రామ సభల్లో ఆమె మాట్లాడారు. సంగుపాలెంలో కుర్చీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జడ్పీటీసీ నారపారెడ్డి, సర్పంచులు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, శివశంకర్, ఎంపీటీసీ అన్నపూర్ణ, తహశీల్దారు సుధారాణి, ఈవోపీఆర్డీ సుజాత తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు కడియాల ప్రసాదరావు, వివిధ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

దళితులు ఐకమత్యంగా ఉండాలి



మాట్లాడుతున్న సలగల రాజశేఖర్

కర్లపాలెం, న్యూస్‌టుడే: దళిత క్రైస్తవులంతా ఐకమత్యంగా ఉండాలని నియోజకవర్గ దళిత నాయకుడు సలగల రాజశేఖర్ అన్నారు. బుధవారం రాజీవ్‌నగర్‌లో నియోజకవర్గ స్థాయి దళిత ఐక్యవేదిక సభ జరిగింది. దీనిలో రాజశేఖర్ మాట్లాడుతూ రాబోయే రోజులలో పార్టీలకు అతీతంగా అందరం కలసి దళిత అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయ కర్త బడుగు నాగేశ్వరరావు, కర్లపాలెం జడ్పీటీసీ సభ్యుడు గుంపుల కన్నయ్య, దగ్గుమల్లి సుభాషణరావు, జి.ఆనందరావు, మోపర్తి జాన్, బెజ్జం వెంకటేశ్వర్లు, భూపతిరావు, సుబ్బారావు, పాల్ పాల్గొన్నారు.

కర్లపాలెం గ్రామ డి.నెం: 419/1,419/2,419/3 రులో గల ఆస్తి గురించి ప్రకటన

మా క్లయింటు అయిన తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం ప్రగడ కోటయ్య నగర్ కాపురస్తులు కటకం శ్రీరాములు గారి కుమారుడు రామారావు గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

గుంటూరు జిల్లా కొల్లూరు మండలం చిలుమూరు గ్రామకాపురస్తులైన కొలసాని మేజర్ మధుసూదనరావు గారి కుమారుడు రమణమూర్తి గారు మా క్లయింటు వద్ద ది. 6-8-2010న రు.25,00,000/- అప్పుగా తీసుకొని మూడు ప్రామీసరీ నోట్లు స్వదస్తూరితో వ్రాసియిచ్చినారు. దర్మిలా అప్పు తీర్చనందున బాకీ వసూలు నిమిత్తం మా క్లయింటు పైవారిపై తెనాలి 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో **O.S. 2/2018** అను దావా వేసినారు. అందులో దిగువ షెడ్యూల్ ఆస్తిని జప్తు కోరుతూ పిటిషన్ కూడా దాఖలు చేసినారు. అవి పెండింగ్‌లో వున్నవి. ఇట్టి స్థితిలో సదరు కొలసాని రమణమూర్తి గారు దిగువ షెడ్యూల్ ఆస్తిని విక్రయుంచుటకు ప్రయత్నించుచున్నట్లు మా క్లయింటుకు తెలియవచ్చినది.

కావున సదరు ఆస్తిపై ఎలాంటి లావాదేవీలు జరుపవద్దని, అలా జరిపిన యెడల మా క్లయింటు యొక్క పై దావా బాకీకి లోబడి జరిగినట్లు భావించబడునని, సదరు లావాదేవీలు చెల్లనేరవని తెలియపరచటమైనది.

షెడ్యూల్ :

గుంటూరు జిల్లా బాపట్ల సబ్ జిల్లా కర్లపాలెం గ్రామ పంచాయితీ ఏరియా కర్లపాలెం గ్రామ డి.నెం: 419/1రులో 85 సెంట్లులో 10సెంట్లు, డి.నెం: 419/2రులో 47 సెంట్లలో 38 సెంట్లు, డి.నెం: 419/3రులో 59 సెంట్లు. పై మూడు నెంబర్లు కలిసి ఏకప్రదేశముగా ఉన్న ఎ॥ 1-07 సెంట్లు మాగాణి భూమికి హద్దులు.

తూర్పు: పోతురాజు వెంకటేశ్వర్లు గారి భూమి, **దక్షిణం:** కొలసాని కృష్ణకుమారి గారి భూమి, **పడమర:** మంచాల దుర్గయ్య, షేక్ మౌలాలి గార్ల భూమి, **పడమర:** ఇరిగేషన్ కాలువ

పట్టెల సత్యనారాయణ M.A., L.L.B అడ్వకేట్, తెనాలి

వేలం నోటీసు

in the Court of the Senior Civil Judge Bapatla

EP 116/14 OS 215/12

Between:
Kommanboina Tirumala -D.Hr
and
1.Pallaprolu Audinarayana
2.Pallaprolu Himabindu -J.Dr's

పై నెంబరు అమలులో Jdr's తాలుకు జప్తు కాబడిన స్థిరాస్థిని కోర్టులో ది.24-1-2018వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు బహిరంగ వేలం జరుపబడును. వేలం పాటలో పాల్గొన దలచినవారు ఆరోజు ఉదయం గం॥ 10.30ని॥లకు శ్రీ కోర్టువారి ఎదుట హాజరు కావలయును.

Schedule

Guntur District - Narasaraopet Registration District-Bapatla sub registration District-Bapatla Municipality-Railpet-Ward No-5 Survay No: 595/2. Door No: 2-8-254/10 and with its accessories an extanct of 96.8 square yards bounded by

East - Site of Shaik Rasheed (Plot No.18) 35F
South - Road 30 Feet
West - Site of Sri Rama kavasam Venkat Sai Naga Sarma 35 feet
North - Site of Addagada Mallikarjunarao (Plot No.27) 25F

DHR Value - 2,00,000
Ameen Value - 7,00,000

Note: Mortgageకి లోబడి వేలం జరుపబడును.

వేలం వాయిదా: 24–1–18
ఫరదర్ హియరింగ్: 30–1–18

C.V.Praveen Kumar
Advocate, Bapatla

మహిళలకు రంగవల్లుల పోటీలు

కొండుభొట్లపాలెం (బాపట్ల), న్యూస్‌టుడే: సంక్రాంతి పండుగ అంటేనే అందమైన రంగవల్లులు గుర్తుకు వస్తాయని ఎంపీపీ మానం విజేత అన్నారు. కొండుభొట్లపాలెంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు సర్పంచి గాళ్ల విజయనిర్మల, ఎంపీపీ విజేత బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గోపాపురంలోను మహిళలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారావు, ఎంఈవో నిరంజన్, పంచాయితీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, తెదేపా నేత జీకేనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందిస్తున్న ఎంపీపీ విజేత, సర్పంచి విజయనిర్మల

పాలసీదారులకు మెరుగైన సేవలందిస్తాం

బాపట్ల, న్యూస్‌టుడే: ఎల్ఐసీ ద్వారా పాలసీదారులకు మెరుగైన సేవలందిస్తున్నట్లు సంస్థ బాపట్ల బ్రాంచి సీనియర్ మేనేజర్ కె.రామకృష్ణయ్య అన్నారు. ఉత్తమ పనితీరు కనబరిచి, అమెరికాలో జరగనున్న మిలియన్ డాలర్ రౌండ్‌టేబుల్ సమావేశానికి ఎంపికైన ఏజెంటు పసుపులేటి సుబ్బారావును సంస్థ కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. వరుసగా రెండోసారి సుబ్బారావు ఈ ఘనత సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేనేజర్లు శివశ్రీ, దేవరవీంద్రకుమార్, ఏవో గోపాల్, అధికారులు శాస్త్రి, హరిబాబు, వెంకటేశ్వరరావు, ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏజంటు సుబ్బారావును సత్కరించిన రామకృష్ణయ్య

చిలకలూరిపేట

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం బాపూజీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి నిర్వాహకులు వీవీ సత్యనారాయణ, టి.చంద్రశేఖర్, ఎం.ఎస్.శంకర్, డి.రవి, బ్రహ్మం, డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'చంద్రన్న విద్యాజ్యోతి' అందజేత

పసుమర్రు(చిలకలూరిపేట గ్రామీణ,) న్యూస్‌టుడే : ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ సభ్యురాలు రాయిపూడి సుజ్ఞానమ్మ కోరారు. మండలంలోని పసుమర్రు మద్ది కామయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు చంద్రన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుజ్ఞానమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్నారన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉపకార వేతనాలు, సమదుస్తులు ఇలా ఎన్నో రకాలుగా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ఉపయోగించుకొని కష్టపడి చదువుకొని ప్రయోజకులుగా మారాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూదాటి రామకోటేశ్వరరావు, పూర్వ విద్యార్థుల సంఘం గద్దె హరిబాబు, బూరుగుపల్లి వెంకట కృష్ణ పాల్గొన్నారు.

మీరూ స్పందించండి

మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి. యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' వేదికగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా సమస్యను ఫొటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా వివరించి వాట్సప్ ద్వారా మీ పేరుతో సహా పంపడమే.

– న్యూస్‌టుడే, యడ్లపాడు

వాట్సప్ నంబరు

80081 45652



సమస్య : మండలంలోని సొలస ప్రధాన వీధిలో మురుగుకాల్వ కల్వర్టు వద్ద ఉన్న గొయ్యిని మూసివేయకుండా పంచాయతీ అధికారులు అలాగే వదిలేశారు. రాత్రివేళలో మహిళలు, చిన్నారులు గోతిలో పడి గాయపడుతున్నారు. వెంటనే అధికారులు సిమెంట్ దిమ్మెను వేసి గోతిని మూసివేయాలి.

- ప్రసాదు, సొలస

సమాధానం : మురుగుకాల్వకు పూడికతీత కోసం సిమెంటు దిమ్మె తొలగించాం. వెంటనే గోతిపై దిమ్మెను వేసి ప్రమాదాలు జరుగకుండా నివారిస్తాం.

- శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, సొలస



సమస్య : మండలంలోని కొండవీడులోని పాఠశాల సమీపంలో రహదారి దాటేందుకు అమర్చిన సిమెంటు పైపు మురుగుతో పూడిపోవడంతో మురుగుకాల్వలోని సిమెంటు పైపు దాటి వెళ్లడం లేదు. మురుగునీరు నీరు వీధుల్లోకి వస్తుంది. సిమెంటు పైపు లోపల పూడికతీసి మురుగు పారేలా చూడాలి.

- ఖాదర్‌వలి, కొండవీడు

సమాధానం : సిమెంట్ పైపులో పూడికతీసి మురుగుకాల్వలో మురుగునీరు నిలబడకుండా చర్యలు తీసుకుంటాం.

- జయబాబు, పంచాయతీ కార్యదర్శి, కొండవీడు



సమస్య : మండలంలోని బోయపాలెం ముస్లిం కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక దాదాపు కాలనీలోని అన్ని వీధుల్లో మురుగు నీరు రోడ్ల మీదకు వస్తుంది. అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా ఫలితం ఉండటం లేదు. కాలనీలోని మురుగునీరు బయటకు పోయేలా ప్రధాన మురుగుకాల్వను ఏర్పాటు చేయాలి. **- రఫీ, బోయపాలెం**

సమాధానం : ముస్లిం కాలనీలో మురుగు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేని మాట వాస్తవమే. కొన్ని కాల్వలు లోతట్టుగా మారాయి. వాటిని ఎత్తులేపి మురుగునీరు సమస్య లేకుండా చూస్తాం.

- శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, వంకాయలపాడు.



సమస్య : మైదవోలు గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. గ్రామ ప్రధాన రహదారి నుంచి మురుగు ఊరు బయటకు వెళ్లడానికి కాల్వలో జమ్ము పెరిగి అడ్డుగా ఉంది.

సమాధానం : ఊరిబయట కాల్వలో అడ్డుగా ఉన్న జమ్మును తొలగించి గ్రామంలో మురుగునీరు బయటకు పోయేలా పనులు చేస్తాం.

- రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి, యడ్లపాడు

చందవరం.. సమస్యల నిలయం



ప్రధాన రహదారి పక్కన మురుగు కాలువ దుస్థితి

నాదెండ్ల, న్యూస్‌టుడే: సమస్యాత్మక గ్రామమైన చందవరంలో మౌలిక వసతులు సమకూరక ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం, ప్రత్యేకాభివృద్ధి నిధులు పెద్దఎత్తున వస్తున్నా.. చెప్పుకోదగిన పనులు జరగడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఖజానాలో నిధులు మూలుగుతున్న తాము నిత్యం కష్టాలు ఎదుర్కొనక తప్పడం లేదని వాపోతున్నారు. ఇక్కడున్న నెలకొన్న విబేధాల కారణంగా కనీసం చిన్న పనిని కూడా చేసేందుకు అధికారులు సహకరించడం లేదని పంచాయతీ పాలకులు ఆరోపిస్తున్నారు. 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమానికి అధికార యంత్రాంగం బుధవారం పెద్దఎత్తున తరలి వచ్చారని, అయితే తమ సమస్యలను పరిష్కరించే చొరవ తీసుకోలేదని గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రెండో రోజూ.. అదే తీరు



పనిచేయని ఎల్‌ఈడీ టీవీ

నాదెండ్ల, న్యూస్‌టుడే : జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సందేశాన్ని ప్రజలకు అందించేందుకు వేదికపై ప్రత్యేక్ష ప్రసార ఏర్పాట్లు చేయడంలో లోటుపాట్లు ఎదురవుతున్నాయి. సాతులూరులో తొలి రోజు తెరపై దృశ్యం కనిపించలేదు. రెండో రోజు చందవరం సభలో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. ఎల్‌ఈడీ టీవీ ఏర్పాటు చేశారు. అయితే దీనికి అంతర్జాలం లేక ప్రసారం చేయడంలో సాంకేతిక సమస్య ఎదురైంది. ప్రభుత్వం ఇచ్చిన ఫైబర్ గ్రిడ్ నెట్ కేబుల్ కనెక్షన్ సక్రమంగా పనిచేయడం లేదని పంచాయతీ అధికారులే వాపోయారు. చివరికి చరవాణిలో సీఎం ప్రసంగాన్ని వినిపించారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

చందవరం, చిరుమామిళ్ల (నాదెండ్ల), న్యూస్‌టుడే : ప్రజా సమస్యలను తమ గ్రామాల్లోనే ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో పరిష్కరించుకొనేందుకు 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమం మంచి వేదికంగా ఉపయోగపడుతుందని నరసరావుపేట ఆర్డీవో, నియోజకవర్గ ప్రత్యేకాధికారి జి.రవీందర్ అన్నారు. మండల పరిధిలోని చందవరం, చిరుమామిళ్ల గ్రామాల్లో 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దారు శిరీష, ఎంపీడీవో జి.కాశయ్య గర్భిణులకు చీర సారె పంపిణీ చేశారు. పింఛను, రేషన్ కార్డు మంజూరు పత్రాలు అందజేశారు. ముగ్గుల పోటీలు, పోషకాహార ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



గర్భిణులకు సారె అందజేస్తున్న అధికారులు

స్త్రీ విమోచన ఉద్యమానికి సావిత్రిబాయి నాంది

నాదెండ్ల, న్యూస్‌టుడే : బానిసత్వం ఉన్న నాటి రోజుల్లో స్త్రీ విమోచనా ఉద్యమానికి సావిత్రిబాయి పూలే నాంది పలికారని ఐద్వా నాయకురాలు అమరమ్మ అన్నారు. నాదెండ్ల కేజీబీ విద్యాలయం, గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీ మండల పరిషత్తు పాఠశాలల, సాతులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రతిభావంతులైన బాలికలను సత్కరించారు. మహిళా ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో దళిత చైతన్య స్రవంతి సభ్యుడు యడ్ల వినీల్‌కుమార్, ఏపీజేఎఫ్ అధ్యక్షుడు కుల్లి చినబాబు, ఇన్‌ఛార్జి ఎస్‌వో అరుణకుమారి, ప్రధానోపాధ్యాయులు గురులింగం, ప్రసాదిని పాల్గొన్నారు.



సాతులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులకు సన్మానం



మీనాక్షిదేవిని సత్కరిస్తున్న మురికిపూడి సముదాయ పాఠశాలల ఉపాధ్యాయులు

మురికిపూడిలో..

మురికిపూడి(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : మండలంలోని మురికిపూడి పాఠశాల సముదాయ పరిధిలో బుధవారం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ప్రధానోపాధ్యాయిని ఎం.మీనాక్షిదేవిని ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయినులు విద్యా ప్రగతికి చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో మురికిపూడి సముదాయ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అలీఖాన్, చెన్నయ్య, సుబ్బారావు, సురేష్, సుదేశ్న, సురేష్ పాల్గొన్నారు.

చిలకలూరిపేట

సావిత్రిబాయికి ఘన నివాళి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ఆర్‌వీఎస్‌సీవీఎస్ ఉన్నత పాఠశాలలో బుధవారం మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పలపాటి వెంకటేశ్వరరావు పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. పట్టణంలోని రాష్ట్రీయ జనక్రాంతి పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌస్ సావిత్రిబాయిపూలేకు నివాళి అర్పించారు.

ప్రపంచ పర్యటక కేంద్రంగా కొండవీడు

జన్మభూమి సభలో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చెంఘీజ్‌ఖాన్‌పేట(యడ్లపాడు), న్యూస్‌టుడే : డ్వాక్రా మహిళలను వెలుగులోకి తెచ్చి వారికి ఆర్థిక స్వావలంబన చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో బుధవారం నిర్వహించిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో విడత రైతు రుణమాఫీ ఈనెల 10 లోపు వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. నాలుగు, ఐదో విడత రుణమాఫీని కూడా ఈ సంవత్సరంలోపు 10 శాతం వడ్డీతో సహా వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. డ్వాక్రా మహిళల మలివిడత రుణమాఫీ కూడా త్వరలో చెల్లిస్తామన్నారు. చారిత్రక వెన్నముద్దల వేణుగోపాలస్వామి దేవాలయాన్ని భక్తులు, పర్యటకులు ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయబోతున్నామని తెలిపారు. రూ.60 కోట్లతో కొండవీడు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఇస్కాన్ దేవాలయం, కొండవీటి ఘాట్‌రోడ్డులను పూర్తి చేసి ఈసంవత్సరంలోపు ఘనంగా కొండవీటి ఉత్సవాలను జరుపుతామన్నారు. కొండవీడును ప్రపంచ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ముందుగా గ్రామంలోని రూ.1.5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలో డిజిటల్ తరగతి గదిని ప్రారంభించారు. సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయినులకు సన్మానం చేశారు. గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించి దుస్తులు, పోషకాహారాన్ని అందజేశారు. లబ్ధిదారులకు చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి స్టీఫెన్‌కరుణాకర్, జడ్పీటీసీ సభ్యుడు కె.సాయిబాబు, సర్పంచి చుండూరి పేరయ్య, ఉపసర్పంచి పూజల సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు మాడా వీరయ్య, తెదేపా మండల అధ్యక్షుడు ముద్దన నాగేశ్వరరావు, ఉద్యాన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడు పోపూరి శివరామకృష్ణ, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆలోకం సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



సంక్రాంతి కానుక పంపిణీ చేస్తూ...

నేడు రెండు గ్రామాల్లో 'జన్మభూమి'

కనపర్రు, తూబాడు(నాదెండ్ల): మండల పరిధిలోని రెండు గ్రామాల్లో 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.కాశయ్య తెలిపారు. కనపర్రు, తూబాడు గ్రామాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రతిఒక్కరికీ ఎన్టీఆర్ వైద్య సేవలు: ఆర్డీవో

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : ప్రభుత్వం ప్రతి వ్యక్తికి ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఆరోగ్య సేవలు అందిస్తుందని నరసరావుపేట ఆర్డీవో జి.రవీంద్ర అన్నారు. మండలంలోని మానుకొండవారిపాలెం గ్రామంలో బుధవారం జరిగిన జన్మభూమి మా ఊరు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఆరోగ్యరక్ష పథకం కింద 1044 చికిత్సలతో పాటు ప్రతి వ్యక్తికి సంవత్సరానికి రూ.2 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఏర్పాటు చేసిన ఉచిత వైద్య, పశు వైద్య శిబిరాలను ఆర్డీవో ప్రారంభించారు. ఐసీడీఎస్ పోషకాహార కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్థులు ప్రధానంగా ప్రస్తావించిన కరకట్ట నిర్మాణం, డంపింగ్ యార్డు వలన కలుగుతున్న ఇబ్బందులు, కుప్పగంజి వాగులో కలుషిత నీటి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని తహశీల్దార్ వెంకయ్య హామీ ఇచ్చారు. తాగుబోతుల ఆగడాలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి దూపాటి దయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ మస్తాన్‌బీ, గ్రామపెద్దలు కల్లి వీరారెడ్డి, తియ్యగూర వెంకటేశ్వరెడి, శ్రీనివాసరెడ్డి, దేవగరి శ్రీనివాసరెడ్డి, మానుకొండ వీరనాగిరెడ్డి పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఆర్డీవో రవీంద్ర

వ్యభిచారం కేసులో ఇద్దరి అరెస్టు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పట్టణంలోని గుండయ్యతోటలో వ్యభిచారం జరుగుతుందని సీఐకి సమాచారం అందింది. దీనిపై ఎస్సై రాధాకృష్ణ సిబ్బందితో అక్కడ వెళ్లారు. వ్యభిచారం చేయిస్తున్న అన్నపరెడ్డి నాంచారమ్మను, అన్నపరెడ్డి దుర్గ, జావిశెట్టి లక్ష్మీ గురవయ్య(విటుడు) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి వ్యభిచారం చేయుస్తున్న నాంచారమ్మ, విటుడైన లక్ష్మీ గురవయ్యను అరెస్టు చేశారు

పేటలో ప్రత్యేకాధికారిణి పరిశీలన

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: ఐదో విడత జన్మభూమి కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వ సూచనలను అధికారులు తప్పనిసరిగా పాటించాలని జన్మభూమి నియోజకవర్గ ప్రత్యేక అధికారిణి హేమముని వెంకటప్ప అధికారులకు సూచించారు. పట్టణంలో బుధవారం జరిగిన 8, 9 వార్డుల్లో జన్మభూమి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జన్మభూమి జరుగుతున్న తీరును ఆమె పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సభల్లో కొందరు మహిళలు పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నా రావడం లేదని కమిషనర్, ప్రత్యేకాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అర్హులకు రేషన్‌కార్డులు, పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. పట్టణంలో 6, 7 వార్డుల్లో కూడా జన్మభూమి- మాఊరు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ కనకారావు, కౌన్సిలర్లు కాలేషా, బాజీబి, తెదేపా నాయకులు షేక్ కరిముల్లా, అబ్దుల్ రెహమన్, అధికారులు ఫణికుమార్, రవికుమార్, అనిల్ పాల్గొన్నారు.



రేషన్ కార్డులు కావాలని కమిషనర్‌ని అడుగుతున్న మహిళలు

విద్యాజ్యోతి పుస్తకాల అందజేత

జానపాడు (పిడుగురాళ్ల గ్రామీణ), న్యూస్‌టుడే : మండలంలోని జానపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 95 మందికి బుధవారం చంద్రన్న విద్యాజ్యోతి పుస్తకాలను ఎంపీపీ చింతలపూడి చంద్రమ్మ అందజేశారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ చింతలపూడి రాంమూర్తి, ప్రధానోపాధ్యాయుడు నరసింగరావు, ఆళ్ల శ్రీను, వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గురజాల

చంద్రన్న బీమా నగదు అందజేత

గుత్తికొండ (పిడుగురాళ్ల గ్రామీణ), న్యూస్‌టుడే : మండల పరిధిలోని గుత్తికొండలో బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన మీర్‌సాహెబ్ అంత క్రియల ఖర్చుల నిమిత్తం ఆయన భార్య జాన్‌బీకి రూ.5 వేలను అందజేశారు. మాజీ సర్పంచి శివన్నారయణ, సుభానీ, ఎంపీటీసీ సభ్యులు ధరియాబీ, బీమా మిత్ర నాగమణి వెలుగు సీసీ రవి, సైదాబీ, మహాబీలు పాల్గొన్నారు.

వేడుకగా జన్మభూమి- మాఊరు

గ్రామాల్లో పథకాల పంపిణీ ✤ పాల్గొన్న నేతలు, అధికారులు



మాచవరం : మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

నియోజకవర్గంలో జన్మభూమి- మాఊరు కార్యక్రమం వేడుకలా నిర్వహిస్తున్నారు. నూతనంగా మంజూరైన పింఛన్లు, రేషన్‌కార్డులు అర్హులకు అందజేస్తున్నారు. మరో వైపు ముగ్గుల, ఆటల పోటీలు నిర్వహిస్తూ విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్నారు. గర్భిణులకు సీమంతం చేసి ఆశీర్వదిస్తున్నారు. రెండో రోజు నియోజకవర్గంలో సజావుగా గ్రామసభలు సాగాయి.

మాచవరం : ప్రజల సమస్యలు తెలుసుకోవటానికే జన్మభూమి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, మార్కెటింగ్ శాఖ అడిషనల్ కమిషనర్ ఆనందకుమార్ శామ్యూల్ చెప్పారు. బుధవారం మండలంలోని చెన్నాయిపాలెం, పిల్లుట్ల గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఆర్డీవో ఇ.మురళి, మండల ప్రత్యేక అధికారి పౌలు, ఎంపీడీఓ దాసరి రాంబాబు, తహశీల్దారు తుపాకుల మస్తాన్, సర్పంచులు నందిపాటి షర్మిలరాణి, బొగ్గవరపు అంజయ్య, టి.ఎన్.ఎస్.ఎఫ్. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.బ్రహ్మం చౌదరి, యడ్లపల్లి రామారావు, దున్నా చెన్నయ్య, జమ్మిగుంపుల వెంకటేశ్వర్లు, బండ్ల నరసింహారావు పాల్గొన్నారు.

తుమ్మలచెరువు, వీరాపురం (పిడుగురాళ్ల గ్రామీణ) : రాష్ట్రం రూ.వేల కోట్ల లోటు బడ్జెట్‌లో ఉన్నా సంక్షేమాన్ని వీడకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కష్టపడి పనిచేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో నడిపిస్తున్నారని మార్కెట్‌యార్డు కమిషనరు శ్యామియేలు ఆనంద కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తుమ్మలచెరువు, వీరాపురం గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి గ్రామసభల్లో ఆయన పాల్గొని తెదేపా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. తొలుత ఆయన ప్రత్యేకాధికారి మధుబాబు, తహశీల్దారు రవిబాబు, ఎంపీడీఓ పాండు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ చింతలపూడి రాంమూర్తి, తెదేపా మండల అధ్యక్షుడు మేకల వెంకట సాంబశివరావు, సర్పంచులు కుమారి, సత్యవతితో కలసి గ్రామాల్లో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అర్హులకు గ్రామసభల్లో పింఛన్లు, రేషను కార్డులను అందజేశారు. గ్రామసభల్లో అధికారులు పాల్గొన్నారు.



తుమ్మలచెరువులో ఆనందకుమార్, అధికారులు



శ్రీనగర్‌లో ..

శ్రీనగర్, గామాలపాడు (దాచేపల్లి) : మండలంలో రాష్ట్ర ప్రధాన రహదారిపై ఉన్న శ్రీనగర్, గామాలపాడులో బుధవారం నేతలు, అధికారులు జన్మభూమి- మా ఊరు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు చోట్ల ఏర్పాటు చేసిన సభల్లో అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు, విద్యార్థులకు వెలుగు విభాగం ఉపకార వేతనాలు, లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. రామాపురంలో గర్భిణులకు తెదేపా సీనియర్ నేత, మార్కెట్ యార్డు కమిటీ మాజీ అధ్యక్షుడు వేముల వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో సీమంతాలు చేశారు. చిన్నారులకు అన్నప్రాసన ఏర్పాటు చేశారు. అన్ని చోట్లా ప్రజలు, మహిళల నుంచి వచ్చిన సమస్యలపై వినతిపత్రాలు తీసుకున్నారు. మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మూలగొండ్ల వెంకటేశ్వరరెడ్డి, పిడుగురాళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ అధ్యక్షుడు మునగా నిమ్మయ్య, ఎంపీపీ అంబటి నవకుమార్, తహశీల్దార్ దేవిశెట్టి మల్లికార్జునరావు, ఎంపీడీఓ కృష్ణకుమారి, డిప్యూటీ తహశీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు, సర్పంచులు పానుగోతు హేమ, చడమల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆరోగ్యం, ఆనందం గురించి ప్రసంగించారు. నేతలు కార్యదర్శులు విజయకుమార్, వీఎస్వీ మంగేశ్వరరావు, వీఆర్వో బెంజిమన్, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

పిడుగురాళ్ల : పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మహిళలు కృషి చేయాలని పురపాలిక అధ్యక్షురాలు భవనాసి హైమావతి చెప్పారు. బుధవారం పట్టణంలోని బెల్లంకొండ డొంకలో, ఈసేవా కేంద్రం భవనంలో 2,3,4వ వార్డులకు జన్మభూమి- మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆమె పాల్గొని మాట్లాడుతూ పిల్లలను చదివించుకోవటంలో, పరిసరాల పరిశుభ్రంగా ఉంచటంలో మహిళలు కృషి చేయాలని కోరారు. కుళాయిల నుంచి నీటిని వృథాగా పోనీయవద్దని చెప్పారు. పింఛను దరఖాస్తు చేసుకునే వారు అన్ని పత్రాలు సమర్పించాలని చెప్పారు. కమిషనరు కె.శివరామిరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ పిడుగురాళ్ల ఏర్పాటుకు అందరూ కృషి చేయాలని కోరారు. రెండు రకాల చెత్త సేకరణకు పురపాలక సిబ్బంది వీధుల్లోకి వచ్చినప్పుడు చెత్త వారికి అందజేయాలని చెప్పారు. తెదేపా నేత భవనాసి యల్లారావు మాట్లాడుతూ జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు వివరించి ప్రజల సమస్యలు తెలుసుకోవటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేశారని చెప్పారు. పురపాలిక ఉపాధ్యక్షుడు అద్దంకి రత్నాకరరావు మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డి.ఇ. కె.ఎర్రినాయుడు, టి.పి.ఎస్. ఎస్.ఎల్.సుబ్బారావు, వైద్యులు కాసర్ల వెంకటరెడ్డి, ఎ.ఇ. వసంతరావు, పశు సంవర్ధకశాఖ ఎ.ఇ. ఎ.నాగేశ్వరరావు, వీఆర్వోలు మధు, ఎ.వి.సుబ్బారావు, కౌన్సిలర్లు కోయా శ్యామ్, కొక్కెర కొండలు, సయ్యద్ అమీర్ అలీ, పి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



గురజాల : గర్భిణులను ఆశీర్వదిస్తున్న కాంతారావు

గురజాల : జన్మభూమి- మా ఊరు కార్యక్రమం ద్వారానే సమస్యల పరిష్కారం కనుక్కోవచ్చని జన్మభూమి కమిటీ ఛైర్మన్ పులుకూరి కాంతారావు అన్నారు. మండలంలోని తేలుకుట్లలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని, గ్రామాల అభివృద్ధి భారీస్థాయిలో చేస్తున్నారని, ప్రతి పంచాయతీ పరిధిలో రూ.లక్షల అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు సాగుతున్నాయని ఆయన చెప్పారు. ఎంపీడీఓ మేరి కమలమ్మ, ప్రత్యేక అధికారి రవిబాబు మాట్లాడుతూ గత జన్మభూమిలో ఇచ్చిన ఫిర్యాదులను పరిష్కరించామని, ప్రస్తుతం రేషన్ కార్డులు, పింఛన్లు, తైవాన్ స్ప్రేయర్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. తేలుకుట్లలో విద్యుత్తు ఉప కేంద్రం, వంతెన నిర్మాణాలు సాగుతున్నాయని వివరించారు. సభలో తహశీల్దార్ డి.వెంకటేశ్వర్లు, సర్పంచి ఉడుముల నారాయణమ్మ, ఎం.ఇ.ఒ. జి.వెంకటేశ్వర్లు, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎన్.వి.అరుణకుమారి, ఎ.ఒ. పుల్లారెడ్డి, ఎ.పి.ఎం. వెంకట్రావు, ఏపీఓ మల్లికార్జునరావు, సీఐ రామారావు, తెదేపా నేతలు గనిపల్లి శ్యామ్, నాగెండ్ల చిన తిరుపతిరావు, ఉడుముల సీతారామిరెడ్డి, బత్తుల ఏడుకొండలు, నాగెండ్ల చందరరావు, ఎంపీటీసీ సభ్యుడు ఉడుముల నారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శైలజ పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం



అన్నం వడ్డిస్తున్న శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : పట్టణంలోని శివాలయంలో అయ్యప్పస్వామి, తిరుపతమ్మ మాలధారులకు బుధవారం నుంచి అన్నదానాన్ని ప్రారంభించారు. దాతల సహకారంతో దేవస్థానం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహా శివరాత్రి వరకు నిర్వహిస్తామని దేవస్థానం కమిటీ అధ్యక్షుడు జూలకంటి శ్రీనివాసరావు చెప్పారు. మద్దినేని సైదమ్మ, కొత్త వెంకట్రామయ్య, ఆలేటి సుబ్బారావు, ఆత్మకూరి రామయ్య, గుంటూరు రాఘవులు దీన్ని పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థినులకు పుస్తకాల అందజేత



పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కేసానపల్లి (దాచేపల్లి), న్యూస్‌టుడే : మండలంలోని కేసానపల్లి కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థినులకు బుధవారం యూటీఎఫ్ శాఖ ఉపాధ్యాయులు పుస్తకాలు అందజేశారు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా సరఫరా చేసిన స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇచ్చారు. తంగెడ, దాచేపల్లి, రామాపురం, మాదినపాడు, పెదగార్లపాడు, నారాయణపురం గ్రామాల్లో ఉన్న ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు బోధించేందుకు వాటిని ఉపాధ్యాయులకు కూడా పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సంఘ నేతలు షేక్ మస్తాన్‌వలి, వట్టెపు నాగేశ్వరరావు, పెరల్సన్, సత్యానందం, బండ్ల ప్రసాద్, కస్తూర్బా ఏఓ జ్యోతి, ఉపాధ్యాయురాలు ప్రకాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా నంద్యాల




దాచేపల్లి, న్యూస్‌టుడే : ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా దాచేపల్లికి చెందిన నంద్యాల వెంకటేష్ నియమితులయ్యారు. ఇటీవల గుంటూరులో నిర్వహించిన 47వ రాష్ట్రస్థాయి మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వెంకటేష్‌ను కౌన్సిల్‌లోకి తీసుకున్నారు. బుధవారం ఆయనను సీపీఐ నేతలు పలువురు అభినందించారు.

వృథా అరికట్టరూ



పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : పట్టణంలోని తాగునీటి పథకం ప్రధాన పైపులైనుకు కొన్ని రోజుల నుంచి మరమ్మతులు పురపాలక సంఘం అధికారులు చేపడుతున్నారు. గోవిందపురం సమీపంలోని కృష్ణానది దగ్గర నుంచి టెక్‌వెల్ నుంచి నీటిని ప్రధాన పైపులైన్‌కు సరఫరా చేస్తున్నారు. కొత్త గణేశునిపాడు సమీపంలో ప్రధాన పైపులైన్ వాల్వు నుంచి నీరు వృథాగా పోతోంది. దీన్ని నివారించాల్సి ఉంది.

గురజాల



పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : నిన్నటివి కిలో టమాట రూ.10, బంగాళదుంప రూ.20, వంకాయ రూ.30, క్యాబేజి రూ.20, బెండకాయ రూ.30 , దొండకాయ రూ.20, కాకర రూ.30, దోసకాయ రూ.20, పచ్చిమిర్చి రూ.30, గోరుచిక్కుడు రూ.30, బీర కాయ రూ.30, క్యారెట్ రూ.50, బీటురూట్ రూ.30, ఉల్లిగడ్డలు రూ.40, వెల్లుల్లి (మధ్య రకం)రూ.60, వెల్లుల్లి లావులు రూ.75, అల్లం రూ.35 , సొరకాయ రూ.10.

చంద్రన్న బీమా నగదు అందజేత

రామాపురం (దాచేపల్లి), న్యూస్‌టుడే : మండలంలోని రామాపురంలో ఆకారి రామలింగారెడ్డి (41) మృతి చెందారు. చంద్రన్న బీమా చేయించుకున్న అతనికి ప్రభుత్వం రూ.2 లక్షలు మంజూరు చేసింది. అందులో తొలుత మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలను నేతల చేతుల మీదుగా అతని కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పురపాలక సంఘం అధ్యక్షురాలు భవనాసి హైమావతి, ఉపాధ్యక్షుడు అద్దంకి రత్నాకరరావు, కమిషనరు కె.శివరామిరెడ్డి, పీఈటీలు సిహెచ్.నాగరాజు, ఇమానియల్‌రాజు, ప్రధానోపాధ్యాయురాలు కె.రామతులశమ్మ, ఎ.ఎస్.ఐ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదంలో ఒకరికి గాయాలు


క్షతగాత్రుని వైద్యశాలకు తీసుకెళ్తున్న బంధువు

పందిటివారిపాలెం (పిడుగురాళ్ల గ్రామీణ), న్యూస్‌టుడే : అతిగా మద్యం తాగిన ఓ వ్యక్తి ఆ మత్తులో ద్విచక్ర వాహనంపై వెళ్తూ మరో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఒకరు గాయపడ్డారు. బుధవారం పందిటివారిపాలెం అడ్డరోడ్డు వద్ద ఇది జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఒప్పిచర్లకు చెందిన ఇల్లూరి కొండ తన పిన్నికి పంటి నొప్పిగా ఉండటంతో పిడుగురాళ్ల వైద్యశాలలో చూపించేందుకు తన ద్విచక్ర వాహనంపై పిడుగురాళ్ల వస్తున్నాడు. ఈక్రమంలో వారు అడ్డరోడ్డు దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా ఓ వ్యక్తి మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ కొండ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కొండ తలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతన్ని ఆటోలో పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

విద్యుత్తు లైన్‌మెన్‌కు తీవ్రగాయాలు


గాయపడ్డ లైన్‌మెన్

వీరాపురం (పిడుగురాళ్ల గ్రామీణ) : అద్దంకి- నార్కట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపై వీరాపురం వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో మాచవరంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం బుధవారం మాచవరంలో విద్యుత్తు లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై వీరాపురం నుంచి మాచవరం బయలుదేరారు. హైదరాబాద్ నుంచి పిడుగురాళ్ల వస్తున్న ఓ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో లైన్‌మెన్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సమయంలో రహదారిపై కారులో వస్తున్న పిడుగురాళ్ల తహశీల్దారు బి.రవిబాబు సంఘటన చూసి తన కారు ఆపి క్షతగాత్రునికి సపర్యలు చేశారు. 108లో పిడుగురాళ్ల వైద్యశాలకు తరలించారు.



పిడుగురాళ్ల : జయలక్ష్మి, హాలో : అశ్వని, 2 కంట్రీస్ :గంగామహల్, ఎంసీఏ : దాచేపల్లిలో. .. అలంకార్ ఎంసీఏ, హాలో: తిరుమల, ఒక్కక్షణం : రామకృష్ణ ఆక్సిజన్ : గురజాలలో. .. సత్యనారాయణ ఐనాక్స్ 2 కంట్రీస్, ఎంసీఏ

పల్లె ముంగిట.. రంగోలి


ముగ్గులు వేస్తున్న మహిళలు

- ఉత్సాహంగా ముగ్గుల పోటీలు
- పల్లెల్లో సంక్రాంతి సంబరాలు

పొందుగల (దాచేపల్లి), న్యూస్‌టుడే : రానున్న సంక్రాంతి పండుగ నేపథ్యంలో మండలంలోని కృష్ణానది తీరానున్న పొందుగలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బుధవారం బాలికలు, మహిళలు పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేశారు. ముగ్గుల విజేతలతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి గురజాల షఫియా, ఎంపీటీసీ సభ్యుడు తండా కరీం, ఎంపీడీఓ కృష్ణకుమారి, ఐసీడీఎస్ విభాగం నడికూడి సెక్టార్ పర్యవేక్షకురాలు కొత్త ఆదిలక్ష్మి, నేతలు గురజాల జానీబాషా, ఆవుల సైదులు, శరమాళ్ల పాపయ్య, గురజాల దావూద్ పాల్గొన్నారు.





వివిధ రకాల ముగ్గులు

కేబుల్ వైర్లు కత్తిరిస్తున్న వారిపై ఫిర్యాదు


ఎస్సై రవీంద్రకు ఫిర్యాదు అందజేస్తున్న బాధితులు

పిడుగురాళ్ల (గ్రామీణ, న్యూస్‌టుడే : మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజామున ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రసారాలకు అంతరాయం కలిగేలా కొందరు కేబుల్ తీగలను కత్తిరించారంటూ బుధవారం ఎస్సై రవీంద్రకు బాధితులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఏపీఎస్ఎఫ్ఎల్ ట్రిపుల్ ప్లే సర్వీసు బాక్సులను అమర్చేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వారు పట్టణంలో నెట్‌వర్కుకు సంబంధించిన బాక్సులను వినియోగదారులకు అమర్చుతున్నారు. ఆ ప్రసారాలకు అంతరాయం కలిగేలా వడ్లవల్లి సుబ్బారావు, గుదె బాల కోటేశ్వరరావు, ఉడతా సాయి, షేక్ గౌసు, పొన్నెకంటి మల్లికార్జునరావు, రాజేష్ 7 కిలోమీటర్ల మేర తీగలను కత్తిరించారని ఏపీఎస్ఎఫ్ఎల్ ఎంఎస్ఓ చల్లా గిరిబాబు ఎస్సైకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపడతామని ఎస్సై అన్నారు.

కృష్ణమాదిగ విడుదల కోరుతూ రాస్తారోకో

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ విడుదల చేయాలని మంగళవారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నేతలు రాస్తారోకో చేశారు. కేసీఆర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వెంటనే ఆయన్ను విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని అడిగారు. సమితి మండల అధ్యక్షుడు డి.అబ్రహం, నేతలు కె.జార్జి, కె.ప్రకాష్, ఎస్.సాల్మన్, ఎస్.నాగేశ్వరరావు, రామా ఇశ్రాయేలు, జి.భూషణం పాల్గొన్నారు.

తీరనున్న విద్యార్థుల కష్టాలు

బ్రాహ్మణపల్లి (పిడుగురాళ్ల గ్రామీణ), న్యూస్‌టుడే : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. గ్రామానికి కిలోమీటరు దూరాన అద్దంకి- నార్కట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పక్కన పాఠశాల ఉండటం... దీనికి


ప్రారంభమైన పనులు

ప్రహరీ లేక ఆకతాయిలకు అడ్డాగా ఉండేది. 5 ఎకరాల స్థలంలో ఉన్న పాఠశాలకు ప్రహరీ నిర్మించేందుకు అనేక మార్లు ప్రతిపాదనలు పంపినా ఫలితం దక్కలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీరు- చెట్టు కార్యక్రమంలో పాల్గొనేందుకు గ్రామానికి వచ్చినప్పుడు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల సమస్యలను విన్నవించారు. స్పందించిన ముఖ్యమంత్రి పాఠశాలకు ఎదురుగా అండర్‌బ్రిడ్జితో పాటు పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఆదేశించడంతో రూ.40 లక్షలు మంజూరయ్యాయి. దీంతో పనులు ప్రారంభించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి

గురజాల : సామాజిక విప్లవకారిణి, భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు క్రాంతిజ్యోతి సావిత్రి బాయి పూలే 187వ జయంతిని గురజాలలో నేషనల్ నవక్రాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు నేతృత్వంలో బుధవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో జయంతి చేశారు. కార్యక్రమంలో బడిదెల శ్రీనివాసరావు, వాసం వెంకటప్పయ్య, కటికం అంకారావు, గురవాల ప్రసాద్, షేక్ అజీజ్, జానపాటి నాగేశ్వరరావు, చింతకాయల పుల్లయ్య పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి, జానపాడు (పిడుగురాళ్ల గ్రామీణ) : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, జానపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, నరసింగరావు, ఉపాధ్యాయులు గఫూర్, సీతారామయ్య, ప్రసాద్, రామగీత, శ్యామల, పీడీ దాని, పీఈటీ ప్రభాకర్ పాల్గొన్నారు.

పిడుగురాళ్ల : పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ప్రధానోపాధ్యాయురాలు కె.రామతులశమ్మ, ఉపాధ్యాయులు జహీరాబేగం, కోటేశ్వరమ్మ, వాసవి, జ్యోతి, చైతన్యసాధన, శివజ్యోతి, శాంతకుమారి పూలమాలలు వేసి నివాళి


చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

అర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు రామతులశమ్మ పూలే జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయినులను సత్కరించారు.

దాచేపల్లి : దేశంలో మొట్టమొదటి అభ్యుదయవాది, ఉపాధ్యాయురాలు, క్రాంతి జ్యోతి అయిన శ్రీమతి సావిత్రి బాయి పూలే 187వ జయంతి బుధవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. దాచేపల్లి ఉన్నత, ముత్యాలంపాడు, ఇరికేపల్లి ప్రాథమికోన్నత, మాదినపాడు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండలంలోని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సావిత్రి బాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు.


బ్రాహ్మణపల్లిలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం


పిడుగురాళ్ల పట్టణంలో..

నరసరావుపేట

నేడు డయల్ యువర్ ఛైర్మన్

నరసరావుపేట పట్టణం,న్యూస్‌టుడే: పురపాలకసంఘం పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న డయల్ యువర్ ఛైర్మన్ గురువారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 వరకు జరుగుతుందని ఛైర్మన్ సుబ్బరాయగుప్తా తెలిపారు. 34వార్డుల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను 08647-222388 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు.



షాట్‌పుట్, లాంగ్‌జంప్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు



గత ఏడాది రొంపిచర్లలో జరుగుతున్న పైకా పోటీలు

ప్రారంభం అట్టహాసంగా..
ప్రస్తుతం అటకెక్కేలా..

విద్యార్థులకు నిర్వహించని పైకా క్రీడలు ☛ పాఠశాలల్లో నేటికీ తయారు కాని ప్రణాళిక

న్యూస్‌టుడే, రొంపిచర్ల

గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యం వెలికి తీసేందుకు ప్రవేశపెట్టిన పంచాయతీ యువ క్రీడా ఔర్ ఖేల్ అభియాన్(పైకా) పథకం క్రమంగా కనుమరుగవుతోంది. ఏటా సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో ఈ ఆటలు నిర్వహించేవారు. కానీ ఈ సారి ప్రణాళికే రూపొందించలేదు. అప్పట్లో అట్టహాసంగా ప్రారంభమైన క్రీడలు నేడు అటకెక్కేలా కనిపిస్తున్నాయి. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించి అవసరమైన వసతులు కల్పించకుండా వదిలేయడంతో పథకం మూలకు చేరుతోంది. ఇందుకోసం పాఠశాల ఆవరణల్లో భవనాలు నిర్మించాల్సి ఉన్నా ఎక్కడా నిర్మించలేదు.. నిర్మించిన వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. అంతేగాక ఆటలకు సంబంధించిన పరికరాలు, సదుపాయాలు కల్పించిన దాఖలాలు లేవు. ఏడాదికి ఒక్కసారి క్రీడా పోటీలు నిర్వహించాల్సి ఉన్నా వాటిని ఈ ఏడాది నిర్వహించలేదు.



కబడ్డీలో శిక్షణ

నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

నరసరావుపేట నియోజకవర్గంలో సుమారు 25వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. కొన్ని పాఠశాలల్లో ఆట స్థలాలు లేవు ఉన్నా అవి అనువుగా లేవు. సదుపాయాలు అంతమాత్రమే. ఆటలు ఆడుకోవడానికి సరైన పరికరాలు సైతం లేవు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకుసుమాలు ఆదిలోనే వాడిపోతున్నాయి. ఆటలపై ఆసక్తి ఉన్న యువత చాలామంది ఉన్నా ప్రోత్సాహం కరవై క్రీడలకు దూరమవుతున్నారు. పైకా పథకాన్ని 2008లో ప్రవేశ పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లోని 14నుంచి18 సంవత్సరాల వయసు కలిగిన యువత, విద్యార్థులు ఆటలు ఆడేందుకు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను వెలికి తీయడానికి విడతల వారీగా పంచాయతీలు ఎంపిక చేసి ఆయా పంచాయతీల పరిధిలోని ఉన్నతపాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఇందుకు గ్రామ స్థాయిలో సర్పంచులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులతో, మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంపీపీలతో కమిటీలు ఏర్పాటు చేశారు. పాఠశాల, మండల, నియోజకవర్గం, డివిజన్, జిల్లాస్థాయిలో ఆటలు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి ఆయా క్రీడల్లో ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేయాలన్నదే అంతిమ లక్ష్యం. అయితే క్రీడలను చిత్తశుద్ధితో నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తేనే ఫలితం ఉంటుంది. అందుకుగాను ప్రతి పంచాయతీ పరిధిలో పైకా భవనాలు నిర్మించటంతోపాటు క్రీడా పరికరాలను కూడా అందించాలి. ఇచ్చిన నిధులు అంతంతమాత్రంగా ఉండటంతో పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. ఖోఖో స్తంభాలు, డిస్కస్‌త్రో, వాలీబాల్, షాట్‌పుట్ తదితర పరికరాలు ఇచ్చారు. ప్రస్తుతం అవన్నీ మూలన పడ్డాయి. తగిన శిక్షణ ఇచ్చి సదుపాయాలు కల్పించి పోటీలకు పంపిస్తే విద్యార్థులు రాణిస్తారు. కానీ అటువంటి పరిస్థితి ప్రభుత్వ పరంగా లేదు. కొద్దోగొప్పో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఏడాదికి ఒకసారి నిర్వహించే పైకా పోటీలు కూడా మొక్కుబడిగా సాగుతున్నాయి. అవికూడా ఈ ఏడాది ప్రారంభానికి నోచుకోలేదు.

నిధులు రాలేదు

పైకా పోటీల నిర్వహణకు ఈ ఏడాది ఇంతవరకు నిధులు రాలేదు. ప్రతి సంవత్సరం అక్టోబర్‌లోనే నిర్వహించే వాళ్లం. క్రీడాకారులు సత్తా చాటడానికి పైకా పోటీలు మంచి అవకాశం. ప్రభుత్వం నిధులు వెచ్చించి క్రీడాకారులను ప్రోత్సహిస్తే ఎంతోమంది క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. నిధులు వస్తే క్రీడలు నిర్వహిస్తాం.

- మాధ్యూబాబు, ఎంపీడీవో

నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు: డీఎస్పీ

నరసరావుపేట పట్టణం,న్యూస్‌టుడే: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేయటమేకాక వాహనాలు సీజ్ చేస్తామని డీఎస్పీ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆటోడ్రైవర్లకు ఏర్పాటుచేసిన అవగాహనా సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఆటోలకు విధిగా పోలీసులు ఇచ్చే నెంబర్లు వేయించాలని డ్రైవర్లు యూనిఫారం దరించాలని లేదంటే కఠినచర్యలు తప్పవని చెప్పారు. లైసెన్స్‌లు లేకుండా ఆటోలు రోడ్డుపైకి వస్తే సీజ్‌చేసి రవాణాశాఖ అధికారులకు అప్పగిస్తామన్నారు. సీఐలు శివప్రసాదు, సురేంద్రబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంతోషమయ జీవనమే విజయం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జీవితాన్ని ఆనందమయం చేసుకోవటాన్ని విజయంగా పరిగణించాలని ప్రముఖ నవలా రచయిత, వ్యక్తిత్వవికాస నిపుణులు యండమూరి వీరేంద్రనాథ్ పేర్కొన్నారు. తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో యాక్సిస్ బ్యాంకు సహకారంతో బుధవారం వ్యక్తిత్వ వికాసంపై సదస్సు నిర్వహించారు. వీరేంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల కార్యదర్శి రావెల సత్యనారాయణ, యాక్సిస్ బ్యాంకు వైస్ ప్రెసిడెంట్ సురేష్, నరసరావుపేట శాఖ మేనేజరు పవన్‌మహేష్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ, విభాగాధిపతులు పాల్గొన్నారు.

పొదిలి కుటుంబ సభ్యులకు పరామర్శ

నరసరావుపేట పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ నేత, మాజీ కౌన్సిలర్ పొదిలి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను వైకాపా నేత కాసు మహేష్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. చక్రారెడ్డి, అంజనారెడ్డి, శ్రీను తదితరులు ఆయన వెంట ఉన్నారు.

దంత సంరక్షణతోనే ఆరోగ్యం

గ్రామీణ నరసరావుపేట, న్యూస్‌టుడే: దంత సంరక్షణతోనే ఆరోగ్యానికి రక్షణ కలుగుతుందని నవభారత్ ఉన్నత పాఠశాల డైరెక్టర్ గడ్డం భూపాల్‌రెడ్డి అన్నారు. లింగంగుంట్లలోని నవభారత్ పాఠశాలలో బుధవారం సిబార్ డెంటల్ కళాశాల వారి సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మరో డైరెక్టర్ జానకిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

రొంపిచర్ల, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖ ప్రజలకు అనేక ఆరోగ్య సేవలను ఉచితంగా అందిస్తోందని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు గీతాంజలి కోరారు. వీరవట్నంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 102 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు బుధవారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సందడి చేశారు. ఈనెల 5, 6 తేదీల్లో కళాశాలలో నిర్వహించనున్న ఈశ్వర్‌ఫెస్ట్‌ను పురస్కరించుకుని ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. కళాశాల కార్యదర్శి కరీమ్‌మొహిద్ధిన్, డైరెక్టర్ మస్తాన్‌షరీఫ్, ప్రిన్సిపల్ డాక్టర్ వి.మూర్తిరావ్ ఖోకలే తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నేతల నిరసన

రొంపిచర్ల, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బూదాల బాబూరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని దిల్లీ తీసుకుపోవాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షకు బీసీ సంఘాల నాయకులు వెంకటేశ్వరాజు, తిమ్మరాజు తదితరులు మద్దతు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

రొంపిచర్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని రొంపిచర్ల ఎంపీపీ రామారావు కోరారు. రొంపిచర్ల, సంతగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు చంద్రన్న విద్యాజ్యోతి పుస్తకాలను అందించారు. యార్డుఛైర్మన్ లింగా వెంకటేశ్వర్లు, సర్పంచి గెలి చిన్న కోటిరెడ్డి, హెచ్‌ఎంలు మోహిద్ధీన్ సాహెబ్, జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి సేవలు నిరుపమానం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: మహిళాభ్యుదయానికి సావిత్రిబాయి పూలే నిరూపమానమైన సేవలందించారని సాయితిరుమల ఎన్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ బి.ఎస్.రాజు పేర్కొన్నారు. కళాశాలలో బుధవారం మహిళా ఉపాధ్యాయదినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా సావిత్రీబాయ్‌పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు, పాల్గొన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో సావిత్రీబాయ్‌పూలే జయంతి నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా విద్యార్థులు తెలుగు పద్యపఠనం అంశంలో పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన కె.జ్యోతి, లక్ష్మీతిరుపతమ్మలకు రూ.1000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, తెలుగు అధ్యాపకులు డాక్టర్ కాకాని సుధాకర్, వై.మనోరమ పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి జయంతి

నరసరావుపేట పట్టణం, న్యూస్‌టుడే: సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలు బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ అధికార ప్రతినిధి కొండపల్లివెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆమె చేసిన కృషి ఎనలేనిదన్నారు. అలెగ్జాండర్ సుధాకర్, బాషా, నాగేంద్ర, గోపి తదితరులు పాల్గొన్నారు. మాలమహానాడు, దళిత బహుజన హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు.



సావిత్రిబాయి చిత్రపటానికి మహిళల నివాళి

నేడు ప్రజ్ఞంలో జన్మభూమి గ్రామ సభ

ప్రజ్ఞం (నిజాంపట్నం), న్యూస్‌టుడే: ప్రజ్ఞం, బావాజీపాలెం గ్రామాల్లో గురువారం ఉదయం జన్మభూమి మాఊరు గ్రామ సభలు జరుగుతాయని ఎంపీడీవో పృథ్వీరాజు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులంతా పాల్గొనాలని ఆయన సూచించారు.

రేపల్లె

అందరూ మరుగుదొడ్డి నిర్మించుకోవాలి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: ఆరోగ్య పరిరక్షణతోనే సుఖమయ జీవనం సాధ్యమని, దీనికి గాను ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మించుకొని సంపూర్ణ పారిశుద్ధ్యానికి బాటలు వేయాలని మండల తెదేపా నాయకులు మొఖమాటం రాధా కృష్ణమూర్తి అన్నారు. జన్మభూమి కార్యక్రమం సందర్భంగా బుధవారం చెరుకుపల్లి మండల విద్యావనరుల కేంద్రం వద్ద ఆరోగ్య పరిరక్షణపై నోడల్ టీమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. మొఖమాటం రాధాకృష్ణమూర్తి, జడ్పీటీసీ సభ్యులు పిట్టు శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పీహెచ్‌సీ సిబ్బంది ఈ సందర్భంగా ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలందించారు. కార్యక్రమంలో చెరుకుపల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు కె.శైలజ, పంచాయతీ కార్యదర్శి విజయబాబు, అసిఫ్ అలి, ఏఎన్ఎంలు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే అసలు లక్ష్యం



రేషన్‌కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్



పోటుమెరకలో జరిగిన సభలో మాట్లాడుతున్న విద్యార్థిని

రేపల్లె, న్యూస్‌టుడే: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. 'జన్మభూమి-మనఊరు'లో భాగంగా రేపల్లె పట్టణంలోని నాలుగు, ఐదు, ఆరు వార్డులకు స్థానిక ఆరోవార్డులోని పటేల్ పురపాలిక పాఠశాల ఆవరణలో సభ నిర్వహించారు. దీనిలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యరక్ష, ఆరోగ్యశ్రీ వంటి కార్యక్రమాలతో ప్రతి ఒక్కరికి ఉచిత వైద్య సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో తెల్ల కార్డులేక వైద్య సదుపాయం లభించని వారికి సీఎం సహాయ నిధి నుంచి రూ.కోట్లు సాయంగా అందచేసామని చెప్పారు. రేపల్లె ప్రభుత్వాసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. నిజాంపట్నం, నగరం, ధూళిపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను 30 పడకల ఆసుత్రులుగా అభివృద్ధి చేసామని, ధూళిపూడిలో రూ.మూడు కోట్లతో ఆసుపత్రి భవనం ఇతర సదుపాయాలు సమకూర్చనున్నామని తెలిపారు. జన్మభూమి ప్రత్యేక అధికారి హోంగార్డ్స్ డీఐజీ కెటి ఉజ్వల్ మాట్లాడుతూ అందరూ విద్యావంతులైతే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రత పాటిస్తూ మంచి ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, చంద్రన్నబీమా చెక్కులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ధనుంజయరావు, పురపాలిక ఛైర్మన్ తాడివాక శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు టీకేవీ గుప్తా, కమిషనర్ ఏఎస్ఎన్‌వి మారుతీ దివాకర్, డీఈఈ వెంకటేశ్వరరావు, సీడీపీవో పరిశా రాధాకృష్ణ, సాంఘిక సంక్షేమ అధికారిణి అన్నపూర్ణ, పశు సంవర్ధక శాఖ అధికారి భవానీప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పోటుమెరక (రేపల్లె అర్బన్): సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందించేందుకు, సమస్యల్ని సత్వరం పరిష్కరించేందుకు ప్రభుత్వం జన్మభూమి-మా ఊరు నిర్వహిస్తోందని జడ్పీటీసీ సభ్యుడు కాగితాల సుబ్బారావు అన్నారు.



నగరం : కొలగానివారిపాలెంలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరయ్య

మండలంలోని రాజుకాల్వ, తుమ్మల, పోటుమెరక గ్రామాల్లో బుధవారం జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలపై పలువురు విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. రాజుకాల్వలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తుమ్మల పశువైద్యశాలకు వైద్యుడు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పశుపోషకులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన అధికారులు పశువైద్యుడు సక్రమంగా వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. రేషన్‌కార్డు, నివేశన స్థలం, పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ తుమ్మలలో 93, పోటుమెరకలో 21, రాజుకాల్వ 25 చొప్పున గ్రామస్థులు అర్జీలు అందజేశారు. మండల ఉపాధ్యక్షుడు కొపనాతి రాజశేఖర్, సర్పంచులు సావిత్రమ్మ, పద్మ, తహశీల్దారు రమణకుమారి, ఎంపీడీవో శోభారాణి, ఎంఈవో నవీన్‌కుమార్, సీడీపీవో రాధాకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



బీమా నగదు చెక్కు అందిస్తున్న తహశీల్దారు

గుర్నాధనగర్ (నిజాంపట్నం): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం 'జన్మభూమి మాఊరు' గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు అబ్దుల్‌వాహెద్ అన్నారు. బుధవారం గుర్నాధనగర్, హారిస్‌పేట గ్రామాల్లో జన్మభూమి గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభలకు సర్పంచులు రాయన కోటేశ్వరమ్మ, చిప్పల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. తహశీల్దారు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రతి కుటుంబ ఆదాయం నెలకు రూ.15వేలు తగ్గకుండా ఉండేందుకు అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. గ్రామంలో దాసరి సుబ్బారావు మృతి చెందగా చంద్రన్న బీమాలో నామిని సాయిగోపాల్‌కు రూ.30 వేల నగదు చెక్కును అందించారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో పృథ్వీరాజు, డీటీ విశ్వేశ్వరరావు, విస్తరాణాధికారి ఊహారాణి, ఏపీఎం శ్రీనివాసరెడ్డి, ఏవో ఆదాంబాబు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నగరం: సమస్యల పరిష్కారమే జన్మభూమి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంపీపీ విచారపు వీరయ్య అన్నారు. బుధవారం రెండో రోజు జన్మభూమి గ్రామసభలు కొలగానివారిపాలెంలో ఎంపీడీవో గణేష్‌బాబు బృందం, తోటపల్లిలో తహశీల్దార్ సుజాత బృందం నిర్వహించింది. కార్యక్రమం ప్రారంభంలో నగరం ఎస్‌వీఆర్ఎం కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రెండు బృందాలుగా విడిపోయి గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ప్రజలకు కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. తోటపల్లి సమావేశంలో పాల్గొన్న జడ్పీటీసీ శివరామకృష్ణ మాట్లాడుతూ జన్మభూమిలో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఎంపీడీవో గణేష్ బాబు సంక్షేమ పథకాల అమలు గురించి గ్రామస్థులకు తెలిపారు. రేషన్ కార్డులు, పింఛన్ మంజూరు ఉపాధి పథకంలో జాబ్‌కార్డుల మంజూరు వంటి సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తోటపల్లి సర్పంచి అనగాని శ్రీనివాసమూర్తి, రేపల్లె వ్యవసాయ ఉప సంచాలకులు ఎం. వెంకటేశ్వర్లు, ఎస్‌వీఆర్ఎం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి మందపాటి దాసు, నగరం మండల పార్టీ అధికార ప్రతినిధి నాగశ్రీను తదితరులు పాల్గొన్నారు.

తెదేపాతోనే సుపరిపాలన సాధ్యం

కావూరు (చెరుకుపల్లి గ్రామీణ): సుపరిపాలన తెదేపాతోనే సాధ్యమని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. 'జన్మభూమి-మా ఊరు'లో భాగంగా బుధవారం మండలంలోని కావూరులో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడలను ఆయన రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. విద్యాజ్యోతి పథకంలో భాగంగా పాఠశాలలో పది విద్యార్థులకు జడ్పీ నిధులతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను జడ్పీటీసీ సభ్యుడు పిట్టు శ్రీనివాసరెడ్డితో కలిసి అందించారు. సభలో పాల్గొన్న డ్వాక్రా మహిళలకు చెక్కులను, ఐసీడీఎస్ చిన్నారులకు, బాలింతలకు పౌష్టికాహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ ముమ్మనేని వెంకట సుబ్బయ్య, నియోజకవర్గ పరిశీలకుడు ఎం.ధనుంజరావు, మండల ప్రత్యేకాధికారి టి.శ్రీనివాసరావు, ఎంపీపీ ఎం.పార్వతి, సర్పంచి పాకాల ఉర్లమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు యలవర్తి తిరుమలరాణి, తహశీల్దార్ ఎ.శేషకుమార్, ఎంపీడీవో షేక్ మహబూబ్‌సుభానీ, ఎంఈవో అలపర్తి ఆంజనేయులు పాల్గొన్నారు. మండలంలోని గూడవల్లిల్లో జన్మభూమి ప్రశాంతంగా జరిగింది. సర్పంచి ఆలపాటి వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎ. శేషకుమార్, మండల ఉపాధ్యక్షుడు గడ్డిపాటి వెంకట్, ఈవోపీఆర్‌డీ బి.వి.మోహన్‌రావు, కార్యదర్శి సురేష్, వీఆర్‌వో రమేష్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. ఎంఎస్ఎం ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో వనజాచంద్ర పబ్లిక్ పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

'మా కూలీ ఇప్పించండి'

ఎమ్మెల్యేకు ఉపాధి కూలీల మొర



ఎమ్మెల్యేను చుట్టుముట్టిన ఉపాధి కూలీలు

కావూరు (చెరుకుపల్లి గ్రామీణ): 'మా కూలీ ఇప్పించండి సార్..' అంటూ ఉపాధి కూలీలు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌ను చుట్టు ముట్టారు. చెరుకుపల్లి మండలం, కావూరులో బుధవారం జన్మభూమి కార్యక్రమం జరిగింది. దీనిలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళుతున్న ఆయనను స్థానిక ఉపాధి మహిళా కూలీలు చుట్టుముట్టారు. తమకు సక్రమంగా కూలీ సొమ్ము అందడం లేదని, వేతన పుస్తకంలో అధికారులు సొమ్ము జమ అయినట్లు నమోదు చేస్తున్నారని, సొమ్ము మాత్రం అందడం లేదని వాపోయారు. దీనిపై స్పందించిన ఆయన ఉపాధి అధికారులను నిలదీశారు. చెల్లించకుండా జమ ఎలా చేస్తారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం ఉపాధి నిధులను నిలిపేసిందని, త్వరలోనే చంద్రబాబు ఉపాధి సొమ్మును పైసాతో సహా అందిస్తారని ఎమ్మెల్యే మహిళలకు భరోసా ఇవ్వడంతో వారు అక్కడి నుంచి వెళ్లారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



పుస్తకాలు అందిస్తున్న రాధాకృష్ణమూర్తి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు 'చంద్రన్న విద్యాజ్యోతి' పథకం కింద జడ్పీ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందిస్తున్నారని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని మండల తెదేపా నాయకులు మొఖమాటం రాధా కృష్ణమూర్తి అన్నారు. బుధవారం పాఠశాలలోని 97మంది పది విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో రాధాకృష్ణమూర్తి, జడ్పీటీసీ సభ్యులు పిట్టు శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శైలజ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉన్నత విద్యావంతులుగా ఎదగాలి



దుస్తులు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ శివరామకృష్ణ

పెదపల్లి(నగరం), న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని జడ్పీటీసీ మేకా శివరామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పెదపల్లి జడ్పీ పాఠశాలలో ఏకరూప దుస్తుల పంపిణీలో పాల్గొన్నారు. పాఠశాలలోని 22 మంది పదో తరగతి విద్యార్థులకు సమదుస్తులు, చంద్రన్న విద్యాజ్యోతి పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందనీ, విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ ఎస్.శివయ్య, పంచాయతీ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, పాఠశాల స్థలదాత కె.వెంకటేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

రాంభొట్లపాలెం (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: కోడిపందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, కఠిన చర్యలు ఉంటాయని చెరుకుపల్లి ఎస్సై జి.రాజేశ్వరావు అన్నారు. బుధవారం మండలంలోని రాంభొట్లపాలెం పంచాయతీ శివారు మోరవాగుపాలెం వద్ద నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఆయన దాడి చేశారు. 6 కోళ్లను, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.1610లను స్వాధీనం చేసుకున్నట్లు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట, కోతముక్క, గుళ్ళాట నిర్వహించకుండా మండలంలో రెండు బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. జూదం, కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే 9440900874కి అందించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ సెల్ నెంబర్‌కు వాట్సప్ ఉందని, వీడియోలు, ఫొటోలను తీసిపంపాలని, ఆయన యువతను కోరారు.

బేతపూడిలో విద్యార్థుల శ్రమదానం

బేతపూడి (రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: జన్మభూమి-మా ఊరులో భాగంగా మండలంలోని బేతపూడి ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం రేపల్లె క్రైస్తవ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాల్లోని పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. నాగార్జున విశ్వవిద్యాలయం సమన్వయకులు రవిశంకరరెడ్డి, ప్రధాన అధ్యాపకులు రత్నప్రసాద్, ప్రధానోపాధ్యాయిని చైతన్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు కోటేశ్వరరావు, జగన్, డానియేల్ పాల్గొన్నారు.



స్పందించకుంటే తప్పదు ముప్పు!

- ☛ మురుగు కాల్వలపై వంతెనలు శిథిలం
- ☛ బిక్కుబిక్కుమంటూ ప్రజల రాకపోకలు



నిజాంపట్నం, న్యూస్‌టుడే : రేపల్లె నియోజకవర్గంలో మురుగు కాల్వలపై ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరాయి. ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో 20 వంతెనల వరకు దుస్థితిలో ఉన్నాయి. నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వేసవిలో మరమ్మతులు చేయాలని.. అవసరమైతే కొత్తవి నిర్మించి సమస్య లేకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు. నిజాంపట్నం మండలంలో నిజాంపట్నం, దర్వేష్ పాలెం గ్రామాల మధ్య ఉన్న వంతెన రూపురేఖలు కోల్పోయింది.. గోడలు ఎప్పుడో కూలాయి. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అచ్యుతపురం సమీపంలో ముత్తుపల్లి గ్రామం ప్రవేశం వద్ద ఉన్న వంతెన శిథిలమైంది. గతంలో ఓ పాఠశాల బస్సు అదుపు తప్పింది. ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకొన్నారు. తాటికాయల రేవు, నంగేడి రేవులపై ఉన్న వంతెనలు పెచ్చులూడుతున్నాయి. ప్రజ్ఞం, కళ్లిఫలం గ్రామాల మధ్య వంతెన గోడలు కూలిపోయాయి. గుణ్ణంతిప్ప వద్ద వంతెన అధ్వానంగా ఉంది. కొత్తపాలెం, మోళ్లగుంట సమీపంలోని వంతెనలదీ అదే పరిస్థితి.

☛ రేపల్లె మండలంలోని మోళ్లగుంట, సింగుపాలెం గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరాయి. నగరం తహశీల్దారు కార్యాలయ సమీపంలో, ఉల్లిపాలెంలో కాల్వపై ఉన్న వంతెనలదీ అదే దుస్థితి. చెరుకుపల్లి మండలంలో కావూరు సమీపంలో ఉన్న వంతెన శిథిలమైంది. అక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో అక్కడ పెను ప్రమాదమే జరగ్గా పోలీసులు హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేశారు.


శిథిలమైన నిజాంపట్నం, దర్వేష్‌పాలెం గ్రామాల మధ్య వంతెన


ప్రజ్ఞం- కళ్లిఫలం మార్గంలో లేని రక్షణ గోడలు


శిథిలావస్థలో కోనఫలం ఊరి బయట వంతెన

మరమ్మతులకు ప్రతిపాదనలు

శిథిలావస్థకు చేరిన వంతెనలకు మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం. నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తాం.

- ఏసయ్య, డీఈ, డ్రైనేజీ

చింతయ్య, సూరమ్మలు ఆదర్శప్రాయులు

బొర్రావారిపాలెం (నిజాంపట్నం), న్యూస్‌టుడే: కేసన చింతయ్య, సూరమ్మ దంపతులు నేటి తరానికి ఆదర్శప్రాయులని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి అంగిరేకుల ఆదిశేషు పేర్కొన్నారు. సూరమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం బొర్రావారిపాలెంలో వారి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ గౌడ సంఘ కన్వీనర్ జి.ద్వారకా శ్రీను, మండల బీసీ సంఘ అధ్యక్షుడు కొపనాతి నాగబాబు, చింతలప్రసాద్, ప్రియదర్శినిగౌడ్, పి. వెంకటేశ్వరరావు, గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.





సావిత్రిబాయి పూలే సేవలు నిరుపమానం

ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

చినమట్లపూడి (నగరం), న్యూస్‌టుడే: మహిళల విద్యావ్యాప్తికి సావిత్రిబాయిపూలే సేవలు నిరుపమానమని మండల ఎస్టీయూ అధ్యక్షుడు ఇమాముద్దీన్ ఖాదరి అన్నారు. బుధవారం చినమట్లపూడి ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఖాదరి మాట్లాడుతూ సావిత్రిబాయి జయంతిని ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం అభినందనీయమన్నారు. మండలంలోని మహిళా ఉపాధ్యాయినిలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.చక్రవర్తి విక్టోరియారాణి, నాజిని సుల్తానా, బి.రేవతి, పద్మావతి, తదితర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రేపల్లె : బాలికా విద్యకు పునాది వేసిన సావిత్రిబాయిపూలే భారత తొలి ఉపాధ్యాయురాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా నాయకుడు బెజ్జం శ్రీనివాసరావు శ్లాఘించారు. స్థానిక 13వ వార్డులోని అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) కార్యాలయంలో సావిత్రిబాయిపూలే 187వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటంతో ప్రదర్శన నిర్వహిస్తూ నినాదాలు చేసారు. ప్రగతిశీల మహిళా సంఘం, ఏఐకెఎంఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ నాయకుడు మేకల ప్రసాద్, సుబ్బులు, రేపల్లె కుమారి, పల్లవి, బొజ్జా కుమారి తదితరులు పాల్గొన్నారు.


రేపల్లె : ప్రదర్శన నిర్వహిస్తూ నినాదాలు చేస్తున్న నాయకులు

రేపల్లె : మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక నేతాజీ పురపాలిక ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేసారు. కార్యక్రమంలో ఎంసీఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేజళ్ల ప్రకాశరావు, సభ్యులు జి బాపారావు, వి సాంబశివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. సాయిప్రసాద్, ఉపాధ్యాయులు ఆంజనేయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి గ్రామీణ : సావిత్రిబాయిపూలే 185వ జయంతిని పాఠశాలల్లో నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయినుల దినోత్సవం సందర్భంగా గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాలు జరిగాయి. తొలుత సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులు ఆమెకు ఘన నివాళి అర్పించారు. అనంతరం సీనియర్ మహిళ ఉపాధ్యాయులు నాగలక్ష్మి, వాణీలను సత్కరించారు. మండలంలోని రాంభొట్లపాలెం ఎంపీయూపీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

నిజాంపట్నం: నిజాంపట్నం శివపురం ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏజీకేపేట పాఠశాల సముదాయ పరిధిలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలుత సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహిళా ఉపాధ్యాయినులు బ్రిజేతమ్మ, శ్యాంసునీతలను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సరళ, హుస్సేన్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నగరం: ఉపాధ్యాయినులకు బహుమతులు అందిస్తున్న ఖాదరి

రేపల్లె అర్బన్ : సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సభ జరిగింది. అత్యధిక కాలం సేవలు అందిస్తున్న ఐదుగురు ఉపాధ్యాయినులకు పూలమాల, శాలువ బహూకరించి సన్మానించారు. తహశీల్దారు రమణ కుమారి, ఎంపీడీవో శోభారాణి, ఎంఈవో నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు గౌరీశంకర్, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేటేరు (రేపల్లె అర్బన్) : మండలంలోని పేటేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినులకు ప్రధానోపాధ్యాయుడు ప్రభుకుమార్ పండ్లు, కలం బహూకరించి సత్కరించారు.



వినుకొండ

సినిమాలు

సురేష్- 2కంట్రీస్, **అరుణ-**ఒక్కక్షణం, **కీర్తి-** హలో, **వెంకటేశ్వర-** ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయ్)

గ్యాస్ సమాచారం

ఏజెన్సీ	ఫోన్లు	డెలివరీ రన్నింగ్
హెచ్‌పీ	272191, 275191	30-12-2017
భారత్	273500, 273600	30-12-2017

కూరగాయల ధరలు(నిన్నటివి)

టమోటా రూ.10, మిర్చి రూ.40, బెండకాయ రూ.30, దొండకాయ రూ.30, దోసకాయ రూ.20, గోరుచిక్కుడు రూ.30, క్యాబేజీ రూ.40, క్యారెట్ రూ.60, బంగాళాదుంప రూ.20, వంకాయ రూ.40, బీరకాయ రూ.40, సొరకాయ రూ.20, కాకరకాయ రూ.40.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు



పిల్లలకు బోగిపళ్లు పోస్తున్న ఎమ్మెల్యే జీవీ తదితరులు

వినుకొండ, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో ఇప్పటి వరకు రూ.12కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చెప్పారు. జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా 4వార్డు సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులకు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశవిదేశాలు తిరిగి పెట్టుబడులు తేవడం వల్ల ఇప్పటి వరకు రాష్ట్రంలో 5లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని రానున్నకాలంలో మరో మూడు లక్షల మందికి ఉపాధి కల్పిస్తారని పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ సీహెచ్ సమీరా ఖానమ్ 4, 5, 6 వార్డుల్లో ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడుతూ ఇంటింటికి మరుగుదొడ్డి నిర్మించి ప్రభుత్వం ఇచ్చే రూ.15వేలు ఆర్థిక సహాయం పొందాలని సూచించారు. ఇంటి ముందు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు. కుళాయి, డ్రైనేజీ సమస్యలుంటే పురపాలక సంఘంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర ప్రజల నుంచి అందిన విజ్ఞప్తులు స్వీకరించారు. ప్రతి అర్జీపై ఆధార్, ఫోన్‌నెంబర్ రాయాలన్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆటల పోటీలను ఛైర్‌పర్సన్ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఇతర ఉద్యోగులు కొద్దిసేపు సరదాగా కబడ్డీ ఆడారు. బాలబాలికల నృత్యప్రదర్శనలు అలరించాయి. బాలింతలకు శ్రీమంతం, పిల్లలకు బోగిపళ్లు పోయించారు. మెప్మా ఆధ్వర్యంలో రుణాలు, పౌరసరఫరాలశాఖ చంద్రన్న కానుకలను నేతలు పంపిణీ చేశారు. మొత్తం 54 అభ్యర్థనలు అందాయని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ పెండెల శ్రీనివాసరావు కౌన్సిలర్లు పోలూరి అంజలిదేవి, ఎం.ప్రసాద్, జజ్జూరి గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలం

నూజండ్ల, న్యూస్‌టుడే: ఆరోగ్యంగా ఉన్నప్పుడే జీవితంలో ఏదైనా సాధించగలమని ప్రధానోపాధ్యాయులు అన్నపూర్ణమ్మ అన్నారు. జ్మభూమి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆరోగ్యం ఆనందం కార్యక్రమాన్ని నూజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు జన్మభూమి, ఆనందం ఆరోగ్యంపై ప్రతిజ్ఞ చేశారు.

నూజండ్ల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించడానికే జన్మభూమి కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందని వినుకొండ నియోజకవర్గ పరిశీలకులు, ప్రత్యేకాధికారి బీఎస్ఎన్ మూర్తి అన్నారు. బుధవారం కొండలరాయునిపాలెంలో జరిగిన జన్మభూమి-మాఊరులో ఆయన మాట్లాడారు. ముఖ్యమంతి అధికారులు, ప్రజలతో నిరంతరం సమీక్షలు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. మండల ప్రత్యేకాధికారి ఆదినారాయణరావు మాట్లాడుతూ ఈరోజు ఆరోగ్యం ఆనందం కార్యక్రమం ప్రత్యేకత గురించి వివరించారు. చిన్నారులకు బోగిపండ్లు పోసి పండగ వాతావరణం కల్పించారు. గర్భిణిలకు సీమంతం నిర్వహించారు. గృహ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. జన్మభూమి పాతజడ్డావారిపాలెం, పెద్దవరంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నంబుల అంజమ్మ, జడ్పీటీసీ మురుగుల ఆదెమ్మ, తహశీల్దార్ పద్మాదేవి, ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ శ్రీనివాస్, సర్పంచులు రాజారావు, సుబ్బారావు, కృష్ణ తదితర నేతలు పాల్గొన్నారు.

గోకనకొండ(వినుకొండపట్టణం),న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారుడికి చేరాలని, ఆదిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తహశీల్దారు షేక్ గౌస్‌బుడేసాహెబ్ అన్నారు. మండలంలోని గోకనకొండ, నీలగంగవరం, వెంకుపాలెం గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు పింఛన్లు అవసరమైన వారు దరఖాస్తులను అందించారు. నీలగంగవరంలో ఎంపీడీవో ఎ.రాధాకృష్ణ, వెంకుపాలెంలో ఈవోపీఆర్‌డీ లిల్లీపుష్పం ఆధ్వర్యంలో సభలు నిర్వహించారు. గ్రామస్తులతో జన్మభూమి ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల డీటీ నరసింహారావు, ఎంఈవో సయ్యద్ జఫ్రుల్లా, ఏవో జి.వరలక్ష్మి, సర్పంచి వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



నూజండ్ల జడ్పీ పాఠశాలలో ఆరోగ్యం ఆనందంపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



జన్మభూమి గ్రామసభలో మాట్లాడుతున్న అధికారి



గోకనకొండలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మతుకుమల్లి(శావల్యాపురం),న్యూస్‌టుడే: జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎల్.విజయ్ చందర్ అన్నారు. బుధవారం మతుకుమల్లిలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు కొంత మంది 11 గంటలకు రావడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఆయన ఎంపీడీవో జి.చంద్రశేఖర్‌తో అధికారులు అందరూ ఇక నుంచి 10 గంటలకు కల్లా కార్యక్రమానికి హాజరు అయ్యేలా ఆదేశాలు జారీచేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని , మానవునికి అన్నింటి కన్నా ఆరోగ్యం ముఖ్యమని, విద్య, ధనం కన్న ఆరోగ్యం బాగుండాలని కోరారు. ఇందుకోసం ప్రతి ఒక్కరు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుని, బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా నమోదు కావడానికి తోడ్పాటు అందించాలని కోరారు. జడ్పీ పాఠశాల బాలికలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. అనంతరం చంద్రన్నబీమా యోజన ఉపకార వేతనాలు, చంద్రన్నకానుకలు పంపిణీచేశారు. తహశీల్దారు వి.కోటేశ్వర రావునాయక్, ఎంపీపీ వై.అనంతమ్మ, మండల స్థాయి అధికారులు సూర్యతేజ, నాగేశ్వరరావు, సాంబశివారెడ్డి, బాలాజీనాయక్, శ్రీనివాసరావు, ఎం.సాంబశివరావు తెదేపా నేతలు ప్రసాద్, కోటినారాయణ, వెంకటకోటయ్య పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు వడ్డీరాయితీ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చెప్పారు. బుధవారం సాయంత్రం బొల్లాపల్లిలో నిర్వహించిన జన్మభూమి సభలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో బ్యాంకు సౌకర్యం, గురుకుల పాఠశాల మంజూరు, బొల్లాపల్లి-వెల్లటూరు, గుమ్మనంపాడు-మేళ్లవాగు రహదారులను అభివృద్ధి చేయాలని ప్రజలు విన్నవించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి రమేష్, ఎంపీపీ పత్రా కోటేశ్వరరావు, జడ్పీటీసీ సంతోషమ్మ, సర్పంచి రాజమ్మ, వాసుదేవరెడ్డి నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈపూరు, న్యూస్‌టుడే: వాగ్వాదాలు, ఉద్రిక్తతల మధ్య ఊడిజర్లలో బుధవారం జన్మభూమి-మాఊరు జరిగింది. అలాగే అగ్నిగుండాల, ఊడిజర్ల గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి మూర్తి కార్యక్రమంలో పాల్గొని వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. ఊడిజర్లలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో అక్రమాలు జరిగాయని, ఉపాధిహామీ పథకం కూలీ డబ్బు చెల్లించలేదని, వేలిముద్రలు పడలేదంటూ రేషన్ ఇవ్వడం లేదని, గ్రామస్థులు వివిధ పథకాల కోసం గతంలో ఇచ్చిన దరఖాస్తులను పక్కన బెడుతున్నారని ఇంకా అనేక కారణాలతో గ్రామస్థులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి గొడవ సద్దుమణిగేలా చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సుభాషిణి, తహశీల్దారు ప్రశాంతి, ఎంపీపీ రాపర్ల రామాంజమ్మ, యార్డు ఛైర్మన్ గన్నమనేని వెంకయ్య, జడ్పీటీసీ సభ్యుడు బందెల కన్నయ్య, రాపర్ల జగ్గారావు, ఎంపీటీసీ సభ్యురాలు గంటా మహాలక్ష్మమ్మ, ఇన్‌ఛార్జి సర్పంచి కాంద్రకొండ వెంకటరమణ, పాపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, చాగం రెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతుకుమల్లిలో మరుగుదొడ్ల బిల్లుల స్వాహాపై రగడ

మతుకుమల్లి(శావల్యాపురం),న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధికి గ్రామంలో నిర్వహించే సమావేశాలకు కనీస సమాచారం ఇవ్వడం లేదని మతుకుమల్లి ఎంపీటీసీ కల్వాకూరి మరియబాబు నేలపై కూర్చొని నిరసన తెలిపాడు. బుధవారం జడ్పీ పాఠశాలలో నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో నిరసన వ్యక్తం చేశాడు. సమావేశానికి హాజరైన నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎల్.విజయ్‌చంద్, మండల ప్రత్యేకాధికారి జి.హరనాథబాబుకు గ్రామస్థులు గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయని, అధికారులు ఇప్పుడు తమతోపాటు వస్తే జరిగిన అక్రమాలు చూపిస్తామని పేర్కొన్నారు. లబ్ధిదారులు వ్యక్తిగతంగా తమ సొంత నిధులతో మరుగుదొడ్లు నిర్మించుకుంటే, ప్రభుత్వ ప్రోత్సాహకం రూ.15వేలను లబ్ధిదారులకు తెలియకుండానే నేరుగా గుత్తేదారుని పేరుతో డ్రా చేసుకున్నారని ఇదేమని అడిగితే తమకు తెలియదని చెబుతున్నారని పేర్కొన్నారు. మరో పక్క రెండేళ్ల క్రితం మరుగుదొడ్డి నిర్మించుకుంటే వారి పేరు మీద అక్రమంగా బిల్లులు తీసుకున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వృద్ధులకు పింఛన్ల పంపిణీలో భారీ అక్రమాలు జరిగాయని, పంచాయతీ కార్యదర్శి వృద్ధులకు వేలిముద్ర పడటం లేదని చెప్పి ప్రతి ఒక్కరి వద్ద నుంచి రూ.300చొప్పున స్వాహా చేశారని తెలిపారు. ఈ సమయంలో సర్పంచి, వ్యతిరేక వర్గీయులు ఒకరిపై ఒకరు వాగ్వాదానికి దిగారు.



అధికారులతో గ్రామస్థుల వాగ్వాదం

పోలీసుల సహాయంతో సభ నిర్వహణ

ప్రజల సమస్యలు, గ్రామంలో పథకాల అమల్లో జరుగుతున్న అవినీతిని అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లేందుకు తాము ప్రయత్నిస్తే పోలీసు అధికారుల సహాయంతో తమ నోరు నొక్కారని గ్రామానికి చెందిన చింతా గంగయ్య, భీమని శ్రీనివాసరావులు తెలిపారు. గ్రామానికి 414 మరుగుదొడ్లు మంజూరు అయితే ఇందులో 50 శాతం మేర అక్రమాలు చోటు చేసుకున్నాయని, జన్మభూమిలో ప్రజలు అడుగుతారని తెలిసి రెండు రోజుల క్రితం లబ్ధిదారులకు మొదటి విడత కింద రూ.6వేలు మొత్తాన్ని పంచాయతీ కార్యదర్శి పిలిచి అందచేశారని పేర్కొన్నారు. సమాచారం హక్కు చట్టం ద్వారా పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను అందచేయాలని కోరితే 50 రోజులు అయిన ఇంతవరకు ఇవ్వలేదని పేర్కొన్నారు.



ధనుర్మాసం సందర్భంగా పట్టణంలో లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ విగ్రహాలను బుధవారం సాయంత్రం ఊరేగిస్తున్న భక్తులు

పెదకంచర్ల రోడ్డుకు మరమ్మతులు

వినుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని పెదకంచర్ల రహదారి మరమ్మతులు మొదలయ్యాయి. తారు లేచిపోయి కంకర మొనదేలి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామస్థుల అభ్యర్థన మేరకు ఎంపీ రాయపాటి సాంబశివరావు రూ.10లక్షలు కేటాయించారు. గోనుగుంట్ల వారి పాలెం రావి చెట్టు నుంచి పెదకంచర్ల వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు 50శాతం జత చేసి మొత్తం రూ.20లక్షలు వాడాలని పేర్కొన్నారు. కేటాయింపులు జరిగి రెండు నెలలు గడిచినా పనులు జరగకపోవడంతో మంగళవారం రాత్రి గ్రామస్థులు మండల తెదేపా నేత మాదాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జీవీని కలసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అధికారులను ఆదేశించడంతో బుధవారం జేసీబీతో పనులు మొదలు పెట్టారు.

జాతీయ పోటీలకు ఎంపిక

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: టెన్నిస్, క్రికెట్‌లో జాతీయ స్థాయి పోటీలకు మేళ్లవాగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి. వెంకటేష్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు స్వర్ణరాజ్ తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

వినుకొండ

సీజీబీని సందర్శించిన విజిలెన్స్ అధికారి

శావల్యాపురం,న్యూస్‌టుడే: శావల్యాపురంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకును బుధవారం రీజనల్ విజిలెన్స్ అధికారి బి.వి.ఎన్.మూర్తి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మేనేజరు ఇ. చంద్రశేఖర్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రస్తుతం బ్యాంకు పరిస్థితి, రికవరి, రుణాల మంజూరు, డిపాజిట్లు మొదలగు వాటి గురించి అడిగి తెలుసుకున్నారు.

కంటి వైద్య ఉచిత శిబిరం

కొండలరాయునిపాలెం(నూజండ్ల), న్యూస్‌టుడే: శివశక్తి లీలా అండ్ అంజన్ పౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కొండలరాయునిపాలెంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యంత్రాల ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి కళ్ల జోళ్లు, కంటి శుక్లాలు శస్త్రచికిత్సలు అవసరమైనవారిని గుర్తించారు. త్వరలో పౌండేషన్ ద్వారా అందరికీ కళ్లజోళ్లు అందజేయనున్నట్లు మేనేజర్ రమణారావు పేర్కొన్నారు. లగడపాటి వెంకట్రావు, ముంద్రు సుబ్బారావు, మల్లేశ్వరరావు, మురుగుల రవి, వీరాంజనేయులు, తదితరులున్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



సావిత్రి బాయిపూలే చిత్రపటం వద్ద విద్యార్థుల నివాళి



వినుకొండ పట్టణంలో..

శానంపూడి(శావల్యాపురం),న్యూస్‌టుడే: భారతదేశంలో మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు, మహిళల కోసం ప్రత్యేకంగా పాఠశాల స్థాపించిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయిపూలే అని ప్రధానోపాధ్యాయుడు బిళ్లారాజారమేష్ అన్నారు. బుధవారం సాయంత్రం శానంపూడి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయిపూలే 186 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుబాబు, శ్రీలక్ష్మీ , కాలనీ వాసులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రోత్సాహం

వినుకొండపట్టణం, న్యూస్‌టుడే: మహిళలకు విద్యను ప్రోత్సహించిన సావిత్రిబాయి పూలె సేవలు మరువలేనివని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.ఆర్.దేవి అన్నారు. సావిత్రిబాయి జయంతి సందర్భంగా రవీంద్ర ఉన్నత పాఠశాలలో బుధవారం జయంతి వేడుకలను నిర్వహించారు. దేవి మాట్లాడుతూ స్త్రీ విద్యావంతురాలైతే సమాజం బాగుపడుతుందన్నారు. బాలికలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. సావిత్రిబాయిపూలె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జి. యేసు, తిరుమల లక్ష్మి, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఎస్. రామాంజనేయులు, నాసర్‌బీ, హెచ్ఎం ఎస్ఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఈపూరు, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలే జయంతిని ఈపూరు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ రాపర్ల రామాంజమ్మ సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కేజీబీవీ ప్రత్యేక అధికారిణి భారతి, ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ వెళాంగిణి మేరీ, జగ్గారావు, కన్నయ్య, డి. ఉమాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



వినుకొండ మండలంలోని నీలగంగవరంలో బుధవారం నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలకు చెక్కులు అందజేస్తున్న అధికారులు



తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టీఎన్‌యూఎస్) పాకెట్ డైరీలను నందమూరి అభిమానుల కార్యాలయంలో బుధవారం ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీపీ వెంకట్రావు, సంఘ ప్రతినిధులు

పేద పిల్లల విద్యాభివృద్ధికి కృషి

పాతనాగిరెడ్డిపల్లె(నూజండ్ల), న్యూస్‌టుడే: పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఐటీసీ, అసిస్టు సంస్థలు పనిచేస్తున్నాయని సంస్థ నిర్వాహకులు రామూర్తి అన్నారు. పాతనాగిరెడ్డిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల అనంతరం కార్యక్రమం ప్రారంభించారు. సంస్థ తరుపున మూడు నెలలు పాటు విద్యార్థులకు పౌష్టికాహారం, ఆటపాటలతో కూడిన విద్యను అందించనున్నట్లు ప్రకటించారు. పాఠశాలకు వాటర్ క్యాన్లు, విద్యార్థులకు కావల్సిన పుస్తకాలు, బెల్టు, బ్యాడ్జీలు, బూట్లు, సంచులు, తదితర వస్తువులు అందజేశారు. ట్యూషన్ కోసం ప్రత్యేక ఉపాధ్యాయుడు, సహాయకురాలును సంస్థ వారు నియమించారు. సాయంత్రం ఉడికిన గుడ్డుతోపాటు బిస్కట్లు, వేరుశనగ ఉండలు తదితర ఆహార పదార్థాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి పేరయ్య, హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు గ్రామస్థులు తదితరులున్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయం

పోట్లూరు(శావల్యాపురం), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు వసతులు కల్పించడానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని వేల్పూరు పాఠశాల సముదాయ ఛైర్మన్ కె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పోట్లూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రముఖ స్వచ్ఛంద సంస్థ అసిస్ట్ సంస్థ వారు పాఠశాల అనంతరం కార్యక్రమం రెండేళ్లుగా నిర్వహిస్తుంది. విద్యార్థులకు ప్రతిరోజు పౌష్టికాహారం, బ్యాగు, బెల్టు, టై, బూట్లు, ప్రతిరోజు యోగా చేయడానికి కూర్చోవడానికి పట్టాను సంస్థ ప్రతినిధులు అందజేశారు. సర్పంచి జి.సుందరమ్మ, ఎంపీటీసీ జి. ఆంజనేయులు, జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యశాల ప్రారంభం

వినుకొండపట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా క్రాంతి దంత వైద్యశాలను బుధవారం ఏపీ వైద్య విధాన పరిషత్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ గోగినేని సాంబశివరావు ప్రారంభించారు. ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.